సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 311

గురువారం 1-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



టాప్ ర్యాంక్‌లో అశ్విన్.

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గానే భారత స్పిన్నర్ - 14లో



సుంకం తగ్గింపు


ఫోన్ల విడిభాగాలపై దిగుమతి సుంకం 10 శాతానికి తగ్గించిన కేంద్రం - 15లో



బలమైన దేశంగా ఎదిగాం

అయోధ్యలో రామమందిర నిర్మాణ కల నెరవేరిందని.. కేంద్రం కృషితో బలమైన దేశంగా ఎదిగామని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

వివరాలు 6లో ▸



'జ్ఞానవాపి'లో పూజలకు అనుమతి

వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లోని హిందూ దేవతలకు పూజలు చేసుకునేందుకు జిల్లా కోర్టు అనుమతి ఇచ్చింది.

వివరాలు 6లో ▸



ఛత్తీస్‌గఢ్‌లో మావోల బంకర్లు

తెలంగాణకు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నది ఒడ్డున మావోయిస్టులు నిర్మించిన బంకర్లను పోలీసులు గుర్తించారు.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు

తోషఖానా కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీకి కోర్టు 14 ఏళ్ల చొప్పున జైలుశిక్ష విధించింది.

వివరాలు 6లో ▸

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి

3లో

3న ఏలూరులో 'సిద్ధం' బహిరంగ సభ

- పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ మిథున్‌రెడ్డి, తలశిల, ఆళ్ల నాని
- సభా ఏర్పాట్ల పనుల పరిశీలన
- లక్షలాది మంది రాక నేపథ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు

- వివరాలు 2లో

'సాధికారత'తో మురిసిన మంగళగిరి

- పట్టణంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- సగర్వంగా సాధికారత ప్రదర్శించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

- వివరాలు 2లో

6,100 పోస్టులతో డీఎస్సీ

సీఎం జగన్ నేతృత్వంలో కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

టీచర్ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు.. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల

- 185 కేంద్రాల్లో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు
- వయోపరిమితి 42 ఏళ్లు.. రిజర్వుడ్ వర్గాలకు ఐదేళ్లు సడలింపు
- అంతకంటే ముందే 8 రోజుల పాటు 'టెట్' నిర్వహణ
- అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లు సహా 689 పోస్టుల భర్తీ
- 2025-26లో 1వ తరగతి నుంచి 'ఐబీ' సిలబస్ అమలుకు చర్యలు
- 2035 నాటికి టెన్త్.. 2037 నాటికి ప్లస్ 2 విద్యార్థులకు ఐబీ బోర్డు సర్టిఫికేషన్‌తో పరీక్షలు
- 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తుదివిడత 'వైఎస్సార్ చేయూత' పంపిణీ
- 26.98 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు రూ.5,060 కోట్ల సాయం
- వర్సిటీల్లో బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు
- సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో రూ.22,302 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రానికి జేఎస్‌డబ్ల్యూ, ఆగ్వా గ్రీన్, ఎకోరెన్ ఎనర్జీ, రెన్యూ విక్రం శక్తి లాంటి సంస్థల రాక
- రూ.12,264.36 కోట్లతో అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు పచ్చజెండా



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ - 2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖతో పాటు గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ స్థాయిలో బోధన కొనసాగేలా భారీగా ఉపాధ్యాయులను నియమించనుంది. ఎస్సీఈఆర్టీ పర్యవేక్షణలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ సిలబస్) విధానాన్ని ప్రవేశపెట్టేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ఏడాది టీచర్లకు ఈ విధానంపై సమగ్రంగా శిక్షణ ఇచ్చి 2025–26 విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి ఐబీని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏటా

మిగతా 3వ పేజీలో ▶

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఏపీ విద్యా శాఖ, ఐబీ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి బొత్స తదితరులు



'ఐబీ' అందరికీ

సీఎం జగన్ సమక్షంలో 'ఐబీ' ఒప్పంద పత్రాలపై సంతకాలు

ప్రభుత్వ విద్యావ్యవస్థలో చరిత్రాత్మక ఘట్టం

- భావితరాలకు నాణ్యమైన విద్య అవసరం
- మన విద్యా విధానాలను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది
- మార్గదర్శకాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ
- 2025 జూన్ నుంచి ఒకటో తరగతిలో ఐబీ సిలబస్‌తో బోధన ఆరంభం

> భావి తరాలకు నాణ్యమైన విద్య అందించడం ఎంతో ముఖ్యం. భవిష్యత్తు తరాలు మంచి ఉద్యోగాలు సాధించాలన్నా, ప్రపంచంలో నంబర్‌వన్‌గా నిలవాలన్నా నాణ్యమైన విద్యే కీలకం.
>
> - ఐబీతో ఒప్పందంలో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ విద్యా బోధన దిశగా కీలక ఘట్టం పూర్తి అయ్యింది. రాష్ట్రంలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) సిలబస్ అమలు చేసేందుకు విద్యాశాఖతో ఐబీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఐబీ చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్నోవేషన్) డాక్టర్ అంటోన్ బెగుయిన్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఐబీ డైరెక్టర్ జనరల్ ఓలి పెక్కా హీనోనెన్ ఈ కార్యక్రమంలో జెనీవా నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ

మిగతా 16వ పేజీలో ▶

బీజేపీ ఒంటరి పోరు!

- నేడు రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభం
- లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రతిపాదిత అభ్యర్థుల జాబితా సిద్ధం
- ప్రతి నియోజకవర్గంలో 37 మందితో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు
- ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలంటూ పోస్టర్లు
- ఫిబ్రవరి 4 తర్వాత అమిత్‌షా, రాజ్‌నాథ్, నడ్డా పర్యటనలు
- ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలతో బీజేపీ అగ్రనేతల సమావేశాలు

- వివరాలు 11లో

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

అన్ని జిల్లాల్లోని సచివాలయాల్లో మొదలైన కార్యక్రమం

- తొలి రోజే పదివేల డాక్యుమెంట్లు జారీ
- నేటి నుంచి మరింత వేగం పుంజుకోనున్న రిజిస్ట్రేషన్లు
- 15 రోజుల్లో 30.61 లక్షల రిజిస్ట్రేషన్ల పూర్తికి చర్యలు
- సంపూర్ణ శాశ్వత హక్కులపై దస్తావేజుల్లో స్పష్టీకరణ
- స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్, యూజర్ చార్జీలను భరిస్తున్న ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ తర్వాత కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వడానికి సన్నాహాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జోరుగా ప్రారంభమైంది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో పంపిణీ చేసిన 30.61 లక్షల ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. తొలిరోజే పది వేల డాక్యుమెంట్లు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాల్సిన

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



బడ్జెట్‌లో ధరలు పెరుగుతాయని తీసుకొచ్చారు సరే! ఒకవేళ వీటి ధరలే తగ్గితే ఎలానండీ!!

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టు

మనీ లాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ

నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న అధికారులు

అరెస్టు కంటే ముందే సీఎం పదవికి హేమంత్ రాజీనామా

కొత్త సీఎంగా జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్

ప్రతిపాదించిన జేఎంఎం కూటమి నేతలు



హేమంత్ సోరెన్



చంపయ్ సోరెన్

➤ జార్ఖండ్ రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ అధికారులు జార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి 9.30కి అరెస్టు చేశారు. అంతకుముందు దాదాపు 7 గంటల పాటు అధికారులు సుదీర్ఘంగా విచారించారు. గురువారం ఉదయం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అరెస్టుకు ముందే హేమంత్ సోరెన్ జార్ఖండ్ సీఎం పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ పెద్దసంఖ్యలో జేఎంఎం నేతలు, కార్యకర్తలు రాంచీకి చేరుకున్నారు. కాగా, ఈడీ అధికారులపై హేమంత్ సోరెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. - వివరాలు 6లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మాలాంటోళ్లకూ సొంతిల్లు



మేం వలస జీవులం. బతుకు తెరువుకోసం ఒక చోట స్థిరంగా ఉండలేక ఊరూర భిక్షాటన చేసుకునే వాళ్లం. 20 ఏళ్ల కిందట కర్నూలు జిల్లా కోసిగికి వచ్చి ఊరు చివర గుడారాలు వేసుకుని జీవిస్తున్నాం. మాది ఉమ్మడి కుటుంబం. ఈరమ్మ, కాశమ్మ, అనుమంతి, యల్లమ్మ అనే నలుగురు కుమార్తెలు, శివశంకర్, శివచంద్రశేఖర్, శివరాములు అనే ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక మా కుటుంబంలో వెలుగు కనిపిస్తోంది. శివశంకర్ ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి, శివ చంద్రశేఖర్ అయిదో తరగతి చదువుతున్నారు. ఒకరికి అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15,000 వస్తోంది. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాం. నేను, నా భర్త అయ్యప్ప ఇంటి దగ్గర తట్టలు, బుట్టలు తయారు చేస్తుంటాం. మా పిల్లలు వాటిని చుట్టు పక్కల ఊళ్లల్లో అమ్ముతారు. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఆదాయం వస్తోంది. ఈ సొమ్ము ఇంటి అవసరాలకే సరిపోయేది. చేయూత ద్వారా ప్రతి ఏటా రూ.18,750 నా ఖాతాలో జమవుతోంది. సొంతిల్లు లేదని మా ప్రాంత వలంటీర్‌కు చెప్పడంతో సచివాలయంలో దరఖాస్తు చేయించారు. కోసిగిలో సజ్జలగుడ్డం రోడ్డు జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం కేటాయించారు. నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయి. ఎట్టకేలకు సొంతిల్లు కట్టుకున్నాం.

– బేడ బుడగ జంగాల మారెమ్మ, కోసిగి
(నీలి ఈరేష్, విలేకరి, కోసిగి)

ప్రభుత్వమే మా కుటుంబాన్ని నడిపిస్తోంది





ప్రభుత్వ సాయంతో నిర్మించుకున్న ఇల్లు (ఇన్‌సెట్) వియ్యపు సోమునాయుడు

నేను లారీ క్లీనర్‌గా పనిచేసేవాడిని. ఆరేళ్ల కిందట రాజమండ్రి వద్ద రోడ్డు ప్రమాదంలో నా కాళ్లు, ఎడమ చేయి కోల్పోయి వీల్ చెయిర్‌కే పరిమితమయ్యాను. నా అవిటితనం చూసి నా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం పెదపూడిలో నాతో పాటు వృద్ధులైన అమ్మా నాన్న రాజమ్మ, రాముడునాయుడులు నా సంపాదన పైనే ఆధారపడి ఉన్నారు. సీఎంగా జగనన్న వచ్చాక నాకు నెలకు రూ.5 వేల వంతున పింఛన్ వస్తోంది. మా నాన్నకు వృద్ధాప్య పింఛన్ ఈ ప్రభుత్వ హయాంలోనే మంజూరైంది. నాతో పాటు వృద్ధులైన అమ్మ, నాన్న ఒక్క రూపాయి కూడా సంపాదించే అవకాశం లేదు. ఈ ప్రభుత్వం ద్వారా నాకు, మా నాన్నకు ప్రతినెలా రూ.8 వేలు పింఛన్ రూపంలో వస్తుండడం, రేషన్ కార్డు ద్వారా బియ్యం, కంది పప్పు వంటివి అందుతున్నాయి. గతంలో మేము పూరింట్లో ఉండేవాళ్లం. మేము పక్కా ఇంటికి దరఖాస్తు చేసుకోగా ఈ ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. దీనికి తోడు వైఎస్సార్‌సీపీ నేత, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తంతో పూరిల్లు ఉన్న స్థలంలోనే పక్కా ఇల్లు నిర్మించుకున్నాం.

– వియ్యపు సోమునాయుడు, పెదపూడి
(చప్పా రామలింగేశ్వరరావు, విలేకరి, బుచ్చెయ్యపేట)

మా పిల్లలకు బంగారు బాట..



మా ఆయన కూలి పనులకు వెళ్తాడు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఎస్సార్పీ అగ్రహారానికి చెందిన మాకు 6, 8 తరగతులు చదువుతున్న ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. వాళ్లను బాగా చదివించాలని మా కోరిక. దానికి పేదరికం అడ్డు వస్తుందేమో అని చాలా మదనపడ్డాం. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జగనన్న అమ్మ ఒడి పథకం ప్రవేశ పెట్టడంతో వారి చదువుల సమస్య పరిష్కారమైంది. మా పిల్లలు బాగా చదువుకుంటున్నారు. అంతే కాకుండా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాకు ఏటా రూ.10 వేలు చొప్పున ఇప్పటి వరకు రూ.40 వేలు వచ్చింది. ఆ మొత్తంతో రోడ్డు పక్కన కొబ్బరిబొండాల విక్రయం సాగిస్తున్నాను. పేదల గురించి ఇంతగా ఆలోచించే ముఖ్యమంత్రిని నేను చూడలేదు. నా కళ్ల ముందు నా బిడ్డలు మంచి చదువులు చదువుతున్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరం.

– పి.అశ్విని, ఎస్సార్పీ అగ్రహారం
(కొమ్మంటి లక్ష్మణ్, విలేకరి, కలిదిండి)

'సాధికారత'తో మురిసిన మంగళగిరి

పట్టణంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర

- సగర్వంగా సాధికారతను ప్రదర్శించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- 'మళ్లీ ముఖ్యమంత్రి మీరే కావాలి జగన్' అంటూ నినాదాలు
- బహిరంగ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరు
- సీఎం జగన్ సామాజిక న్యాయానికి మంగళగిరే నిదర్శనమని నేతలు వెల్లడి



ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు. చిత్రంలో గంజి చిరంజీవి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: బడుగు, బలహీన వర్గాల సాధికారతతో గుంటూరు జిల్లా మంగళగిరి మురిసింది. బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో తాము సాధించిన సాధికారతను సగర్వంగా ప్రదర్శించారు. యువత నుంచి వృద్ధుల వరకు ఈ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. 'మళ్లీ నీవే ముఖ్యమంత్రివి కావాలి జగన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త గంజి చిరంజీవి అధ్యక్షతన మిద్దె సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన నేతలు సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సాధించిన అభివృద్ధిని వివరించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సామాజిక న్యాయానికి మంగళగిరే నిదర్శనమని చెప్పారు. మంగళగిరి సీటును అగ్రకులానికి చెందిన అభ్యర్థి నుంచి మార్చి బీసీలకు కేటాయించడమే బీసీలకు సీఎం జగన్ ఇస్తున్న ప్రాధాన్యతను తెలుపుతుందని అన్నారు.

సామాజిక విప్లవం తెచ్చిన తొలి సీఎం జగన్

దేశంలో సామాజిక కులాల గురించి ఆలోచించి, సామాజిక విప్లవాన్ని తెచ్చిన తొలి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అందలం ఎక్కించారని, ఈరోజు ఇలా తలెత్తుకొని తిరగడానికి సీఎం జగనే కారణమని చెప్పారు. చంద్రబాబు అణగారిన వర్గాలను అవమానించేవారని, ఈ వర్గాలను ఓటు బ్యాంకులా మాత్రమే తప్ప ఏనాడూ సాటి మనిషిగా చూడలేదని అన్నారు. మంగళగిరిలో స్థానికుడిగా ఉన్న గంజి చిరంజీవిని గెలిపించుకోవాలని, హైదరాబాదులో ఉండే టీడీపీ అభ్యర్థిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అగ్రస్థానం

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ అన్నింటా అగ్రస్థానం ఇస్తున్నారని మంత్రి జోగి రమేష్ చెప్పారు. మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా, నామినేటెడ్ పదవుల్లోనూ ఈ వర్గాలకే పెద్ద పీట వేసిన తొలి సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. అగ్రవర్ణ అభ్యర్థులు గెలిచిన మంగళగిరిలో బీసీ అభ్యర్థి గంజి చిరంజీవిని నిలబెడుతున్నారని, సీఎం జగన్ సామాజిక న్యాయానికి ఇదే నిదర్శనమని చెప్పారు. మంగళగిరి అని స్పష్టంగా పలకటం రాని లోకేశ్‌కి మంగళగిరి ఎందుకు అని ఎద్దేవా చేశారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి అని, బడుగు వర్గాలకు ఆయన చేసిన మేలు మరెవరూ చేయలేరని పార్టీ నేత, ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్ అన్నారు. రెండుసార్లు రెడ్డి సామాజిక వర్గం గెలిచిన మంగళగిరిలో బీసీ అభ్యర్థిని రంగంలోకి దింపే సాహసం ఒక్క జగన్ మాత్రమే చేయగలరని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. మంగళగిరిలో బీసీ నేతను గెలిపించుకొనే అవకాశాన్ని వదులుకోవద్దని పిలుపునిచ్చారు. పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, బీసీ విభాగం ఉపాధ్యక్షులు చిల్లపల్లి మోహనరావు పాల్గొన్నారు.

3న ఏలూరులో 'సిద్ధం' బహిరంగ సభ!

- పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ మిథున్‌రెడ్డి, తలశిల, ఆళ్ల నాని
- సభా ఏర్పాట్ల పనుల పరిశీలన
- లక్షలాది మంది రాక నేపథ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు



సభా వేదికపై 'సిద్ధం' పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం బహిరంగసభ 'సిద్ధం'కు ఏలూరు ముస్తాబవుతోంది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని 50 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది పార్టీ కేడర్ సభకు రానున్న క్రమంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను పార్టీ ముఖ్యులు పరిశీలించారు. గోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌యాదవ్, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సభా ప్రాంగణంలో 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరించారు.

110 ఎకరాల ప్రాంగణంలో..

ఏలూరు నగర సమీపంలో, దెందులూరు జాతీయ రహదారి వద్ద 110 ఎకరాల స్థలంలో సభావేదిక నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భారీ వేదిక నిర్మాణం, పదుల సంఖ్యలో గ్యాలరీలు.. కార్యకర్తలందరికీ దగ్గరగా వెళ్లి అభివాదం చేసేందుకు సభా వేదిక నుంచి వాక్‌వే ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సభా ప్రాంగణం వెనుక భాగంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. 50 నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది రానున్న క్రమంలో వాహనాల పార్కింగ్‌తో సహా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. సభా ప్రాంగణానికి సమీపంలోని దెందులూరు ఊరు ప్రారంభంలో 40 ఎకరాల ప్రాంగణాన్ని, అలాగే సభా ప్రాంగణానికి, ఆటోనగర్‌కు మధ్యలో 25 ఎకరాల ప్రాంగణం, మరో రెండు పార్కింగ్ స్థలాలు, ఆటోనగర్ లోపల, ఆశ్రం కళాశాల, ఏలూరు ప్రారంభంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో మొత్తం 150 ఎకరాల స్థలాన్ని పార్కింగ్ కోసం కేటాయించి జిల్లాల వారీగా వచ్చే వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. బుధవారం ఎంపీ మిథున్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మాట్లాడుతూ ఏలూరు జిల్లా రాజకీయ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 'సిద్ధం' బహిరంగ సభ జరుగుతుందని, 3న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం జగన్ సభా ప్రాంగణానికి చేరుకుని పార్టీ కేడర్‌కు దిశా నిర్దేశం చేస్తారని వివరించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్పీ డీ.మేరీప్రశాంతి తదితరులున్నారు.

డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ, పోలీస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశాల మేరకు మూడేళ్లుగా ఒకే చోట పనిచేస్తోన్న అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా 100 మందికిపైగా డిప్యూటీ కలెక్టర్లను, రెవెన్యూ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సాధారణ ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉండి సొంత జిల్లాల్లో ఉంటూ.. మూడేళ్లు ఒకేచోట పని చేస్తోన్న 700 మంది తహశీల్దార్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్న తహశీల్దార్లను అక్కడే కొనసాగించినప్పటికీ వారిని ఎన్నికల విధుల్లో వినియోగించవద్దని అదనపు సీఈఓ ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

158 మంది డీఎస్పీలు బదిలీ

రాష్ట్రంలో 158 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. వారిలో 15 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగులు కేటాయించింది. మరో 143 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈమేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

10న విశాఖకు ముఖ్యమంత్రి జగన్

ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి హాజరు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆడుదాం–ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రీడలు ఫిబ్రవరి ఆరు నుంచి పదో తేదీ వరకు విశాఖ వేదికగా నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 6న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆడుదాం–ఆంధ్రా పోటీలు ప్రారంభమవుతాయని, పదో తేదీన వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో జరిగే ముగింపు కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 26 జిల్లాల నుంచి క్రీడాకారులు విశాఖ వస్తారని, ఒక్కో జిల్లా నుంచి 130 నుంచి 150 మంది వరకు క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

త్వరలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంయుక్త నిర్వహణలో త్వరలో రూ.1,500 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు సీఎం జగన్ చేతుల మీదుగా జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని చెప్పారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో వైజాగ్ స్కై గ్లాస్ బ్రిడ్జి, సైక్లింగ్ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వీటికి టెండర్లు కూడా పిలిచామన్నారు. త్వరలో సీఎం చేతుల మీదుగా వీటికి శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు 14 వేల మంది సిబ్బంది హాజరవుతారని కలెక్టర్ వివరించారు.

21 మంది అదనపు ఎస్పీల బదిలీ

రాష్ట్రంలో 21 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులిచ్చారు. బదిలీ అయిన వారి వివరాలు.. - సాక్షి, అమరావతి

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
టీపీ విఠలేశ్వర్	అదనపు ఎస్పీ శ్రీకాకుళం(క్రైమ్)	అదనపు ఎస్పీ, ఏసీబీ
జె.తిప్పే స్వామి	అదనపు ఎస్పీ(అడ్మిన్), శ్రీకాకుళం	అదనపు ఎస్పీ, అప్పా
ఎల్.సుధాకర్	వెయిటింగ్	అదనపు ఎస్పీ(అడ్మిన్), కడప
ఎస్. వెంకటరావు	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), విజయనగరం	అదనపు డీసీపీ, విశాఖపట్నం
ప్రేమ్ కాజల్	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), కాకినాడ	అదనపు ఎస్పీ(అడ్మిన్), శ్రీకాకుళం
పి.అనిల్ కుమార్	అదనపు ఎస్పీ, అల్లూరి జిల్లా	అదనపు ఎస్పీ(ఎల్–ఓ), తూ.గో
జి.వెంకటేశ్వరరావు	అదనపు ఎస్పీ(క్రైమ్), తూర్పు గోదావరి	అదనపు ఎస్పీ(అడ్మిన్), కృష్ణా
జి.స్వరూపా రాణి	అదనపు ఎస్పీ(ఎల్–ఓ), తూర్పు గోదావరి	అదనపు ఎస్పీ(అడ్మిన్), ఏలూరు
ఎంబీవీ భాస్కర్‌రావు	అదనపు ఎస్పీ(అడ్మిన్), ఏలూరు	అదనపు ఎస్పీ(అడ్మిన్), కాకినాడ
ఏవీ సుబ్బరాజు	వెయిటింగ్	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), చిత్తూరు
జీవీ రమణమూర్తి	అదనపు డీసీపీ, విజయవాడ	అదనపు ఎస్పీ(అడ్మిన్), గుంటూరు
సీహెచ్. లక్ష్మీపతి	అదనపు ఎస్పీ, విజయవాడ	అదనపు ఎస్పీ(క్రైమ్), పల్నాడు
ఆర్. శ్రీహరి బాబు	అదనపు ఎస్పీ, కాకినాడ	అదనపు డీసీపీ, విజయవాడ
కె. సుప్రజ	అదనపు ఎస్పీ(అడ్మిన్), గుంటూరు	అదనపు ఎస్పీ, ఏసీబీ
ఎస్.కె.చంద్రశేఖర్	అదనపు ఎస్పీ(క్రైమ్), పల్నాడు	రిటైర్ అవుతున్నారు
కె.శ్రీలక్ష్మి	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), చిత్తూరు	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), కాకినాడ
కె.ప్రవీణ్ కుమార్	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), కడప	అదనపు ఎస్పీ(అడ్మిన్), నంద్యాల
జి.వెంకట రాముడు	అదనపు ఎస్పీ(అడ్మిన్), నంద్యాల	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ), కడప
టి.కనక రాజు	వెయిటింగ్	అదనపు ఎస్పీ(ఎల్–ఓ–2), విజయవాడ
బి.ఉమామహేశ్వరరావు	అదనపు ఎస్పీ (ఎస్ఎస్‌టీ సెల్), ఏలూరు	అదనపు ఎస్పీ(క్రైమ్), శ్రీకాకుళం
ఇ.నాగేంద్రుడు	అదనపు డీసీపీ, విశాఖపట్నం	అదనపు ఎస్పీ, ఏసీబీ

'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్'లో ఏపీకి ఆరు అవార్డులు



అవార్డు అందుకున్న అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభినందించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో ఆరు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ అధికారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి.. బ్రాండింగ్, విస్తృత ప్రచారం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించిన కాకినాడ జిల్లా ఉప్పాడ జామ్దాని చీరలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు కాఫీకి బంగారు పతకాలు, పొందూరు కాటన్, కోడుమూరు గద్వాల్ చీరలకు కాంస్య పతకాలు, మదనపల్లె పట్టు, మంగళగిరి చేనేత చీరలకు ప్రత్యేక జ్యూరీ అవార్డులు వచ్చాయి. ఇటీవల ఢిల్లీలో ఈ అవార్డులను అధికారులు అందుకున్నారు. బుధవారం సచివాలయంలో సీఎంను కలిసి అవార్డుల వివరాలను వివరించారు. సీఎంను కలిసినవారిలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉన్నతాధికారులు సునీత, ఎం.ఎం.నాయక్, పెద్దిరాజు, సురేశ్‌కుమార్, ధర్మారావు, హరిక్రిష్ణ, శ్రీనివాసరెడ్డి, వనజ పాల్గొన్నారు.

ఆరుగురు ఏఆర్ అధికారుల బదిలీ

రాష్ట్రంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగంలో ఆరగురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులిచ్చారు. - సాక్షి, అమరావతి

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయినస్థానం
యు.రామమోహన్‌రావు	కమాండెంట్(హోమ్‌గార్డ్స్), విశాఖపట్నం	కమాండెంట్(ఐఎస్‌డబ్ల్యూ), విజయవాడ
కేవీ ప్రేమ్‌జీత్	కమాండెంట్(హోమ్‌గార్డ్స్), విజయవాడ	కమాండెంట్(హోమ్‌గార్డ్స్), విశాఖపట్నం
ఎస్ఎల్ఎన్ రెడ్డి	అదనపు ఎస్పీ(ఏఆర్), తిరుపతి	అదనపు ఎస్పీ(ఏఆర్), అనంతపురం
ఎ.హనుమంతు	అదనపు ఎస్పీ(ఏఆర్), అనంతపురం	అదనపు ఎస్పీ(ఏఆర్), గుంటూరు
కె.కోటేశ్వరరావు	అదనపు ఎస్పీ(ఏఆర్), గుంటూరు	అదనపు డీసీపీ(ఏఆర్), ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్
కె.శ్రీనివాసరావు	అదనపు డీసీపీ(ఏఆర్),	అదనపు ఎస్పీ(ఏఆర్), ఇంటెలిజెన్స్ ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్

సీనియర్ ఐపీఎస్‌లకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. మరికొందరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐపీఎస్ అధికారుల పోస్టింగుల వివరాలు ఇలా ఉన్నాయి...

- అదనపు డీజీ(శాంతిభద్రతలు) శంకబ్రత బాగ్చీకి అదనపు డీజీ(హోమ్‌గార్డ్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్ ఎస్‌వీ రాజశేఖరబాబుకు ఐజీ(తీరప్రాంత భద్రత) అదనపు బాధ్యతలు అప్పగించారు.
- అనంతపురంలోని ఏపీఎస్పీ 14 బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న ఆర్. గంగాధర్‌రావును సీఐడీ విభాగం ఎస్పీగా బదిలీ చేశారు.
- కర్నూలు అదనపు ఎస్పీ(ఎస్ఈబీ)గా ఉన్న కృష్ణ కాంత్ పటేల్‌ను విజయవాడ డీసీపీ(శాంతి, భద్రతలు)గా నియమించారు.
- కాకినాడ ఎస్పీ సతీశ్ కుమార్‌కు కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సీఐడీ విభాగంలో ఎస్పీగా ఉన్న వి.రత్నను మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.
- సీఐడీ విభాగంలో ఎస్పీగా ఉన్న అమిత్ బర్దర్‌ను అనంతపురంలోని ఏపీఎస్పీ 14 బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.
- విశాఖ డీసీపీ(శాంతి,భద్రతలు)గా ఉన్న ఆనంద్ రెడ్డిని ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు.

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

అవసరం ఉండదని స్పష్టంగా ముద్రించారు. స్థలానికి సంబంధించి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను వారి పేరు మీద చెల్లించుకోవచ్చని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూసేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మొట్టమొదటగా తాతపూడి అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ విలువ రూ. 4.46 లక్షలు కాగా, భూసేకరణ విలువ రూ. 11.61 లక్షలుగా అందులో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీ, యూజర్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన రూ. 11.61 లక్షల విలువైన ఆస్తికి సాధారణంగా అయితే ఆమె రూ. 18,600 స్టాంప్ డ్యూటీ, రూ.2,325 రిజిస్ట్రేషన్ ఛార్జి, రూ. 500 యూజర్ ఛార్జి కలిపి మొత్తం రూ.21,425 చెల్లించాల్సి ఉంటుంది. దానిని ప్రభుత్వమే భరించింది.

పదిహేను రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి..

15 రోజుల్లో 30.61 లక్షల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఆ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లను వేగంగా చేయనున్నారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత ఆ డాక్యుమెంట్లను (కన్వేయన్స్ డీడ్స్) లబ్ధిదారులకు అందించనున్నారు. రూ.10 స్టాంప్ పేపర్లపై ఈ డీడ్ల ప్రింటింగ్‌ను రిజిస్ట్రేషన్లు అయినదాన్ని బట్టి జిల్లాల్లోనే చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి మూడో వారంలో ఈ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని సీఎం జగన్ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత నియోజకవర్గాలు, సచివాలయాల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఈ డీడ్స్‌ను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



రిజిస్ట్రేషన్ చేసిన కన్వేయన్స్ డీడ్

మరో ముగ్గురు ఐఏఎస్‌ల బదిలీ

- వెయిటింగ్‌లో ఉన్న ఒకరికి పోస్టింగ్
- మరొకరికి అదనపు పూర్తి బాధ్యతలు

సాక్షి, అమరావతి: ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ.. వెయిటింగ్‌లో ఉన్న ఒకరికి పోస్టింగ్ కల్పిస్తూ.. మరో ఐఏఎస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఏపీ స్టేట్ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.హర్షవర్ధన్‌ను సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. టీటీడీ జేఈవోగా పని చేస్తున్న సదా భార్గవిని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (గురుకులమ్స్) కార్యదర్శిగాను, విలేజ్ సెక్రటేరియట్ అండ్ వార్డు సెక్రటేరియట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చేతన్ టీఎస్‌ను ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఆర్.పవన్ మూర్తిని ఏపీసీవో ఎండీగా నియమించారు. శాప్ వీసీ అండ్ ఎండీగా ఉన్న ధ్యాన్‌చంద్ర హెచ్ఎంకు విలేజ్ సెక్రటేరియట్, వార్డు సెక్రటేరియట్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా...

66.15 లక్షల మందికి రూ.1,961.13 కోట్లు

నేటి ఉదయం నుంచే వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 66,15,482 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ రకాల చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళలకు ఫిబ్రవరి ఒకటి నుంచి ఠంఛన్‌గా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.1961.13 కోట్లను విడుదల చేసింది. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఆ పరిధిలో ఉండే పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా రూ.1,961.13 కోట్లను బుధవారం ఉదయానికే జమ చేసింది. ఆయా సచివాలయాల సిబ్బంది బుధవారం సాయంత్రానికే బ్యాంకుల నుంచి డ్రా చేసి, వలంటీర్ల వారీగా పంపిణీని దాదాపుగా పూర్తి చేసినట్టు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారులు వెల్లడించారు. కాగా, సాంకేతిక కారణాల వల్ల ఏ ఒక్కరికీ పెన్షన్ అందలేదనే ఫిర్యాదులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని.. రాష్ట్రంలోని 26 జిల్లాల డీఆర్‌డీఏ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్ర పథకాల నిధులు సకాలంలో ఖర్చు చేయండి

- మరిన్ని నిధులు రాబట్టండి
- అధికారులకు సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నిధులను సకాలంలో ఖర్చు చేయడం ద్వారా కేంద్రం నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులను రాబట్టేందుకు తగిన ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఈ అంశంపై పలు శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయించిన నిధులను వేగవంతంగా ఖర్చు చేసి ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టేందుకు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా కేంద్ర ప్రాయోజిత పథకాలు వాటికి ఖర్చు చేసిన నిధులు, ఇంకా ఖర్చు చేయాల్సిన నిధులు, కేంద్రం నుండి రావాల్సిన నిధులపై సమీక్షించారు. అంతకు ముందు ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కేంద్ర ప్రాయోజిత పథకాలు కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి విడుదలైన నిధులు, ఇంకా రావాల్సిన నిధుల వివరాలను వివరించారు. ఈ పథకాలకు సంబంధించి ఆయా శాఖలు పూర్తి వివరాలు సమర్పిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టేందుకు ప్రయతిన్స్తామని చెప్పారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఎండీ బాబు.ఎ, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ జె.మురళి, టిడ్కో ఎండీ శ్రీధర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు 'తెలుగు భాషారత్న పురస్కారాలు'

సాక్షి, అమరావతి: పత్రికారంగంలో నిష్ణాతులైన కొందరిని తెలుగు భాషారత్న పురస్కారాలతో సత్కరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు తెలిపారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సంఘం(ఏపీఎన్‌ఆర్టీఎస్) కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పత్రికారంగంలో రచయితలను సముచితంగా గౌరవించుకోవడంలో భాగంగా ఫిబ్రవరి 5న ఆంధ్రప్రదేశ్ ప్రవాసాంధ్ర తెలుగు సంఘం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సౌజన్యంతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలోని డైక్ మెన్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మూడున్నర దశాబ్దాలకు పైగా పత్రికారంగంలో సేవలందించిన 20 మందికి తెలుగు భాషారత్న జీవన సాఫల్య పురస్కారాలతోను, విశేష సేవలందించిన మరికొందరిని తెలుగు భాష సేవారత్న పురస్కారాలతో సత్కరించనున్నట్లు విజయ్‌బాబు తెలిపారు. తెలుగు భాష వ్యాప్తికి అధికార భాషా సంఘం విశేష కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో ఉత్తరాంధ్ర సాహితీ సదస్సు, దక్షిణాంధ్ర సాహితీ సదస్సు, గోదావరి సాహితీ సదస్సులను నిర్వహించనున్నట్లు విజయ్‌బాబు తెలిపారు.

సీఎం నిర్ణయంతో వర్సిటీ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం

ఏపీ నాన్–టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్



సాక్షి, అమరావతి: రాష్ట్ర వర్సిటీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచడంతో ఆ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం నిండిందని ఏపీ నాన్–టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటప్పరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వారి కలను సీఎం జగన్ నెరవేర్చడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కో తరగతి చొప్పున పెంచుకుంటూ 2035 నాటికి పదో తరగతి విద్యార్థులు 'ఐబీ' బోర్డు సర్టిఫికేషన్ పరీక్షలు రాసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిబ్రవరి 16 నుంచి చివరి విడత 'వైఎస్సార్ చేయూత' పంపిణీ చేపట్టనున్నారు. సుమారు 27 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం రూ.5,060.40 కోట్లు జమ చేయనుంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.



మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చేయూత'తో రూ.19,188 కోట్లు

పేద మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యాలుగా వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి 'వైఎస్సార్ చేయూత'ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం 45 నుంచి 60 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.75 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. తద్వారా వారి జీవనోపాధిని పెంపొందిస్తూ నెలకు అదనపు ఆదాయం కింద రూ.7 వేల నుంచి రూ.10 వేలు సంపాదించేలా తోడ్పాటునిచ్చారు. 14 లక్షల మంది స్వయం ఉపాధి మార్గాలతో సంతోషంగా జీవిస్తున్నారు. 2020లో చేయూతను ప్రారంభించగా మొదటి విడతగా 24.11 లక్షల మందికి రూ.4,500.20 కోట్లు, రెండో విడతలో 24.95 లక్షల మందికి రూ.4,679 కోట్లు, మూడో విడతలో 26.39 లక్షల మంది రూ.4,949 కోట్లు పంపిణీ చేశాం. ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పలేదు. తాజాగా నాలుగో విడతలో 27 లక్షల మంది ఖాతాల్లోకి రూ.5,060 కోట్లు జమ చేస్తాం. ఫిబ్రవరి 16 నుంచి రెండు వారాలపాటు జగనన్న చేయూత కొనసాగుతుంది. పథకం కింద నాలుగు విడతల్లో కలిపి సుమారు రూ.19,188 కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నాం.

ఎస్‌ఈఆర్టీతో ఐబీ భాగస్వామ్యం..

పేదలకు, సంపన్నులకు తేడా నాణ్యమైన విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ తీసుకొస్తున్నాం. ఐబీ విద్యా విధానంలో చదవడానికి ఏడాదికి రూ.7 లక్షల నుంచి రూ.36 లక్షల దాకా ఖర్చవుతుంది. సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే డిజిటల్ సదుపాయాలు, ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లను పేద పిల్లలకు కూడా అందుబాటులోకి తేవడంతో మార్పు మొదలైంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ బోధనలో ఐబీని భాగస్వామ్యం చేస్తున్నాం. ఏపీ విద్యార్థులు ప్రపంచస్థాయి ఉద్యోగాలను అందుకోవాలన్నదే సీఎం జగన్ లక్ష్యం. ప్రభుత్వంతో ఒప్పందానికి ఐబీ సంస్థ ముందుకు వచ్చింది. సంపన్నుల పిల్లలకే కాదు నిరుపేదలకూ తాము సేవలందిస్తామని ప్రకటించింది. 2024–25లో ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధిత ఇతర అధికార్లకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని, నైపుణ్యాలను పెంచిన తర్వాత 2025–26 విద్యా సంవత్సరం జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ మొదలవుతుంది. 2026–27 విద్యా సంవత్సరం నాటికి రెండో తరగతికి విస్తరిస్తాం. ఇలా ఏటా ఒక్కో తరగతి చొప్పున పెంచుకుంటూ 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి ప్లస్ 2 తరగతి విద్యార్థులు ఐబీ బోర్డు జాయింట్ సర్టిఫికేషన్‌తో పరీక్షలు రాస్తారు. ఈ సర్టిఫికెట్‌తో ప్రపంచవ్యాప్తంగా సుప్రసిద్ధ వర్శిటీల్లో ప్రవేశాలు లభిస్తాయి. ప్రభుత్వ బడుల్లో ఐబీ భాగస్వామ్యం చేయాలన్న ప్రతిపాదనను మంత్రి మండలి హర్షధ్వానాలతో ఆమోదించింది.

ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపీబీ) ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఇందులో భాగంగా గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1,500 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1,272.07 ఎకరాలు, మిడ్తూరు మండలం మాసాపేట, నాగలూటి గ్రామాల్లో 1,011.44 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములను గుర్తించనుంది. సోలార్, విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఎస్‌పీవీ ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ రూ.12,065 కోట్ల పెట్టుబడులతో 3,300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించేలా 3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయనుంది. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగావాట్లు, సత్యసాయి జిల్లా ముదిగుబ్బవద్ద 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లాలో డి.హీరేహాళ్, బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను నెలకొల్పుతుంది.
- నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ రూ.1,287 కోట్ల పెట్టుబడితో 171.60 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తుంది. ఈ రెండు విండ్ పవర్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 200 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- ఆగ్వా గ్రీన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.4 వేల కోట్ల పెట్టుబడులతో శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లెలో 1,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా వెయ్యి మందికి ప్రత్యక్షంగా ఉపాధి దక్కుతుంది.
- ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,350 కోట్ల పెట్టుబడులతో కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద 200 మెగావాట్ల విండ్‌పవర్ ప్రాజెక్ట్‌ను స్థాపిస్తోంది. తద్వారా 200 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.
- రెన్యూ విక్రం శక్తి ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,600 కోట్ల పెట్టుబడితో శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనుంది.
- అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులో భాగంగా 150 మెగావాట్లు చొప్పున 9 యూనిట్లు ఏర్పాటుకు పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేయాలన్న ఏపీ జెన్‌కో ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించింది. రూ.12,264.36 కోట్లతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది.

పులిచింతల నిర్వాసితుల ఇళ్లకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు..

- పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు పరిధిలో 5,376 నిర్వాసిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇస్తున్న ఇళ్ల పట్టాలు, ఇళ్లకు సంబంధించిన రూ.52 కోట్ల స్టాంప్ డ్యూటీ, రూ.8 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీల మినహాయింపు.
- పల్నాడు జిల్లా నరసరావుపేటలో జామియా మసీదు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఆస్తి పన్ను మినహాయింపునకు ఆమోదం.
- నేచురల్ గ్యాస్‌పై వ్యాట్ 24.5 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు.
- లార్జ్ అండ్ మెగా ప్రాజెక్టులకు వివిధ పాలసీల్లో భాగంగా రాయితీలు ఇవ్వాలన్న స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపీబీ) ప్రతిపాదనలకు ఆమోదం.
- 4వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ రిపోర్టు, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ ఫండ్ రూల్స్ 2024 ప్రతిపాదనలకు ఆమోదం.
- చట్టసభలకు కొత్తగా ఎన్నికై న సభ్యులతోపాటు అధికారులు, చట్టసభల సిబ్బంది తదితరులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఏపీ లెజిస్లేచర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేటివ్ స్టడీస్ అండ్ ట్రెనింగ్ సంస్థ ఏర్పాటు, డైరెక్టర్(నాన్ కేడర్) పోస్టుకు కేబినెట్ ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో 27 పోస్టుల భర్తీ, ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్ –1987కి సవరణలు, ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్ –1992 సవరణలకు ఆమోదం.
- ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోలగట్ల అలనా మీనాక్షికి విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో 500 గజాలు, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి 1,000 చదరపు గజాల నివాస స్థలం కేటాయింపు.
- తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మల్లవారిపాలెంలో ఐఐఐటీ శ్రీసిటీలో ఏర్పాటుకు 42.23 ఎకరాల కేటాయింపు.

2.20 లక్షల శాశ్వత ఉద్యోగాలు!

మెగా డీఎస్సీ 2024లో భాగంగా ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. అంతకంటే ముందు 8 రోజుల పాటు డీఎస్సీ అర్హత కోసం టెట్ పరీక్ష నిర్వహిస్తాం. డీఎస్సీ 2024 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు కల్పించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క విద్యా రంగంలోనే 14,219 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానాన్ని తేవడంతో 7,761 పోస్టుల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారు. డీఎస్సీతో పాటు అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లతో సహా వివిధ విభాగాల్లో 689 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నాం. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ఒక్కసారే 1.34 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర మా ప్రభుత్వానిది. ఇలా వివిధ శాఖల్లో కలిపి ఇప్పటికే 2.13 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించాం. తాజా నోటిఫికేషన్ల ద్వారా మరో 7 వేల పోస్టులతో కలిపి 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించినట్లు అవుతుంది.

మరికొన్ని అంశాలకూ ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగింపు.
- ప్రతి గ్రామ పంచాయతీకి తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శి ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ డిస్కమ్‌లకు రూ.1,500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీ.
- అత్యంత మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో ఏపీ డిస్కమ్‌లు రూపొందించిన డీపీఆర్‌కు ఆమోదం.

బయో ఎనర్జీ, రీసైక్లింగ్, సిమెంట్ పరిశ్రమలు..

- వైఎస్సార్ కడప జిల్లాలో రెండు విడతల్లో రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏసీసీ సిమెంట్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం. దీని ద్వారా ఏడాదికి 8 మిలియన్ టన్నుల క్లింకర్, 4 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి జరుగుతుంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి 36 నెలల్లో పూర్తి చేయనుంది. దీనివల్ల 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.
- అగర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు విడతల్లో రూ.3200 కోట్లతో లిథియం అయాన్ రీసైక్లింగ్, ఈ–వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. తద్వారా ప్రత్యక్షంగా 3,200 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- రాష్ట్రంలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ రెండు విడతల్లో 15 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. రూ.1,920 కోట్ల పెట్టుబడితో 1,920 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అందించనుంది.
- పట్టాభి ఆగ్రో ఫుడ్స్ లిమిటెడ్ రెండు విడతల్లో రూ.1,153 కోట్ల పెట్టుబడితో బియ్యం ఆధారిత యూనిట్లను ఏర్పాటు చేయనుంది. 2,500 మందికి ఉపాధి కల్పించనుంది.

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం

- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం వెల్లడించారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ.. సామాజిక న్యాయం చేస్తూ... యువతకు పెద్దపీట వేస్తూ ఐదో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు.

గత ఎన్నికల్లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు ఆ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, తిరుపతి లోక్‌సభ స్థానానికి ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తిని నియమించారు.

అరకు వ్యాలీ(ఎస్టీ) శాసనసభ స్థానం సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం, సత్యవేడు (ఎస్సీ)కు నూకతోటి రాజేష్, అవనిగడ్డకు ప్రముఖ వైద్యుడు సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ జాబితాతో కలిపి ఇప్పటివరకూ 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు కొత్తగా సమన్వయకర్తలను నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయకర్తల్లో 21మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 17 మంది బీసీలు, నలుగురు మైనార్టీలు, 14మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 13 లోక్‌సభ స్థానాల్లో బీసీలు ఏడుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు ముగ్గురు ఉన్నారు.

'ప్రతీ పంచాయతీకి కార్యదర్శి'

ఓ చరిత్రాత్మక నిర్ణయం

సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగుల ధన్యవాదాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా ఒక్కో పంచాయతీ కార్యదర్శిని నియమిస్తూ కేబినెట్‌లో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. దీన్ని చరిత్రాత్మక నిర్ణయంగా పేర్కొంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపాయి.

సీఎం జగన్ శ్రద్ధ మరువలేనిది

గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా 1.34 లక్షల ఉద్యోగాలను సీఎం జగన్ సృష్టించారు. ఉద్యోగులకు సంబంధించి ఏ సమస్య ఉత్పన్నమైనా వాటి పరిష్కారంలో సీఎం చూపించిన శ్రద్ధ మరచిపోలేం. సీఎంకు ధన్యవాదాలు.

– బత్తుల అంకమ్మరావు (ప్రధాన కార్యదర్శి), విప్పర్తి నిఖిల్ కృష్ణ (వర్కింగ్ ప్రెసిడెంట్), బీఆర్‌ఆర్‌కిషోర్ (అదనపు ప్రధాన కార్యదర్శి), గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్

గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుంది

సంపూర్ణ గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన స్థితిలో గ్రామ పంచాయతీల పరిపాలన అందించడమే లక్ష్యంగా గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు సంపూర్ణ పాలనా బాధ్యత లప్పగిస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం.

– ఎండీ.జాని పాషా (రాష్ట్ర అధ్యక్షుడు), జి.హరీంద్ర (ప్రధాన కార్యదర్శి), బి.రోజాప్రకాష్ (పంచాయతీ కార్యదర్శుల విభాగం కన్వీనర్)– గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్



అహంకారం అనేది మనిషి తన గురించి తను ఎక్కువగా ఊహించుకోవడం వల్ల కలిగే ఆనందం.

– బరూచ్ స్పినోజా

సాక్షి

గురువారం, 1 ఫిబ్రవరి 2024

పాక్ ప్రజాస్వామ్య ప్రహసనం

మరో ఎనిమిది రోజుల్లో దేశంలో ఎన్నికలు. ఆరు నెలలుగా జైలులో ఉన్న మాజీ ప్రధాని. అవినీతి ఆరోపణలతో కటకటాల వెనక ఉన్న ఆయనపై... రెండు రోజుల్లో మరో రెండు కేసుల్లో వేర్వేరుగా 10 ఏళ్ళు, 14 ఏళ్ళ శిక్షలు. కనీసం మరో పదేళ్ళ పాటు ప్రభుత్వహోదా ఏదీ నిర్వహించనివ్వని నిషేధం. పార్టీ ఎన్నికల చిహ్నానికి కూడా తిరస్కరణ. మాజీ ప్రధాని గారి పార్టీ వైపు మొగ్గకుండా యువతరానికి హితోపదేశాల ఊదరగొడుతున్న ఆర్మీ ఛీఫ్. ఇలాంటి నాటకీయ పరిణామాలు ఒక్క పాకిస్తాన్‌లోనే సాధ్యం. గతంలోనూ ఆ దేశంలో మాజీ ప్రధానులు పలువురు ఇలానే న్యాయ విచారణలు, జైలుశిక్షలు ఎదుర్కోవాల్సి రావడం గమనార్హం. నమ్మలేని ఈ న్యాయవిచారణల ద్వారా నేతల్ని బరిలో లేకుండా చేసే సిగ్గుమాలిన రాజకీయ దుస్సంప్రదాయం పాకిస్తాన్‌లో దీర్ఘకాలంగా ఉన్నదే. దాదాపు 14 వేల కోట్ల డాలర్ల అప్పులో కూరుకుపోయి, ఏటా ఆహార ధరలు 38.5 శాతం మేర పెరుగుతూ, ఆసియాలోనే అత్యధిక ద్రవ్యోల్బణంతో సామాన్యులు సమరం చేస్తున్న పొరుగుదేశానికి ఇది ఏ రకంగానూ మేలు కాదు.

దేశరహస్య పత్రాలను లీక్ చేశారనే కేసులో కోర్టు మంగళవారం ఇమ్రాన్‌కు పదేళ్ళ జైలుశిక్ష ప్రకటిస్తే, మర్నాడే బుధవారం ప్రభుత్వ కానుకల అక్రమ విక్రయం (తోషాఖానా) కేసులో ఆయనకూ, ఆయన భార్యకూ కూడా చెరొక 14 ఏళ్ళ కారాగారవాస శిక్ష వేసింది. 150 కోట్ల రూపాయల జుల్మానా చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఏమైనా, 2022 ఏప్రిల్‌లో ప్రత్యర్థుల చేతిలో పదవీచ్యుతుడైన ఇమ్రాన్ ఇప్పటికే అవినీతి ఆరోపణలపై మూడేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్నారు. ఎన్నికలు అతి దగ్గరలో ఉండగా ఈ తీర్పులు, శిక్షల ప్రకటన యాదృచ్ఛికం అనుకోలేం. ఇప్పటికే పదేళ్ళ పాటు అన్ని రకాల ప్రభుత్వ పదవులకూ తమ నేతను అనర్హుణ్ణి చేసిన శక్తులు ఆయన భవిష్యత్ రాజకీయ కార్యాచరణకూ బ్రేకులు వేయదలిచారని ఇమ్రాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ) ఆరోపిస్తోంది. తాజాగా శిక్షలు పడ్డ రెండు కేసుల్లోనూ తమ వకీళ్ళు పాకిస్తాన్ హైకోర్ట్‌కు అప్పీల్ చేశాక కథ కొత్త మలుపులు తిరగవచ్చని ఆ పార్టీ ఆశ.

రావల్పిండిలోని అడియాలా జైలులో 9 బై 11 అడుగుల పరిమాణంలోని చిన్న జైలు గదిలో గడచిన ఆగస్టు నుంచి గడుపుతూ, హింసాకాండ నుంచి తీవ్రవాదం దాకా సుమారు 180కి పైగా ఆరోపణలను ఎదుర్కొంటున్నారు 71 ఏళ్ళ ఇమ్రాన్. కేసులు, కోర్టులు, శిక్షలతో సంబంధం లేకుండా ఆయనకు ఇప్పటికీ ప్రజాదరణ మెండుగా ఉంది. ఎన్నికల చిహ్నమైన క్రికెట్ బ్యాట్‌ను సైతం ఈ అంతర్జాతీయ క్రికెటర్ పార్టీకి దూరం చేశారు. ఎదురుదెబ్బ తగిలినా, జనంలో ఆయన పట్ల సానుభూతి, సానుకూలత ఆ పార్టీ అభ్యర్థులకు కాస్తంత సాంత్వన. వారు గెలిచినా ఇండిపెండెంట్ల కిందే లెక్క. అసలు చిక్కంతా ఇతర ప్రధాన రాజకీయ పార్టీలతో కలసి సైనిక వ్యవస్థ ఆడుతున్న అధికార క్రీడతోనే! తెర వెనుక చక్రం తిప్పే పాక్ సైన్యం కొన్ని నెలలుగా వేలాది పార్టీ కార్యకర్తల్ని అరెస్టు చేసింది. సుదీర్ఘ విచారణల దెబ్బతో డజన్లకొద్దీ పార్టీ నేతలు రాజీనామాలు చేశారు. ప్రధాన స్రవంతి మీడియాలో ఇమ్రాన్ పేరు నిషేధించారు. ఇమ్రాన్ ప్రత్యర్థులకు కలిసొచ్చేలా నియోజక వర్గాల సరిహద్దుల్ని తిరగరాశారు. చివరకు ఆయన నామినేషన్ పత్రాలను తిరస్కరించారు.

మాజీ ప్రధాని 74 ఏళ్ళ నవాజ్ షరీఫ్‌కు మాత్రం తెర వెనుక అండ పుష్కలం. అచ్చం ఇమ్రాన్ లానే అవినీతి ఆరోపణలతో 2017లో ఆయన పదవీచ్యుతుడయ్యారు. పదేళ్ళ జైలుశిక్ష పడింది. కానీ, వైద్య చికిత్సకంటూ 2018లో బెయిల్ మీద లండన్ వెళ్ళిన ఆయన తప్పించుకొని ప్రవాసంలో కాందిశీకుడిగా గడిపారు. చివరకు గత అక్టోబర్ 21 పాక్‌కు తిరిగొచ్చారు. వస్తూనే జైలుశిక్ష రద్దయింది. రాజకీయాల నుంచి జీవితకాల నిషేధమూ ఎత్తేశారు. నాలుగోసారి ప్రధాని పీఠానికై పోటీ చేస్తున్న ఆయనకు గతంలో మూడుసార్లు ఆయనను గద్దె దింపిన సైన్యమే మళ్ళీ సాయంగా నిలవడం పాక్ రాజకీయ వైచిత్రికి తార్కాణం. ఇవన్నీ చూశాకే ఈ ఎన్నికలలో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలుండవని విశ్లేషకులు తీర్మానించేశారు. పాక్ ఓటర్లలో 40 శాతం మంది నిరక్షరాస్యులే. అయితేనేం, ప్రజానీకానికి సైతం ఎన్నికల ప్రక్రియపై భ్రమలు ఎంతగా తొలగిపోయాయంటే, బరిలో మిగిలిన పార్టీల ప్రచారానికి సైతం స్పందన అంతంత మాత్రమే. అయితే, ఇమ్రాన్‌కు కోర్టు శిక్షలతో పాక్‌లో రాజకీయంగా చీలిక పెరగవచ్చు. అస్థిరత హెచ్చి, ప్రజాస్వామ్య ప్రక్రియకే ప్రమాదం రావచ్చు. రేపు ఫలితాలు వెలువడిన తర్వాతా దేశంలో సుస్థిరత నెలకొనే అవకాశాలు అత్యల్పం.

పాక్ అధికార వ్యవస్థపై సైనిక యంత్రాంగపు క్రీనీడ విస్తరించి, ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియను పూర్తిగా బలహీనపరిచింది. సైనికాధికారులు తమ పరిధిలోకి ఏ మాత్రం రాని రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ నుంచి మతం, విదేశాంగ విధానం దాకా విద్యార్థులతో ముచ్చటిస్తుండడమే అందుకు మచ్చుతునక. అన్ని రకాలుగా సందేహాస్పదమైన ఈ ఎన్నికల ద్వారా, సైనిక వ్యవస్థ అండతో వచ్చే బలహీన పౌరప్రభుత్వం రేపు పరిపాలన ఎంత అందంగా చేస్తుందో ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. పాక్ ఆర్థిక, జాతీయ భద్రతా రంగాల్లో దాని పని తీరు ఏమంత గొప్పగా ఉంటుందో వివరించనక్కర లేదు. దేశాన్ని సక్రమ మార్గంలో నడిపించడమెలాగో తమకు తెలుసని గతంలో అప్పటి పాక్ ఆర్మీ ఛీఫ్ జనరల్ జావేద్ బజ్వా ఒక సిద్ధాంతం చెబితే, ఇప్పుడు జనరల్ ఆసిమ్ మునీర్ సిద్ధాంత ప్రవచనం చేస్తున్నారు. వెరసి, ఈ ఫిబ్రవరి 8 నాటి ఎన్నికలు చివరకు ఓ తంతుగానే మారడం ఖాయం. బాహాటంగా పగ్గాలను సైన్యం చేత పట్టకున్నా, పేరుకు ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా పనిచేయనిచ్చే పరిస్థితి మాత్రం ఉండదనేది నిస్సందేహం.

గ్లోబల్ సౌత్ ఛాంపియన్ ఎవరు?

విశ్లేషణ



మంజరీ ఛటర్జీ మిల్లర్

గ్లోబల్ సౌత్ అనే మాటను 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక 2023 సంవత్సరపు పదంగా ప్రకటించింది. గ్లోబల్ సౌత్ అంటే దక్షిణార్ధ భూగోళ దేశాలు అని స్థూలార్థం. ఇదే పరిగణిస్తే చైనా, ఇండియా రెండూ ఇందులోకి రావు. భౌగోళికత కన్నా... తక్కువ, మధ్యాదాయ దేశాల సమూహంగా దీన్ని చూస్తున్నారు. భారీ ఆర్థిక వ్యవస్థలు ఉన్నప్పటికీ చైనా, ఇండియా తమను ఎదుగుతున్న దేశాలుగానే భావిస్తున్నాయి. అలా గ్లోబల్ సౌత్ దేశాలకు నాయకత్వ స్థానం కోసం పోటీపడుతున్నాయి. గ్లోబల్ సౌత్ కొన్నిసార్లు చైనా, భారత్ మద్దతును అంగీకరించడానికి సిద్ధంగా ఉంటూనే... ఈ రెండు దేశాల్లో దేన్నయినా నిరపాయకరమైన నాయకుడిగా లేదా ఛాంపియన్‌గా చూస్తున్నదా అనేది చెప్పడం కష్టం.

గత ఏడాది భారతదేశంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వాయిస్ ఆఫ్ ద గ్లోబల్ సౌత్ ఫర్ హ్యూమన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్' అనే వర్చువల్ సదస్సును నిర్వహించారు. భారతదేశం 'గ్లోబల్ సౌత్' వాణిగా ఉంటుందని ప్రకటించారు. 2023లో జీ20 అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్, ఈ సదస్సు ఎజెండాను వివరించడానికి తనకున్న ప్రత్యేక హక్కులో భాగంగా, అభివృద్ధి చెందుతున్న దేశాలకు స్థిరమైన రుణాలు, ఆహార భద్రత, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, బహుపాక్షిక బ్యాంకు సంస్కరణలు, వాతావరణ ఫైనాన్స్ వంటి ముఖ్యమైన సమస్యలను ముందుకు తెచ్చింది.

గ్లోబల్ సౌత్ ఛాంపియన్‌గా భారతదేశానికి ఉన్న స్థానం లేదా ప్రాముఖ్యత అనేది అభివృద్ధి, పాలన సమస్యలకు మాత్రమే పరిమితం కాలేదు. తన పాశ్చాత్య వ్యూహాత్మక భాగస్వాములైన అమెరికా, ఫ్రాన్స్‌లకూ, అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికీ మధ్య వారధిగా ఉంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన పాత్రను పోషించాలనే స్పష్టమైన కోరిక భారత్‌కు ఉంది. పర్యవసానంగా, గ్లోబల్ సౌత్, దానిలో భారతదేశ పాత్ర రెండింటిపై చాలా శ్రద్ధ చూపడం జరిగింది. (గ్లోబల్ సౌత్ అనే పదబంధాన్ని 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రిక 2023 సంవత్సరపు పదంగా ప్రకటించింది.) అయితే గ్లోబల్ సౌత్ అనే భావన కొత్తది కానట్లే, దానికి నాయకత్వం వహించాలనే ఆకాంక్ష కూడా భారత్‌కు కొత్తదేమీ కాదు. ఈ పాత్రను చేపట్టడానికి భారత్ చాలా కాలంగా చైనాతో పోటీపడుతోంది. గ్లోబల్ సౌత్‌లో ఎవరెవరు ఉన్నారు, ఇది ఎందుకు ఏర్పడింది అనేది కూడా ముఖ్యమైన అంశమే. గ్లోబల్ సౌత్ దేశాలు భారతదేశాన్ని లేదా చైనాను తమ వాణిగా స్వాగతిస్తాయా అనేది కూడా బహిరంగ ప్రశ్నే.

గ్లోబల్ సౌత్ అనే పదం ఒక భౌగోళిక మార్మిక విషయంగా ఉంటోంది. ఎందుకంటే ఉత్తర ఆఫ్రికాతో పాటు చైనా, భారత్ వంటి దేశాలు నిజానికి ఉత్తరార్ధ గోళానికి చెందుతాయి. తక్కువ లేదా మధ్య–ఆదాయ దేశాలుగా ప్రపంచ బ్యాంకు వర్గీకరించిన దేశాల సమూహంగా గ్లోబల్ సౌత్‌ను నేడు ఎక్కువగా అర్థం చేసుకుంటున్నారు. దీని భౌగోళిక మూలాలను 1926లో ఇటాలియన్ మార్క్సిస్ట్ తత్వవేత్త ఆంటోనియో గ్రామ్‌సీ రాసిన 'ద సదరన్ క్వశ్చన్' వ్యాసంలో గుర్తించవచ్చు. దీనిలో ఆయన తక్కువ అభివృద్ధి చెందిన, దక్షిణ ప్రాంత ఆలోచనను మొదటిసారిగా లేవనెత్తారు. ఉత్తర ఇటలీలోని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సంపన్న ప్రాంతాన్ని తక్కువ అభివృద్ధి చెందిన దక్షిణాదితో పోల్చారు. రెండోదాన్ని పూర్వం నుండి పెట్టుబడిదారులు వలసరాజ్యంగా మలిచారని గ్రామ్‌సీ నిర్ధారించారు. అంతర్జాతీయ సమాజాన్ని... ఆదాయం, భావజాలం రెండింటితో వేరు చేయబడిన భిన్న ప్రపంచాలుగా ఫ్రెంచ్ జనసంఖ్యాశాస్త్ర నిపుణుడు ఆల్‌ఫ్రెడ్ సావీ 1952లో వర్గీకరించారు. ప్రచ్ఛన్న యుద్ధ



బ్రెజిల్, చైనా, దక్షిణాఫ్రికా, భారత్, రష్యా నేతలు

సమయంలో గ్రామ్‌సీ నిర్ధారణలు మరింతగా ముందుకొచ్చాయి. మొదటి ప్రపంచంలో పెట్టుబడిదారీ పశ్చిమదేశాలు ఉన్నాయి. సోవియట్ యూనియన్, దాని సోషలిస్టు మిత్రులు రెండవ ప్రపంచంలో ఉన్నాయి. కొత్తగా వలసపాలనకు దూరమై, ఎక్కువగా పేదరికంలో ఉన్న దేశాలు మూడవ ప్రపంచంగా ఉంటున్నాయి. అమెరికన్ వామ పక్ష నేత కార్ల్ ఓగ్లెస్‌బీ 1969లో ఈ మూడవ ప్రపంచాన్ని 'గ్లోబల్ సౌత్' అని పిలిచాడు. 'గ్లోబల్ సౌత్‌పై ఉత్తరాది ఆధిపత్యం' గురించి కలత చెందాడు.

ఇండోనేషియాలోని బాండుంగ్‌లో 1955లో జరిగిన ఆసియా–ఆఫ్రికా కాన్ఫరెన్స్... తొలి గ్లోబల్ సౌత్ సమావేశాలలో ఒకటి. ఈ సదస్సుకు హాజరైన వాటిలో ఈ రోజు గ్లోబల్ సౌత్ అని భావించే దేశాలే కాకుండా సౌదీ అరేబియా, జోర్డాన్, టర్కీ వంటివి కూడా ఉన్నాయి. చాలావరకు కొత్తగా వలసపాలన నుంచి బయటపడిన ఈ దేశాలకు సదస్సు ఎజెండాలోని అతి ముఖ్యమైన అంశం... వలసవాదాన్ని, జాతి వివక్షను వ్యతిరేకించడమే. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ఏ ఒక్క అగ్రరాజ్యం పక్షం వహించకుండా ఉండాలనే ఆలోచన కూడా బాండుంగ్ సదస్సులోనే పుట్టింది.

చైనా, భారత్ రెండూ ఈ ప్రపంచానికి చెందినవి. దీనికి నాయకత్వం వహించాలని ఈ రెండూ ఆకాంక్షించాయి. ఈ సదస్సులో చైనా ప్రధానమంత్రి చౌ ఎన్‌లై, భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించారు. కొత్తగా వలసపాలన నుంచి బయటపడిన ప్రపంచానికి ఛాంపియన్లుగా నిలవగల తమ సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి పోటీపడ్డారు. బాండుంగ్ సమావేశం తర్వాత, భారతదేశం అలీనోద్యమ (నామ్) ప్రముఖ వాణిగా ఆవిర్భవించింది. తరచుగా నైతిక ఆధిపత్య స్థానాన్ని తీసుకుంటూ వచ్చింది. చైనా అలీనోద్యమంలో సహాయక పాత్రను పోషిస్తూనే, మావో హయాంలో అనేక ఆఫ్రికన్ దేశాలకు విదేశీ సహాయాన్ని అందించడం ప్రారంభించింది. చైనా తరచుగా తన కంటే తలసరి స్థూల జాతీయోత్పత్తి (జీఎన్‌పీ) ఎక్కువగా ఉన్న దేశాలకు కూడా సహాయం చేసింది.

అయితే ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచంలో వలసవాద వ్యతిరేకత, అలీనోద్యమం రెండూ... గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సాధారణ లింకుగా తమ ప్రాముఖ్యత కోల్పోయాయి. చమురు సంపన్న దేశమైన సౌదీ అరేబియా వర్గంలోని కొన్ని దేశాలను ఇందులో చేర్చడం కూడా అసంబద్ధంగా కనిపించింది. కానీ నయా – సామ్రాజ్యవాదమని చెబుతున్న పాశ్చాత్య ఆధిపత్యాన్నీ, దాని జోక్యాన్నీ వ్యతిరేకించాలనే భావన మాత్రం ఒక సాధారణ సూత్రంగా కొనసాగింది. ఇది చైనా, భారత్ రెండింటినీ ఆకర్షిస్తూనే ఉంది. ఇప్పుడు భారీ ఆర్థిక వ్యవస్థలతో ఎదుగుతున్న శక్తులుగా వీటిని పరిగణిస్తున్నప్పటికీ, ఇప్పటికీ సహాయం అవసరమవుతున్న, పాశ్చాత్య జోక్యాన్ని వ్యతిరేకిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లాగే ఉన్నామనీ, అందువల్ల మిగిలిన గ్లోబల్ సౌత్ పట్ల ఆసక్తులు కలిగి ఉన్నామనీ భారత్, చైనా నొక్కి చెబుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు సులభంగా రుణాలనూ, పెట్టుబడులనూ కల్పిస్తున్న చైనా... కఠినమైన, ఏమాత్రం సానుభూతి లేని అమెరికన్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా తనను తాను ప్రదర్శించుకుంటోంది. మరోవైపున చైనా పెట్టుబడులు, ఫైనాన్సింగ్‌తో సరితూగలేని భారత్... గ్లోబల్ సౌత్ ప్రయోజనాలను అర్థం చేసుకున్న దేశంగానూ, పశ్చిమ దేశాల, ముఖ్యంగా అమెరికా దగ్గర మన్నన ఉన్న దేశంగానూ తనను చూపుకుంటోంది.

కానీ గ్లోబల్ సౌత్ కొన్నిసార్లు చైనా, భారత్ మద్దతును అంగీకరించడానికి సిద్ధంగా ఉంటూనే, ఈ రెండు దేశాల్లో దేన్నయినా నిరపాయకరమైన నాయకుడిగా లేదా ఛాంపియన్ గా చూస్తోందా అనే విషయం స్పష్టం కావడం లేదు. ప్రపంచ రుణ సంక్షోభం పట్ల చైనా విముఖత, పశ్చిమ ఆఫ్రికాలో సహజ వనరులను అది దుర్వినియోగపర్చడం ఘర్షణను సృష్టించింది. మరోవైపున, భారత్‌తో వ్యవహరించడం కష్టమన్న భావన ఏర్పడింది. దీనికి ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలలో భారత్ అడ్డుకునే వాదం తోడయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రయోజనం కలిగించే అంశాలను, ఉదాహరణకు మత్స్య రాయితీల వంటి వాటిని వ్యతిరేకించి భారత్ కాస్త చెడ్డపేరు తెచ్చుకుంది. క్లుప్తంగా చెప్పాలంటే... చైనా, భారత్ దశాబ్దాలుగా గ్లోబల్ సౌత్‌లో ప్రముఖ పాత్ర పోషించాలని కోరుకుంటున్నాయి. ఆ ఆకాంక్షలు నెరవేరతాయో లేదో మాత్రం చూడాల్సి ఉంది.

వ్యాసకర్త సీనియర్ ఫెలో, కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్; అసోసియేట్ ప్రొఫెసర్, బోస్టన్ విశ్వవిద్యాలయం

('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

యోగులే ఆదర్శం



గొప్ప రుషులు, యోగులు నేరుగా విశ్వ ప్రజ్ఞ (మహా తత్వం, ఈశ్వరత్వం)తో తమను అనుసంధానించుకుని, విశ్వంలోని యావత్ వివేకాన్ని పొందగలిగే, దాని ధర్మాలను, మాంత్రిక శక్తిని నిలపగలిగే విద్యను అభ్యసించారు. అలాంటి అంతర్గత ప్రజ్ఞ మాత్రమే మనల్ని శాశ్వత సత్యం వైపు నడుపుతుంది.

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

అందరూ పోకూడదా?



హిందుయేతరులు ఎవరూ ధ్వజ స్తంభం దాటి పళనిలోని మురుగన్ ఆలయంలోకి పోకూడదని మద్రాసు హైకోర్టు తాలూకు మదురై బెంచ్ తీర్పునిచ్చిందని వార్త. దీనితో నేను విభేదిస్తున్నాను. ఆలయ నియమాలు పాటించినంత వరకూ ఎవరికైనా ప్రవేశం ఉండాలి. ఆలయాలు విహార కేంద్రాలు కాదనేది నిజమే కావొచ్చు. కానీ చాలామంది మన సంస్కృతి, నిర్మాణ కళలను ఆనందించడానికి కూడా ప్రాచీన ఆలయాలను దర్శిస్తారు.

– సుమంత్ రామన్, యాంకర్

ఒత్తిడి ఉద్యోగాలు



శిక్షణాకాలంలో వైద్యులకు ఉండే నిద్రలేమి చాలు... వాళ్లను స్థూలకాయులుగా, రోగులుగా మార్చడానికి! ఇక ఎల్లవేళలా చావు, బతుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన తీవ్ర ఒత్తిడి గురించి మాట్లాడనే వద్దు. కార్టిజాల్ (ఒత్తిడిలో విడుదలయ్యే హార్మోన్) స్థాయులు ఎప్పుడూ అత్యధికంగానే ఉంటాయి.

– నియాజ్ అష్రఫ్, ఇంటెన్సివ్ కేర్ ఫిజీషియన్

అందరూ నిపుణులే!



చట్టబద్ధ హెచ్చరిక: బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే ఫిబ్రవరి 1 నాడు నిపుణులందరూ ఆర్థికవేత్తలే అవుతారు. అలాగే బడ్జెట్ అనంతరం, చాలామంది లాగే నేను కూడా ఆర్థికవేత్తనే అవుతాను. కాబట్టి నాతో వాదించొద్దు. నాకన్నీ తెలుసు.

– ముకుల్ దేఖనే, కమెడియన్

వస్తూనే...



గత దశాబ్దంలో అమెరికాలోకి అక్రమ వలసలు దాదాపుగా వెయ్యి శాతానికి పైగా పెరిగాయి. ఇంకా తీవ్రంగా పెరుగుతూనే ఉన్నాయి.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

చిరస్మరణీయుడు రెడ్డియార్

దేశానికి స్వాతంత్ర్యం లభించే నాటికి ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి తదనంతరం మరో రెండేళ్లు అదే పదవిలో కొనసాగి తెలుగు జాతికి వన్నె తెచ్చిన నేత ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్. దళితులకు హిందూ దేవాలయాల ప్రవేశం కల్పిస్తూ చట్టం చేసిన తొలి ముఖ్యమంత్రి ఆయనే. 1947లో తీసుకు వచ్చిన ఈ చట్టం 'మద్రాస్ యాక్ట్ 5 ఆఫ్ 1947'గా ప్రసిద్ధి చెందింది. అలాగే 'దేవదాసి' విధానాన్ని రూపు మాపడానికి ఒక చట్టం రూపొందించారు.



ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్

ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వ రాజముద్రగా ఉన్న గోపురం గుర్తులు తయారు చేయించి దానిని అమలులోకి తెచ్చిన ఘనత ఆయనదే.

చిన్నప్పటినుంచి దేశభక్తి గల రామస్వామి స్వాతంత్రోద్యమ కదన రంగంలోకి దూకి స్వాతంత్ర్య సముపార్జనలో తన వంతు సాయాన్ని అందించారు. నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో జాతి విభేదాలు లేకుండా అందరూ సమానంగా మెలగాలని తప్పని సరిగా ఖద్దరు ధరించాలని ఆయన సూచించారు. 1922లో దిండివనం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. వేదారణ్యం ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. 1938లో తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టయ్యారు. '1919 భారత ప్రభుత్వ చట్టం' ప్రకారం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1920లో శాసనసభ ఏర్పాటయింది. 1947 మార్చి 23న రామస్వామి రెడ్డి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అయన పదవిలో ఉండగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. 1948లో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఎన్నికల్లో రామస్వామి రెడ్డి అభ్యర్థిత్వాన్ని టంగుటూరి ప్రకాశం వ్యతిరేకించినా కామరాజ్ మద్దతుతో ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1949లో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయి కుమారస్వామి రాజాకి పదవి అప్పగించారు. 1965లో గవర్నర్ పదవి స్వీకరించవలసిందిగా లాల్‌బహదూర్ శాస్త్రి కోరగా ఆయన తిరస్కరించారు.

తమిళనాడులోని దిండివనం సమీపంలోని ఒమాండూర్ అనే గ్రామంలో 1895 ఫిబ్రవరి 1న ముత్తు రామరెడ్డియార్, రంగనాయకమ్మ దంపతులకు జన్మించిన రామస్వామి రెడ్డికి ఆయన ఊరు పేరే ఇంటిపేరయింది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర విభజనలో భాగంగా ఆయన నివసించే ప్రాంతం తమిళనాడులో ఉన్నందున ఆయన అక్కడి వారయ్యారు. 1970 ఆగష్టు 25న మృతి చెందిన ఆయనను తెలుగు వారు స్మరించుకోకపోవడం బాధాకరం.

– మేడపాటి శ్రీనివాస రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

(ఒమాండూర్ రామస్వామి రెడ్డియార్ జయంతి సందర్భంగా)

జన్యుమార్పిడి ఆవనూనె అవసరమా?

ఇంటిల్లిపాదీ అనుదినం తినే వంటకాల్లో వంట నూనె వాడకం తప్పనిసరిగా ఉంటుంది. అటువంటి అతి ముఖ్యమైన వంటనూనె కచ్చితంగా ఆరోగ్యదాయకమైనదని నిర్ధారణ అయినదై ఉండాలనుకుంటాం. అయితే, మనం చట్ట విరుద్ధంగా దిగుమతైన జన్యుమార్పిడి చేసిన నూనె గింజల నుంచి తీసిన వంట నూనెను చాలా ఏళ్లుగా తింటున్నామన్న సంగతి మీకు తెలుసా? విస్తుగొలిపే ఆ విషయం సుప్రీంకోర్టు సాక్షిగా ఇటీవలే అధికారికంగా వెల్లడైంది.

కేంద్ర ప్రభుత్వమే దీనికి సంబంధించిన గణాంకాలను సుప్రీంకోర్టుకు జనవరి 18న నివేదించింది. జన్యుమార్పిడి (జెనటికల్లీ మాడిఫైడ్ – జీఎం) పంటలపై 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు... జీఎం ఆవక్షేత్ర ప్రయోగాల అనుమతులపై దాఖలైన కేసుపై సుప్రీంకోర్టులో జస్టిస్ బీవీ నాగరత్న, సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట ఇటీవలే తిరిగి వాదనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన వాదనల ద్వారానే మన దేశం దిగుమతి చేసుకుంటున్న జీఎం వంట నూనెల సంగతులు అధికారికంగా తొలిసారి వెలుగులోకి వచ్చాయి. వాద ప్రతివాదనలను విన్న ఈ ధర్మాసనం ఇరుపక్షాలు తమ వాదనలను రాతపూర్వకంగా సమర్పించమని ఆదేశిస్తూ తీర్పును రిజర్వు చేసిన నేపథ్యంలో జీఎం వంట నూనెల పూర్వాపరాలను పరిశీలిద్దాం.

మన దేశంలో ఎక్కువగా వాడేది ఆవ నూనే. జన్యుమార్పిడి వంట నూనెలను దశాబ్దాలుగా మన దేశంలో వాడుతున్నాం. వంట నూనెల ధరను సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంచడానికి దేశీయంగా నూనె గింజల సాగు విస్తీర్ణం పెంచాల్సి ఉంది. మనం వాడుతున్న 50–60 శాతం వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నవే. అందువల్ల కలుపు మందును తట్టుకునేలా (హెచ్‌టీ) జన్యుమార్పిడి చేసిన ఆవ పంట క్షేత్ర ప్రయోగాలను మన దేశంలో అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు.

అయితే, పిటిషనర్ అరుణ రోడ్రిగ్స్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ 'ఆరుబయట పొలాల్లో జన్యుమార్పిడి ఆవ పంట సాగును ఒక్కసారి అనుమతిస్తే మన సంప్రదాయక ఆవ వంగడాలన్నీ జన్యుకాలుష్యానికి గురవుతాయి. ఇక తరతరాల సంపదైన సేంద్రియ ఆవ రకాలు మిగలవు. సేంద్రియ ఆహారోత్పత్తుల్ని మన దేశం నుంచి భారీస్థాయిలో ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాన్ని కోల్పోతాం' అని హెచ్చరించారు.

దిగుమతైన జీఎం వంట నూనె ఎంత? సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు అందించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ రూపొందించిన గణాంకాల ప్రకారం... 2020–21లో



దేశంలో 2.46 కోట్ల టన్నుల వంట నూనె వినియోగించగా, ఇందులో 1.11 కోట్ల టన్నులు దేశీయంగా ఉత్పత్తి చేసుకున్నాం. మిగతా 1.35 కోట్ల టన్నుల (54 శాతం) వంట నూనెను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నాం. ఇందులో పామాయిల్ 57 శాతం, సోయాబీన్ నూనె 22 శాతం, పొద్దుతిరుగుడు నూనె 15 శాతం, మిగతాది ఆవ (కనోల) నూనె. అదే మాదిరిగా 2022–23లో 20 లక్షల టన్నులు అదనంగా అంటే.. 1.55 కోట్ల టన్నులను (మొత్తం వాడిన వంట నూనెలో ఇది 55.76శాతం) దిగుమతి చేసుకున్నాం. 55 వేల టన్నుల జన్యుమార్పిడి ఆవ (కనోల) నూనెను దిగుమతి చేసుకుంటున్నామని మెహతా కోర్టుకు తెలిపారు.

జన్యుమార్పిడి వంట నూనె దిగుమతి మన ప్రస్తుత చట్టాలకు అనుగుణమైనది కానప్పటికీ దిగుమతి చేసుకుంటున్నట్లు సొలిసిటర్ జనరల్ అందించిన గణాంకాలతో తేటతెల్లమైంది. ఈ అక్రమ దిగుమతులతో పాటు, ప్రతి ఏటా మన దేశంలో పండించే జన్యుమార్పిడి పత్తి గింజల నూనెను సైతం మన దేశంలో వంట నూనెగా యథేచ్ఛగా వాడుతున్నాం. ఇది కూడా చట్టవ్యతిరేకమే. ఎందుకంటే, భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జన్యుమార్పిడి నూనెల వాడకానికి సంబంధించి సెక్షన్ 22 ప్రకారం ఇప్పటి వరకు ఎటువంటి నియమ నిబంధనలను విడుదల చేయలేదు. తక్కువ ధరకే వంట నూనెను ప్రజలకు అందించాలన్న కారణంతో జీవ భద్రతను ఫణంగా పెట్టటం ఎంతవరకు సబబు?

జీఎం వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్నట్లు సుప్రీంకోర్టుకు నివేదించిన సొలిసిటర్ జనరల్... వీటి వినియోగం వల్ల ప్రజలకు ఎటువంటి హానీ జరగలేదని వాదించారు. అయితే, ఈ వాదనను బలపరిచే గణాంకాలేవీ ఆయన కోర్టుకు సమర్పించలేదు. కాబట్టి ఈ వాదన అశాస్త్రీయమని కోలిషన్ ఫర్ జీఎం ఫ్రీ ఇండియా (రైతులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలతో కూడిన కూటమి) ఆక్షేపించటం ప్రజారోగ్య సంబంధమైన ప్రశ్న.

నిజానికి జీఎం ఆవ వంగడం కన్నా ఇప్పటికే ఉన్న ఆవ రకాల దిగుబడే ఎక్కువగా ఉన్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. అటువంటప్పుడు ఈ జీఎం ఆవ పంట అవసరమా అన్నది అంతుపట్టని ప్రశ్న. ఓ కంపెనీకి చెందిన కలుపు మందును తట్టుకునేలా(హెచ్‌టీ) జన్యుమార్పిడి చేసిన తొలి పంట జీఎం ఆవ. దీనికి ఆమోదం ఇస్తే... వరుసగా అనేక హెచ్‌టీ పంటలకు సులువుగా ఆమోదం పొందొచ్చునని ఆశిస్తున్న కార్పొరేట్ల లాబీయింగ్ వల్లనే కేంద్రం జీఎం ఆవకు తోవ ఇస్తోందని అనుకోక తప్పటం లేదు.

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్

కార్యసాధకుల మార్గం

'మరణం అనే సంకటం లోకంలో ఏదో ఒక మూలన ప్రాణికోటిలోని కొంత భాగాన్ని ప్రతి క్షణం శోకంలో ముంచెత్తుతూ ఉండగా, సుఖంగా ఎలా కాలం గడుపుతున్నావు తండ్రీ?' అని పూర్వం ఒక యువకుడు దిగులు నిండిన హృదయంతో తన తండ్రిని ప్రశ్నించాడు. చుట్టూ ప్రశాంతత నిండివున్న సుందరమైన రాత్రివేళ పూర్ణచంద్రుడు కురిపిస్తున్న చల్లని, తెల్లని వెన్నెలలో భూమి తడిసి ముద్దవుతూ వుంది. అమృతమయంగా వున్న ఆ రాత్రి సౌందర్యాన్ని తనివితీరా అనుభవిస్తూ తనను తాను మరిచిపోయినట్లున్న ఆ తండ్రి మనసుని ఆ ప్రశ్న కలత పరచగా అతడిలా బదులిచ్చాడు: ''నాయనా, ఎందుకు అలాంటి ప్రశ్నలతో నా మనసును భయభ్రాంతులకు గురి చేస్తావు? ఒక్కసారి ఇటు చూడు. ఇటువంటి ప్రశాంతత నిండిన అమోఘమైన రాత్రులే కదా మన జీవితంలో వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. పుట్టుకతోనే మరణం అనే తప్పించుకోలేని వలలో చిక్కుకుని ఉన్నవాడినని తెలిసున్న నేను, మరణం సంభవించడం జరిగినప్పుడు, అది ఒక్క క్షణ కాలం కూడా ఆగకుండా నన్ను తీసుకుపోతుందని తెలిసున్న నేను, ఈ సౌందర్య భరిత రాత్రుల ఆనందాన్ని క్షణమైనా వదలక అనుభవించకుండా ఎలా ఉండగలను? ఏ మనిషి జీవితంలోనైనా ఏ ఆనందానికీ నోచుకోకుండా గడిచిన రాత్రి అంటే ఆ మనిషి జీవితంలో వ్యర్థమైపోయిన ఒక రోజుగానే పరిగణింపబడుతుంది కదా! ఆదమరచి గడ్డిమేస్తున్న మూగజీవంపై అకస్మాత్తుగా వచ్చి పడి తన్నుకుపోయే పెద్దపులి వంటి మృత్యువును గురించి ఆలోచిస్తూ కాలాన్ని ఎందుకు నిరుపయోగంచేసి వృథా చేయడం?

'నలుగురికి మేలుచేసే కల్యాణ కారకమైన పనిని ఆరోజే, ఆ క్షణమే చేసెయ్యాలి. కాలాన్ని చేజారి పోనీయవద్దు. అలా పోనిస్తే చేయాలనుకున్న మంచిపనులు చేయకుండానే మిగిలిపోతాయి. చెప్పకుండానే మృత్యువు జీవితాన్ని లాగేసుకుంటుంది' అని మహాభారతం అంటోంది (శాంతిపర్వం, 175వ అధ్యాయం). కనుక భయాన్ని కలుగజేసే ఆలోచనలతో అంతరంగాన్ని నింపి కాలాన్ని వృథా చేసుకోవద్దు. అది కార్యసాధకులు అనుసరించే మార్గం కాదు!''

– భట్టు వెంకటరావు

జ్యోతిర్మయం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.10.06 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** చిత్త రా.12.16 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.6.55 నుండి 8.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.08 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.41 వరకు, **అమృత ఘడియలు:** సా.5.13 నుండి 6.57 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.51.

ఏసీబీ వలలో కాశీబుగ్గ జీఎస్‌టీవో

- చెల్లించిన ట్యాక్స్ తిరిగి ఇప్పించేందుకు రూ.లక్షన్నర డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన 'జీడి' వ్యాపారి
- రూ.లక్ష నగదు స్వాధీనం


ఏసీబీకి పట్టుబడిన ఎస్.కిషోర్‌కుమార్

కాశీబుగ్గ: జీడి గింజల వ్యాపారి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎస్‌టీవో (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ అధికారి) ఎస్.కిషోర్‌కుమార్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు బుధవారం పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే... పలాస మండలానికి చెందిన ఓ జీడి వ్యాపారి తాను ప్రభుత్వానికి ట్యాక్స్ అదనంగా చెల్లించానని, దీన్ని తనకు తిరిగి ఇప్పించాలని అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి విన్నవించారు. ఆయన బదులిస్తూ మీరే ప్రభుత్వానికి కట్టాల్సి ఉంటుందేమో పరిశీలించాలని చెప్పడంతో వెనుదిరిగాడు. అనంతరం జీఎస్‌టీవో ఎస్.కిషోర్‌కుమార్‌ను సంప్రదించడంతో ఆయన కూడా అదే సమాధానం ఇస్తూ.. తనకు రూ.లక్షన్నర ఇస్తే పరిష్కరిస్తామని చెప్పడంతో ఆ వ్యాపారి కంగుతిన్నాడు. తనకు రావాల్సిన డబ్బుల కోసం లంచం ఇవ్వాలా అని ప్రశ్నించడంతో.. తనకు ఇచ్చితీరాలని, లేకుంటే ఇబ్బందులు తప్పవని చెప్పడంతో లంచం ఇవ్వడానికి ఇష్టం లేని వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ ఇచ్చిన సూచనల మేరకు బుధవారం మధ్యాహ్నం రూ.లక్షను జీఎస్‌టీవోకు ఇవ్వగా, అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో రికార్డులు, ఏడాదిలో జరిగిన లావాదేవీలు పరిశీలించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరి పాత్ర ఉందో ఆరా తీశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి సిబ్బంది వద్ద సమాచారం సేకరించారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీఎస్‌టీవో కిషోర్‌కుమార్‌ను పట్టుకున్నామని, ఆయన్ను గురువారం విశాఖపట్నం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ప్రకటించారు. జీడి వ్యాపారి పేరును ప్రకటించబోమని స్పష్టం చేశారు.

రూ.80 లక్షల నగదు సీజ్

టంగుటూరు: ప్రకాశంజిల్లా టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఓ కారులో తరలిస్తున్న రూ.80 లక్షల నగదును పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, జరుగుమల్లి, సింగరాయకొండ ఎస్సైలు వెంకటేశ్వరరావు, శ్రీరామ్ తమ సిబ్బందితో టంగుటూరు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ చేపట్టారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న టీఎస్ 11 బీడీ 2299 నంబర్ ఆడీ వాహనం తనిఖీ చేయగా బ్యాగులో రూ.80 లక్షల నగదును గుర్తించారు. కారులోని వ్యక్తులను విచారించగా సరైన సాక్ష్యాధారాలు చూపకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. హైదరాబాద్‌కు చెందిన ఆటమ్ ఏయిట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీకి చెందిన నగదుగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగదు, కారును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఆదా కోసం 'బిల్డింగ్ కోడ్'!

- వాణిజ్య, నివాస భవనాల కోసం ఇప్పటికే ఈసీబీసీ పేరుతో ప్రత్యేక నిబంధనలు
- దానిని సవరిస్తూ ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సస్టైనబుల్ బిల్డింగ్ కోడ్ పేరుతో కొత్త ముసాయిదా
- 12వ తేదీ వరకు అభిప్రాయాలు స్వీకరించనున్న కేంద్రం నేతృత్వంలోని 'బీఈఈ'



సాక్షి, అమరావతి: భవన నిర్మాణ రంగంలో విద్యుత్ ఆదా చర్యల ద్వారా పర్యావరణానికి మేలు చేసేందుకు కేంద్ర విద్యుత్ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే తీసుకువచ్చిన ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ) ఏపీతో పాటు పలు రాష్ట్రాల్లో సత్ఫలితాలను ఇస్తుండగా.. తాజాగా దానిని సవరిస్తూ ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సస్టైనబుల్ బిల్డింగ్ కోడ్(ఈసీఎస్‌బీసీ) పేరుతో కొత్త డ్రాఫ్ట్‌ను బీఈఈ రూపొందించింది. ఈ ముసాయిదాపై ఈ నెల 12లోగా అభ్యంతరాలు, అభిప్రాయాలు వెల్లడించాలని ప్రజలను, రాష్ట్రాలను బీఈఈ కోరింది. ఇది అమల్లోకి వస్తే కొత్తగా నిర్మించే వాణిజ్య-నివాస భవనాల్లో నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ పొదుపు చర్యలను పాటించాల్సి ఉంటుంది.

ఏమిటీ ముసాయిదా..

ప్రపంచంలో విద్యుత్ వల్ల వెలువడే కర్బన ఉద్గారాల్లో 39 శాతం భవన నిర్మాణ రంగం నుంచే వస్తోంది. అలాగే మొత్తం విద్యుత్ వినియోగంలో 36 శాతం భవనాల్లోనే జరుగుతోంది. పారిస్ ఒప్పందానికి అనుగుణంగా 2030 నాటికి నిర్మాణ రంగ ఇంధన డిమాండ్‌ను 50 శాతం తగ్గించగల సామర్థ్యం ఈసీఎస్‌బీసీకి ఉందని బీఈఈ గుర్తించింది. ఇంజనీర్లు, డెవలపర్‌లు, నిర్మాణ సంస్థల సంయుక్త సహకారంలో దీనిని విజయవంతం చేయాలని బీఈఈ భావిస్తోంది. వనరుల సంరక్షణతో పాటు వ్యర్థాలు, కాలుష్యం, పర్యావరణ క్షీణతను తగ్గించడం, పగటిపూట సహజ వెలుతురు ప్రసరణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముసాయిదాను తయారు చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించేందుకు అన్ని విభాగాలను భాగస్వామ్యం చేసిన సంగతి తెలిసిందే. గృహ, పరిశ్రమ, వ్యవసాయం సహా అనేక రంగాల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తోంది. భవనాల్లో దాదాపు 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చని అంచనా వేసింది. స్కూళ్లు, ఆస్పత్రులు, టీటీడీ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టులతో పాటు వాణిజ్య భవనాలు, నివాస భవనాల్లో ఇంధన సంరక్షణను ప్రోత్సహించడం కోసం ఈసీబీసీని కూడా అమలు చేస్తోంది. ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్‌ను కూడా అందించింది. వ్యవసాయంలో డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించి రైతులు, పంప్ టెక్నీషియన్‌లతో వివిధ అవగాహన సెషన్‌లను నిర్వహించింది. ఇటువంటి చర్యలతో గతేడాది జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2023ను ఆంధ్రప్రదేశ్ అందుకుంది.

'ఈసీబీసీ'లో ఏపీ ఆదర్శం



వెయ్యికి పైగా భవనాల్లో ఈసీబీసీ అమలుతో పాటు 3 వేల మంది కంటే ఎక్కువ వాటాదారులకు శిక్షణ ఇవ్వడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించింది. వేగంగా అభివృద్ధి చెందుతూ.. విస్తరిస్తున్న విశాఖ వంటి నగరాల్లో ఈసీబీసీ అమలు వల్ల విద్యుత్ ఆదాతో పాటు కర్బన ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతోంది. నీటి వనరులు కూడా కలుషితం కావు. ఉత్పాదక రంగం వృద్ధి చెందుతుంది. భవన నిర్మాణ రంగంలో ఆవిష్కరణలు, పోటీతత్వం, గ్రీన్ ఉద్యోగాలు, నైపుణ్యాలు, సాంకేతికతలకు అవకాశాలు పెంచడంలో ఈ కోడ్ సహాయపడుతుంది. ఈ క్రమంలోనే విశాఖలో సూపర్ ఈసీబీసీ భవన నిర్మాణాన్ని చేపట్టిన ఏపీ.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.

– అభయ్ బాక్రే, డైరెక్టర్ జనరల్, బీఈఈ

3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు

- ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ చైర్మన్


అధికారులతో చర్చిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్నవయసు నుంచే చిన్నారుల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీన్లో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు వచ్చేందుకు సమ్మతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయం నుంచి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని చైర్మన్ తెలిపారు. 16 సంవత్సరాల క్రితం తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు ధార్మిక సదస్సులు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. చైర్మన్ వెంట జేఈవో సదా భార్గవి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, సీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటాం

- ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి
- విశాఖలో ముగిసిన ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ
- మిషన్ లైఫ్ పోస్టర్ ఆవిష్కరణ
- నేడు ఏపీ జెన్‌కో బహుళ వార్షిక నివేదికపై బహిరంగ విచారణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈఆర్సీ బహిరంగ విచారణలో వచ్చిన ప్రతీ అభ్యంతరాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి స్పష్టం చేశారు. సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి నేతృత్వంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బహిరంగ వర్చువల్ విచారణ బుధవారం ముగిసింది. నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గృహ, రాజకీయ, వ్యవసాయ, పారిశ్రామిక, వివిధ వర్గాలకు చెందిన వినియోగదారులుగానీ, వారి ప్రతినిధులుగానీ రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగతంగా, వివిధ సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు వర్చువల్‌గా హాజరై పలు అంశాలపై సూచనలను, అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలియజేశారన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోష రావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ ప్రతీ అభ్యంతరానికి వివరణ ఇచ్చారని తెలిపారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీట్రాన్స్‌కో జేఎండీ, ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను చదివి వినిపించారు. వ్యవసాయ వినియోగదారులకు పగటిపూట 9 గంటల విద్యుత్‌ను అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యుత్ అందించాలనే వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్నదన్నారు. అలాగే గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటలూ నిరంతరాయంగా సరసమైన ధరలకు విద్యుత్‌ను అందించడంతో పాటు.. సబ్సిడీపై విద్యుత్‌ను అందిస్తుందని తెలిపారు. విద్యుత్ చట్టం 2003కు లోబడి వివిధ ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ఆయా రంగాల వినియోగదారులకు సబ్సిడీపై విద్యుత్ అందించడానికి అవసరమైన నిధులు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా, కాప్-26లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించిన ట్రాన్స్‌ఫార్మేటివ్ మిషన్ లైఫ్‌కి ఏపీ విద్యుత్‌నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి, ఎస్ఈసీఎం సీఈవో కుమార్‌రెడ్డి, బీఈఈ (సౌత్) మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ), కేంద్ర విద్యుత్ శాఖకు సంబంధించిన మిషన్ లైఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీఈఆర్‌సీ సెక్రటరీ డి.రమణయ్యశెట్టి, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.

నేడు ఏపీ జెన్‌కో ప్రజాభిప్రాయ సేకరణ

ఏపీ జెన్‌కో సమర్పించిన బహుళ వార్షిక కాల వ్యవధి 2024 నుంచి 2029 నియంత్రణ కాలానికి సంబంధించిన నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం జరుగనుంది.

హెచ్‌పీసీఎల్ రిఫైనరీ భారీ విస్తరణ

- రెండో వారంలో ప్రారంభించనున్న ప్రధాని
- రిఫైనరీ సామర్థ్యం 15 ఎంఎంపీటీఏకు పెంపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ... ఆయిల్ రిఫైనరీకి కూడా కేంద్రంగా మారనుంది. రూ.26,264 కోట్లతో చేపట్టిన హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ, ఆధునికీకరణ పనులు పూర్తికాగా, ఫిబ్రవరి రెండో వారంలో ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఫలితంగా విశాఖలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ సామర్థ్యం ఏడాదికి 15 మిలియన్ మెట్రిక్ టన్నులకు (ఎంఎంపీటీఏ) చేరనుంది. దీంతో దేశ వ్యాప్తంగా బహుశా విశాఖ నుంచే బీఎస్-6 ఆయిల్ సరఫరా అయ్యే అవకాశం ఉంది.


భారీ రియాక్టర్లు: ఇక హెచ్‌పీసీఎల్ విస్తరణకు ప్రపంచంలోనే మొదటిసారిగా రిఫైనరీలో భారీ రియాక్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే విశాఖ హెచ్‌పీసీఎల్ ప్లాంటుకు రెండు రియాక్టర్లు చేరుకున్నాయి. క్రూడ్ ఆయిల్ నుంచి సల్ఫర్ కంటెంట్ ఎక్కువగా ఉన్న బీఎస్-6 ఆయిల్‌ను ఉత్పత్తి చేసేందుకు ఈ భారీ రియాక్టర్లను ఉపయోగించనున్నారు. ఈ ప్లాంటులోనే సొంత విద్యుత్ అవసరాల కోసం క్యాప్టివ్ పవర్ ప్లాంటును కూడా నెలకొల్పుతున్నారు.

వాహన కాలుష్యానికి అడ్డుకట్ట: బీఎస్-6 వాహనాల తయారీ నేపథ్యంలో బీఎస్-6 ఆయిల్ కూడా సరఫరా కానుంది. బీఎస్-6 ఆయిల్ వల్ల వాతావరణ కాలుష్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రోజుకు 3 లక్షల బ్యారల్స్: ఈ విస్తరణ ప్రక్రియ ముందస్తు ఒప్పందం మేరకు 2020 మధ్యనాటికే పూర్తికావాల్సి ఉన్నా కోవిడ్ కారణంగా పనులు నెమ్మదించాయి. తాజాగా ఈ పనులు పూర్తి చేశారు. ఇక ప్రస్తుతం ఈ రిఫైనరీ 1,66,000 బ్యారళ్ల ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుండగా... పెరగనున్న సామర్థ్యం (15 ఎంఎంపీటీఏ) ప్రకారం ఈ ఉత్పత్తి రోజుకు 3 లక్షల బ్యారల్స్‌కు (సుమారు 4.77 కోట్ల లీటర్లు) పెరగనున్నది.

అంతర్రాష్ట్ర అక్రమ మద్యం రాకెట్ గుట్టురట్టు

- రూ.12.52 లక్షల విలువైన 1,252 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ఐదుగురు నిందితుల అరెస్టు


పట్టుకున్న అక్రమ మద్యంతో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: అంతర్రాష్ట్ర అక్రమ మద్యం రాకెట్ గుట్టును వైఎస్సార్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం, ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వివరాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బుధవారం మీడియాకు వెల్లడించారు. ప్రొద్దుటూరు టూటౌన్ పరిధిలోని జమ్మలమడుగు- మైదుకూరు రహదారిపై వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ ఐషర్ వాహనంలో కూరగాయల మాటున అక్రమంగా తరలిస్తున్న రూ.12.52 లక్షల విలువైన 1,252 ఎన్‌డీపీఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో విశేష కృషి చేసిన సీఐ, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఆయన అభినందించి, వారికి నగదు అవార్డులను అందజేశారు. పోలీసులు-ఎస్ఈబీ కలిసి సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామనీ, రాత్రి పూట గస్తీ ముమ్మరం చేశామని వివరించారు.

సోరెన్ అరెస్టు

మనీ లాండరింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న ఈడీ

- అరెస్టు కంటే ముందే ముఖ్యమంత్రి పదవికి హేమంత్ రాజీనామా
- జార్ఖండ్ కొత్త సీఎంగా జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్

రాంచీ: జార్ఖండ్ రాజకీయాలు అనూహ్యమైన మలుపు తిరిగాయి. పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి 9.30 గంటలకు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ఆయనను కోర్టులో ప్రవేశపెట్టబోతున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో సోరెన్‌ను తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. అరెస్టు కంటే ముందే హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నూతన ముఖ్యమంత్రిగా జేఎంఎం సీనియర్ నేత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చంపయ్ సోరెన్ పేరును అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)–కాంగ్రెస్–రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేతలు ప్రతిపాదించారు. మనీ లాండరింగ్ కేసులో తొలుత హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు పటిష్టమైన భద్రత మధ్య సుదీర్ఘంగా విచారించారు. అనంతరం ఆయన తమ ఎమ్మెల్యేలతో రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను కలిసి తన రాజీనామా పత్రాలు అందజేశారు. సీఎం పదవికి రాజీనామా చేసిన హేమంత్ సోరెన్‌ను నిమిషాల వ్యవధిలోనే ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు జేఎంఎం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి అధికార నివాసంలో సమావేశమయ్యారు. తమ పార్టీ శాసనసభాపక్ష నాయకుడి ఎన్నికపై చర్చించారు. కొత్త సీఎంగా చంపయ్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జేఎంఎం అధికార ప్రతినిధి వినోద్ పాండే చెప్పారు. మొత్తం 81 స్థానాలున్న అసెంబ్లీలో తమకు 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చంపయ్ సోరెన్ అన్నారు. అంతకుముందు హేమంత్ సోరెన్ స్థానంలో ఆయన భార్య కల్పనా సోరెన్ లేదా వదిన సీతా సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించబోతున్నారని ప్రచారం జరిగింది. హేమంత్ సోరెన్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారని జేఎంఎం మహిళా ఎంపీ మహువా మాఝీ చెప్పారు.


హేమంత్ సోరెన్

7 గంటలపాటు సోరెన్ విచారణ

మనీ లాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులు బుధవారం ప్రశ్నించారు. రాంచీలోని సోరెన్ అధికార నివాసంలో 7 గంటలపాటు ఈ విచారణ కొనసాగింది. సోరెన్‌కు సంఘీభావం తెలియజేస్తూ ఆయన నివాసానికి జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలు తరలివచ్చారు. ఈడీ విచారణకు సోరెన్ పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని ఆరోగ్య శాఖ మంత్రి బన్నా గుప్తా చెప్పారు. ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ పెద్ద సంఖ్యలో జేఎంఎం నేతలు, కార్యకర్తలు రాంచీకి చేరుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సోరెన్‌ను లక్ష్యంగా చేసుకొని, విచారణ పేరుతో వేధిస్తోందని వారు మండిపడ్డారు. దళితుడు కావడం వల్లే సోరెన్‌పై వేధింపులు మొదలయ్యాయని ఆరోపించారు. తమ ముఖ్యమంత్రి జైలుకు వెళితే తాము ఆయనతోపాటు వెళ్తామని తేల్చిచెప్పారు. ఇదే కేసులో ఈడీ అధికారులు ఈ నెల 20న హేమంత్ సోరెన్‌ను 7 గంటలపాటు విచారించారు. సోమవారం ఢిల్లీలో సోరెన్ నివాసంలో సోదాలు జరిపారు. చట్టవిరుద్ధంగా భూయాజమాన్య మార్పిడికి పాల్పడిన వ్యవహారంలో హేమంత్ సోరెన్ పాత్ర ఉన్నట్లు అభియోగాలు నమోదయ్యాయి.

ఈడీ అధికారులపై సోరెన్ ఫిర్యాదు

ఈడీ అధికారులపై హేమంత్ సోరెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోరెన్ ఫిర్యాదు మేరకు రాంచీలోని ఎస్సీ/ఎస్టీ పోలీసు స్టేషన్‌లో కొందరు సీనియర్ ఈడీ అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఢిల్లీలోని తన నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించిందని, తనను వేధింపులకు గురిచేస్తోందని, తన సామాజిక వర్గాన్ని అప్రతిష్టపాలు చేస్తోందని ఫిర్యాదులో సోరెన్ ఆరోపించారు. ఈడీ అధికారుల తీరు వల్ల తన కుటుంబం మానసిక వేదన అనుభవిస్తోందని మండిపడ్డారు. ఈడీ అధికారులు సోమవారం ఢిల్లీలో హేమంత్ సోరెన్ ఇంట్లో సోదాలు చేశారు. రూ.36 లక్షల నగదు, కీలక పత్రాలతోపాటు ఓ ఖరీదైన కారును స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆ నగదు, ఆ కారుతో తనకు సంబంధం లేదని హేమంత్ తేల్చిచెప్పారు.

ఎవరీ చంపయ్ సోరెన్?



జార్ఖండ్ కొత్త సీఎంగా చంపయ్ సోరెన్ పేరు ఖరారైంది. ఆయన 1956 నవంబర్‌లో జిలింగోరా గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. మెట్రిక్యులేషన్ చదివారు. తొలిసారిగా 1991లో సెరికేలా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటినుంచి వరుసగా విజయం సాధిస్తూనే ఉన్నారు. జేఎంఎం అధినేత శిబూ సోరెన్‌కు విధేయుడిగా పేరుగాంచారు. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అయితే, శిబూ సోరెన్ కుటుంబంతో చంపయ్ సోరెన్‌కు ఎలాంటి బంధుత్వం లేదు. చంపయ్‌ను ప్రజలు జార్ఖండ్ టైగర్ అని పిలుస్తుంటారు.

కేజ్రీవాల్‌కు ఐదోసారీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణంలో తాము ప్రశ్నించేందుకు తమ ఆఫీస్‌కు రావాలని మరోసారి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ మేరకు ఆయనకు సమన్లు జారీచేసింది. ఇలా ఆయనకు సమన్లు పంపడం ఇది ఐదోసారి. గత నాలుగుసార్లు ఆయన ఈడీ ఆఫీస్‌కు రాలేదు. దీంతో ఫిబ్రవరి రెండో తేదీన రావాలని తాజాగా ఈడీ సమన్లు జారీచేసింది. ఈనెల 18న, మూడున, గత ఏడాది నవంబర్ రెండు, డిసెంబర్ 21వ తేదీల్లోనూ సమన్లు జారీ అయ్యాయి. కేసుతో సంబంధంలేని తనకు సమన్లు పంపడం అక్రమమని కేజ్రీవాల్ ఆరోపిస్తూ ప్రతిసారీ గైర్హాజరయ్యారు. 2021–22 ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ విధాన రూపకల్పన కాలంలో నిందితులు కేజ్రీవాల్‌తో చాలా సార్లు సంప్రతింపులు జరిపారని ఈడీ ఆరోపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనకుండా తనను అరెస్ట్ చేయడానికి ఈడీ కుట్ర పన్నిందని కేజ్రీవాల్ ఆరోపించడం తెల్సిందే.


రాష్ట్రపతి ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్న సభ్యులు


ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము

బలమైన దేశంగా ఎదిగాం!

బాలరాముడి ప్రాణప్రతిష్ట, ఆర్థిక సంస్కరణల్లో కీర్తిప్రతిష్ట

- పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటన
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం
- మోదీ సర్కారు సాధించిన ఘనతల ప్రస్తావన
- భవిష్యత్తు తరాల కోసం ఘనమైన వారసత్వాన్ని నిర్మించాలని పిలుపు
- యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు.. వికసిత్ భారత్‌కు నాలుగు మూలస్తంభాలు

న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిర నిర్మాణం అనే శతాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కృషితో బలమైన దేశంగా ఎదిగామని చెప్పారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట నిర్వహించుకున్నామని, మరోవైపు ఆర్థిక సంస్కరణల్లో కీర్తిప్రతిష్టలు సాధించామని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలు బుధవారం నూతన భవనంలో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము దాదాపు 75 నిమిషాలపాటు ప్రసంగించారు. పార్లమెంట్ కొత్త భవనంలో ఆమె ప్రసంగించడం ఇదే మొదటిసారి. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన ఘనతలను ప్రస్తావించారు. ఉగ్రవాదం, విస్తరణవాదానికి మన సైనిక దళాలు తగిన సమాధానం చెబుతున్నారని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో మన దేశం ప్రపంచంలో మొదటి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా అవతరించిందని గుర్తుచేశారు. భారత్ బలమైన దేశంగా మారిందన్నారు. ప్రతిష్టాత్మక జీ–20 సదస్సును కేంద్రం విజయవంతంగా నిర్వహించిందని, తద్వారా ప్రపంచంలో ఇండియా స్థానం మరింత బలోపేతమైందని వివరించారు. జమ్మూకశ్మీర్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ మొదటిసారి అంతర్జాతీయ సమావేశాలు జరిగినట్లు తెలియజేశారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ముర్ము ఇంకా ఏం మాట్లాడారంటే..

జనవరి 22 చిరస్మరణీయమైన రోజు

''రాబోయే శతాబ్దాలకు సంబంధించి దేశ భవిష్యత్తు స్క్రిప్ట్‌ను రాసుకోవాల్సిన సమయం వచ్చింది. మన పూర్వీకులు వేలాది సంవత్సరాల గొప్ప వారసత్వాన్ని మనకు వరంగా అందించారు. ప్రాచీన భారతదేశంలో అప్పటి మనుషులు సాధించిన విజయాలను ఇప్పటికీ సగర్వంగా గుర్తుచేసుకుంటున్నాం. రాబోయే కొన్ని శతాబ్దాలపాటు గుర్తుంచుకొనే ఘనమైన వారసత్వాన్ని ఇప్పటి తరం మనుషులు నిర్మించాలి. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో ఎన్నో ఘనతలు సాధించింది. దశాబ్దాల, శతాబ్దాల ఆకాంక్షలను నెరవేర్చింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ప్రజలు శతాబ్దాలపాటు ఎదురుచూశారు. అది ఇప్పుడు నెరవేరింది. ఆలయం ప్రారంభమైన తర్వాత కేవలం ఐదు రోజుల్లో 13 లక్షల మంది దర్శించుకున్నారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట జరిగిన జనవరి 22వ తేదీ నిజంగా చిరస్మరణీయమైన రోజు.

నక్సల్స్ హింసాకాండ తగ్గుముఖం

ఆర్టికల్ 370 రద్దుపై గతంలో ఎన్నో అనుమానాలు ఉండేవి. ఇప్పుడు ఆర్టికల్ 370 అనేది చరిత్రలో కలిసిపోయింది. ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకొచ్చింది. సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ భవిష్యత్తు నిర్మాణం కోసం మన శక్తిని గరిష్ట స్థాయిలో ఖర్చు చేసినప్పుడే దేశం ప్రగతి పథంలో వేగంగా ముందంజ వేస్తుంది. ప్రభుత్వం దేశ సరిహద్దుల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. సైనిక దళాలను బలోపేతం చేస్తోంది. అంతర్గత భద్రతకు సంబంధించిన ప్రభుత్వ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లో మార్కెట్లు, వీధులు గతంలో నిర్మానుష్యంగా కనిపించేవి. ఇప్పుడు జనంతో అవి కిక్కిరిసిపోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయి. ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాద ఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. శాంతియుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల సంఖ్య కూడా తగ్గిపోయింది. నక్సలైట్ల హింసాకాండ భారీగా తగ్గింది.

అదుపులోనే ద్రవ్యోల్బణం

'అభివృద్ధి చెందిన భారత్' అనే మహాసౌధం నాలుగు మూల స్తంభాలపై స్థిరంగా ఉంటుందని ప్రభుత్వం నమ్ముతోంది. అవి యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు. ఈ నాలుగు వర్గాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. 'గరీబీ హఠావో' నినాదాన్ని మనమంతా చిన్నప్పటి నుంచి వింటున్నాం. పేదరికాన్ని పారదోలడాన్ని మన జీవితాల్లో మొదటిసారి చూస్తున్నాం. ఇండియాలో గత పదేళ్లలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ ప్రకటించింది. దేశంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్ల మార్కును దాటడం హర్షణీయం. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు మన దేశ అభివృద్ధి ప్రయాణానికి బలాలుగా మారుతున్నాయి. ప్రతికూల పరిస్థితులు, ఒత్తిళ్లు ఎదురైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచింది. ప్రజలపై అదనపు భారం పడకుండా జాగ్రత్తవహించింది''.

మహిళలకు 15 వేల డ్రోన్లు

'2014 తర్వాత గత పదేళ్లుగా ద్రవ్యోల్బణ రేటు సగటున కేవలం 5 శాతం ఉంది. ప్రభుత్వ చర్యలతో ప్రజల చేతుల్లో డబ్బు ఆడుతోంది. సామాన్య ప్రజలు కూడా పొదుపు చేయగలుగుతున్నారు. మహిళలకు చేయూత ఇవ్వడానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. బ్యాంకు రుణాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సైనిక దళాల్లో శాశ్వత మహిళా కమిషన్‌ను మంజూరు చేసింది. సైనిక స్కూళ్లతోపాటు నేషనల్ డిఫెన్స్ అకాడమీలోనూ మహిళలకు ప్రవేశం కల్పిస్తోంది. ఎయిర్‌ఫోర్స్, నావికాదళంలోనూ మహిళలను ఆఫీసర్లుగా నియమిస్తోంది. అలాగే 2 కోట్ల మంది అక్కాచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద మహిళలకు 15 వేల డ్రోన్లు అందజేయాలని నిర్ణయించింది'.

మహిళల సారథ్యంలో దేశాభివృద్ధి

'మూడు దశాబ్దాల నిరీక్షణ తర్వాత నారీశక్తి వందన్ అధినియం(మహిళా రిజర్వేషన్ చట్టం) పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టంతో చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది. మహిళల సారథ్యంలో దేశాభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఈ చట్టాన్ని తీసుకొచ్చినందుకు పార్లమెంట్ సభ్యులకు నా అభినందనలు తెలియజేస్తున్నా. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతి తోడ్పాటునందిస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి. రెండు వరుస త్రైమాసికాల్లో వృద్ధి రేటు 7.5 శాతానికిపైగానే నమోదైంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తోంది'.

25 వేల కిలోమీటర్లకు పైగా రైల్వే లైన్లు

'రైల్వేశాఖ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో వినూత్న చర్యలు చేపట్టింది. నమో భారత్, అమృత్ భారత్, వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. కొత్తగా 25 వేల కిలోమీటర్లకుపైగా రైల్వే లైన్లు వేసింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న మొత్తం రైల్వే ట్రాక్ పొడవు కంటే ఇదే ఎక్కువ. రైల్వే శాఖలో 100 శాతం విద్యుదీకరణకు చాలా దగ్గరలో ఉన్నాం. దేశంలో తొలిసారిగా సెమీ–హైస్పీడ్ రైళ్లు ప్రారంభమయ్యాయి. 39 మార్గాల్లో వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 1,300 రైల్వేస్టేషన్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ప్రతి ప్రయాణికుడికి రైల్వేశాఖ 50 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రయాణికులకు ప్రతి ఏటా రూ.60 వేల కోట్ల సొమ్ము ఆదా అవుతోంది'.

నేడే బడ్జెట్

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల సమరశంఖం పూరించకముందే ఎన్నికల తాయిలాలతోపాటు సామాన్య ప్రజానీకం ఆశలను సాకారం చేస్తుందని అంతా భావిస్తున్న కేంద్ర మధ్యంతర బడ్జెట్ ఈరోజే పార్లమెంట్ ముందుకు రానుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉదయం 11 గంటల సమయంలో నూతన పార్లమెంట్ భవనంలోని లోక్‌సభలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ముందుగా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయానికి మంత్రి నిర్మల చేరుకుంటారు. బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆమె రాష్ట్రపతి భవన్‌కు వెళ్తారు. ఉదయం 9.30 నిమిషాలకు రాష్ట్రపతిని కలిసి బడ్జెట్ గురించి వివరించి ఆమె అనుమతిని తీసుకోనున్నారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు నూతన పార్లమెంట్ భవనానికి నిర్మల, ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల బృందం చేరుకుంటుంది. బడ్జెట్ సమర్పణకు ముందు ఉదయం పార్లమెంట్ ఆవరణలో కేంద్ర మంత్రిమండలి ఒకసారి భేటీకానుంది. ఈ భేటీలోనే మధ్యంతర బడ్జెట్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపుతుంది. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు మంత్రి లోక్‌సభలో అడుగుపెడతారు. బడ్జెట్ ప్రతులను చదివి ఆయా శాఖలకు నిధుల కేటాయింపులుసహా సమగ్ర బడ్జెట్ స్వరూపాన్ని ఆవిష్కరిస్తారు. లోక్‌సభలో ఆమె బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యాక ఆయా పద్దుల ప్రతులను రాజ్యసభలో సభ్యులకు అందజేస్తారు. నిర్మల ఇలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరసగా ఆరోసారి. గురువారం నాటి బడ్జెట్‌తో కలుపుకుని ఐదు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టినవారవుతారు. దీంతో గతంలో మాజీ ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ పేరిట ఉన్న రికార్డును నిర్మల సమంచేయనున్నారు. మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, చిదంబ రం, యశ్వంత్ సిన్హాలు ఐదు సార్లే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.


నిర్మలా సీతారామన్


బడ్జెట్ మెరుపులు ఉంటాయా ?

అద్భుత ప్రకటనలు ఆశించవద్దని విత్త మంత్రి విస్పష్టంగా చెప్పారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించే నూతన పథకాల అమలు బాధ్యత కొత్త ప్రభుత్వానిదే. అయినాసరే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మధ్యంతర బడ్జెట్‌లోనూ కొన్ని ఎన్నికల తాయిలాలు ప్రకటించే ధోరణి ఏనాడో మొదలైంది. 2004లో ఇదే ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో 50 శాతం డియర్‌నెస్ అలవెన్స్‌ను మూలవేతనంతో కలుపుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రణబ్ ముఖర్జీ, పీయుష్ గోయల్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడూ ఇలాంటి ప్రకటనలు వెలువడ్డాయి. అందుకే ఈసారీ బడ్జెట్ ఊరటలు ఉంటాయని జనం గట్టిగా నమ్ముతున్నారు. పెట్రోల్, డీజిల్‌పై సుంకం తగ్గించి ధరలు కాస్తంత కిందకు దించడం, పీఎం–ఆవాస్ యోజన తరహా కొత్త పథకం, విద్యుత్ వాహనాలకు రాయితీ పొడిగింపు వంటి 'ఆర్థిక సాయం' కోసం మధ్యతరగతి వర్గాలు ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. పన్ను శ్లాబులను సరళీకరిస్తే బాగుంటుందని ఆశిస్తున్నారు. ఆరోసారి పద్దుల చిట్టాతో పార్లమెంట్ గడప తొక్కుతున్న విత్తమంత్రి ఏమేరకు జనాలపై అద్భుత పథకాల పన్నీరు చల్లుతారో చూడాలి మరి.

మావోల బంకర్

తొలిసారిగా గుర్తించిన భద్రతా బలగాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు నిర్మించిన బంకర్‌ను భద్రతా బలగాలు గుర్తించారు. బస్తర్ డివిజన్‌లో మావోయిస్టులు బంకర్‌లను నిర్మించి వినియోగిస్తున్న విషయం బయటపడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. బస్తర్‌లో ఇలాంటివి ఉండొచ్చని భద్రతా బలగాలకు సమాచారం ఉందిగానీ ఇన్నాళ్లలో ఎన్నడూ ఒక్కదానిని కూడా గుర్తించలేకపోయారు. బీజాపూర్–దంతెవాడ జిల్లాల మధ్య ఇంద్రావతి నదీతీరంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరలను గుర్తించేందుకు జిల్లా రిజర్వ్ గార్డ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా బీజాపూర్ జిల్లాలోని తోడోపాట్–ఉస్పారీ గ్రామ సమీప అడవిలో మంగళవారం ఈ బంకర్‌ను భద్రతా బలగాలు గుర్తించాయని దంతేవాడ అదనపు ఎస్పీ బర్మన్ చెప్పారు. ఈ సొరంగం 130 మీటర్ల పొడవు, 6 అడుగుల లోతు, 3 అడుగుల వెడల్పుతో ఉంది. బంకర్ కనపడకుండా ప్రవేశమార్గాన్ని మట్టితో కూడిన కర్రలను కప్పి వాటిపైన చెట్ల పొదలను పరిచారు. మావోలు డంపింగ్ ప్రాంతంగానూ దీనిని వినియోగించినట్లు భద్రతాబలగాలు గుర్తించాయి. జనవరి 9న మావోయిస్టుల తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకున్నారు. మైదాన ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేస్తే డ్రోన్ల సాయంతో జాడ కనిపెట్టే అవకాశం ఉండటంతో ఇటీవలే ఈ బంకర్ నిర్మించి సమావేశం జరిపి ఉంటారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఇంద్రావతి నదిఒడ్డున ఏర్పాటు చేసిన ఈ బంకర్‌లో 100 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా దాక్కునేందుకు వీలుగా ఉంది. ఇలాంటి బంకర్‌లు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరిన్ని ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు, వాటిని గుర్తించేందుకు అడవుల్లో సోదాలు గాలింపు ముమ్మరం చేశారు. అబూజ్‌మడ్ అడవుల్లో ఇలాంటివి ఎన్ని బంకర్లు ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? అనే అంశాలపై భద్రతాదళాలకు కొత్త సవాల్‌గా మారినట్టయ్యింది. వచ్చే వేసవిలో విస్తృతంగా కూంబింగ్ చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్న భద్రతాదళాలకు కనిపించని బంకర్‌లతో మరిన్ని చిక్కులు వచ్చి పడే అవకాశముంది.


పోలీసులు గుర్తించిన బంకర్

గాలి, వెలుతురు సోకేలా ఏర్పాట్లు

బైరాంఘర్ పోలీస్‌స్టేషన్, భద్రతాదళాల బేస్ క్యాంప్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో ఈ బంకర్ ఉంది. బంకర్‌లోకి వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. గాలి, వెలుతురు సోకేలా ప్రతీ ఆరు మీటర్లకు ఒకటి చొప్పున ద్వారాలు ఏర్పాటు చేశారు. అయితే, ఇవి బయటకు కనిపించకుండా చెట్ల పొదలు అడ్డుపెట్టారు. మావో అగ్రనేతలు తలదాచుకునేందుకు ఉపయోగించుకోవడంతో పాటు మెరుపు దాడులకు వీలుగా దీనిని నిర్మించారని వార్తలొచ్చాయి. అయితే దీని నిర్మాణ వివరాలను భద్రతా బలగాలు ఇంకా అధికారికంగా బహిర్గతంచేయలేదు.

ఆత్మపరిశీలన చేసుకోండి

విపక్ష ఎంపీలకు ప్రధాని మోదీ హితవు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలిగించే విపక్ష ఎంపీలు ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ హితవు పలికారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు ప్రధాని బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రామ్ రామ్ అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. ''ప్రజాస్వామ్యంలో విమర్శ, ప్రతిపక్షం అనేవి చాలా అవసరం. అయితే నిర్మాణాత్మక ఆలోచనలతో సభను సుసంపన్నం చేసిన వారినే ప్రజలు గుర్తుంచుకుంటారు. అంతరాయం సృష్టించిన వారిని ఎవరూ గుర్తుంచుకోరు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగకుండా అనుక్షణం నిరసనలు, నినాదాలను సభా కార్యకలాపాలను స్తంభింపజేసిన ఆ విపక్ష పార్టీల సభ్యులు తమ ప్రవర్తనను ఆత్మపరిశీలన చేసుకోవాలి. వారు తమ పాత పంథాను విడనాడాలి. వాళ్లు తమ సొంత పార్లమెంట్ నియోజకవర్గాల్లో తిరిగినా పాత సెషన్‌లో వీరు చేసిన వీరంగాన్ని ఎవ్వరూ గుర్తుంచుకోరు' అని విపక్ష ఎంపీలను ప్రధాని తప్పుబట్టారు. ''సాధారణంగా ఎన్నికల సమయంలో పూర్తి బడ్జెట్‌ను సమర్పించరు. మేము అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తాం. ఈసారి మళ్లీ మేమే వస్తాం. కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేసి పూర్తి బడ్జెట్‌ను మీ ముందుకు తెస్తాం. ఈసారి ఆర్థిక మంత్రి కొన్ని మార్గదర్శక అంశాలతో మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించబోతున్నారు' అని మోదీ ప్రకటించారు. 'అభివృద్ధిలో దేశం అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తోంది. సమ్మిళిత, దేశ సర్వోతోముఖాభివృద్ధి ప్రయాణం ఆగదు'' అని వ్యాఖ్యానించారు.

రాహుల్ యాత్రలో అపశృతి

- రాహుల్ కారు అద్దం ధ్వంసం
- రాళ్లదాడే కారణమన్న అధీర్
- ఇదంతా డ్రామా అన్న మమత

మాల్దా: ఎన్‌డీఏ కూటమిని ఓడించేందుకు సార్వత్రిక సమరంలో కాంగ్రెస్‌తో కలిసి నడిచేది లేదని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించిన వేళ టీఎంసీతో కాంగ్రెస్ కస్సుబుస్సులు ఒక్కసారిగా బయటపడ్డాయి. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో రాహుల్ భారత్ జోడో న్యాయ్‌యాత్ర బిహార్ నుంచి పశ్చిమబెంగాల్‌లోకి మరోసారి అడుగుపెట్టిన సందర్భంగా రాహుల్ కారు అద్దం పగిలిన ఘటన జరిగింది. రాహుల్ ప్రయాణిస్తున్న కారుపై ఆగంతకులు రాళ్లదాడి చేయడంతో కారు వెనక అద్దం ధ్వంసమైందని పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ రంజన్ ఆరోపించారు. మాల్దా పరిధిలోని హరిశ్చంద్రపూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. కారు అద్దం పగిలిన ఘటనపై తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ స్పందించారు. '' పశ్చిమబెంగాల్‌లోకి అడుగుపెట్టకముందే కారు అద్దం పగిలింది. బిహార్‌లో ఘటన జరిగితే బెంగాల్‌లో ఆరోపణలు చేస్తున్నారు. ఇదంతా పెద్ద డ్రామా' అని మమత అన్నారు. రాహుల్ కారుపై దాడి ఘటనపై బీజేపీ సైతం పరోక్షంగా ఖండించింది.

జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో పూజలు చేసుకోండి

- పూజల బాధ్యత కాశీ విశ్వనాథ్ ట్రస్ట్‌దే
- జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించిన వారణాసి జిల్లా కోర్టు

వారణాసి: వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఆనుకుని ఉన్న వివాదాస్పద జ్ఞానవాపి మసీదు కేసు బుధవారం అత్యంత కీలక మలుపు తీసుకుంది. మసీదు ప్రాంగణంలో భారత పురావస్తు శాఖ చేసిన శాస్త్రీయ సర్వే నివేదిక ప్రకారం మసీదు కింద ఒకప్పుడు ఆలయం ఉండేదని బయటపడిన నేపథ్యంలో హిందువుల అనుకూలంగా వారణాసి కోర్టు నుంచి తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి. మసీదు సెల్లార్‌లోని హిందూ దేవతలను ఆరాధించేందుకు, పూజా కార్యక్రమాలు చేసుకునేందుకు ఒక పూజారికి అనుమతినిస్తూ వారణాసి జిల్లా కోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది. మసీదు ప్రాంగణంపై యాజమాన్య హక్కుల కేసులో పిటిషనర్ అయిన శైలేంద్ర కుమార్ పాఠక్‌కు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని ఆయన తరఫు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ చెప్పారు. '' ఏడు రోజుల్లోగా ఆ మసీదు సెల్లార్‌లో పూజకు అనువుగా ఏర్పాటు చేయాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను వారణాసి జిల్లా కోర్టు జడ్జి ఏకే విశ్వేశ ఆదేశించారని లాయర్ మదన్ వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కాశీ విశ్వనాథ్ ట్రస్టుకు ఈ పూజల బాధ్యతలు అప్పగించింది. పిటిషనర్ శైలేంద్ర తాత,పూజారి సోమ్‌నాథ్ వ్యాస్ గతంలో ఈ సెల్లార్‌లోనే 1993 డిసెంబర్‌దాకా పూజలు చేసేవారు. ఆ క్రమంలోనే ఇక్కడ పూజలు చేసుకునే హక్కులు తమకు దక్కుతాయంటూ ఆయన కోర్టు ఆశ్రయించారు. మసీదులో చిన్న కొలను వజూఖానా ముందున్న నంది విగ్రహం వద్ద బ్యారికేడ్లను తొలగించాలని, పూజలకు మార్గం సుగమం చేయాలని జడ్జి ఆదేశించారు.

తోషఖానా కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్‌ఖాన్‌కు కష్టాల మీద కష్టాలు వచ్చిపడుతున్నాయి. తోషఖానా కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీకి ఇస్లామాబాద్ కోర్టు 14 ఏళ్ల చొప్పున జైలుశిక్ష విధించింది. విదేశీ నాయకులు ఇచ్చిన ఖరీదైన బహుమతులను విక్రయించి, సొమ్ము చేసుకున్నట్లు ఇమ్రాన్ దంపతులపై అభియోగాలు నమోదయ్యాయి. దర్యాప్తులో అదంతా నిజమేనని తేలడంతో న్యాయస్థానం బుధవారం శిక్ష ఖరారు చేసింది. దోషులకు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. పదేళ్ల పాటు ఎన్నికల్లో పాల్గొనరాదంటూ కోర్టు ఇమ్రాన్ ఖాన్‌పై అనర్హత వేటు కూడా వేసింది. 1.5 బిలియన్ల జరిమానా చెల్లించాలని ఇమ్రాన్ దంపతులను ఆదేశించింది. ఫిబ్రవరి 8న పాకిస్తాన్ పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. విదేశాలకు అధికారిక పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి దేశాధినేతలు బహుమతులు ఇస్తుంటారు. అవన్నీ ప్రభుత్వానికే చెందుతాయి. తోషఖానాలో భద్రపర్చాల్సి ఉంటుంది. ఇమ్రాన్ మాత్రం సొంత ఆస్తిలాగా అమ్మేసుకున్నారు. అధికార రహస్యాల వెల్లడి కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు మూడు రోజుల క్రితం 10 సంవత్సరాల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024




కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ అస్మీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా ఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అద్నాన్ నయీమ్ అస్మీ కలెక్టర్ పి.రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం గ్రామానికే చెందిన కంచేటి నాగేశ్వరరావు తన తాతయ్య, నాయనమ్మల జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.10 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), వీవీ ప్యాట్స్ గోడౌన్ భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు చెప్పారు. బుధవారం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలోని ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోడౌన్ భద్రతకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆయన వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గోడౌన్ భద్రతకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లపై ఎన్నికలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్‌వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కె పరమేశ్వరరావు(ఆప్), ఎం. వినోద్‌కుమార్(బీఎస్పీ), యేదుపాటి రామయ్య(టీడీపీ), టి. శ్రీకుమార్(బీజేపీ), ఎ. నాగేంద్ర ప్రసాద్(ఐఎన్‌సీ) తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ఏఎస్పీగా వెంకటేశ్వరరావు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీగా జి. వెంకటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో క్రైమ్ విభాగం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారు. అలాగే ఇక్కడ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీహరిబాబును విజయవాడ సిటీ అడిషనల్ డీసీపీగా బదిలీ చేస్తూ ఉత్తుర్వులు జారీ చేశారు.

రైల్వేకు రూ.26.27 లక్షల ఆదాయం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు పర్యవేక్షణలో ఈ నెల 29, 30వ తేదీలలో డివిజన్ వ్యాప్తంగా మెగా టికెట్ చెకింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 135 మంది కమర్షియల్ విభాగం అధికారులు, సిబ్బంది డివిజన్ వ్యాప్తంగా 98 రైళ్లతో పాటుగా విజయవాడ స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. అందులో టికెట్ తనిఖీల ద్వారా 3,916 కేసులు నమోదు చేసి రూ. 26.27 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. రైళ్లలో అక్రమ లగేజీ తరలింపు, టికెట్ లేని ప్రయాణాలను అరికట్టేందుకు ఈ తనిఖీలు దోహదపడతాయని చెప్పారు.

ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో బదిలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఎస్వీ నాగేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయనను శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వల్లభనేని శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా డీఆర్వోగా నియమించారు.

తహసీల్దార్ మాధురికి ఉద్యోగోన్నతి..

విజయవాడనార్త్ తహసీల్దార్ ఎం. మాధురి డెప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమెకు రాజమహేంద్రవరం గెయిల్ పైపులైన్ ప్రాజెక్ట్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులుండవ్



పామర్రు: ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎవ్వరూ అధైర్య పడవద్దని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో తుపాను కారణంగా రంగు మారి దెబ్బతిన్న ధాన్యం కొనుగోలులో పడుతున్న ఇబ్బందులను రైతులు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు.

మిల్లుల్లో అమ్ముకునే అవకాశమివ్వండి..

అనంతరం స్థానిక శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ తుపాను సమయంలో అమ్మకాలు చేసిన ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న సన్న కారు రైతులు తమ గ్రామ పరిధిలో ఉన్న రైస్‌మిల్లుల్లోనే అమ్ముకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

సపోర్టుతో శరవేగం

చకచకా బందరు భాగ్యరేఖ నిర్మాణ పనులు

- ఇప్పటికే రూ.600 కోట్ల మేర పోర్టు పనులు పూర్తి
- ముగిసిన నార్త్ బ్రేక్ వాటర్ పనులు
- 1,650 మీటర్ల మేర పూర్తయిన సౌత్ వాటర్ బ్రేక్ పనులు
- రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తి
- కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణం



మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతంలో రోడ్డు కోసం సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



మచిలీపట్నం పోర్టుకు వెళ్లే రహదారి పనులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రభుత్వం ఇస్తున్న సపోర్టుతో పోర్టు నిర్మాణ పనులు జెడ్ స్పీడ్‌లో సాగుతున్నాయి. నిర్దేశిత లక్ష్యాల మేరకు పరుగులు పెడుతున్నాయి. నిర్ణీత కాలవ్యవధిలోపే ఈ పనులు పూర్తిచేసి పోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా కాంట్రాక్టు సంస్థ రాత్రింపగళ్లు నిరంతరాయంగా పనులు నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ పనులను నేరుగా సమీక్షిస్తున్నారు. దీంతో పాటు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, స్థానిక శాసనసభ్యుడు పేర్ని నాని, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి, అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు కలిసి క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించి పనుల వేగం పెరిగేలా చర్యలు తీసుకొంటున్నారు.

పోర్టు స్టేటస్ రిపోర్టు ఇది..

పోర్టు నిర్మాణానికి సంబంధించి సరిహద్దులు గుర్తించి మార్కింగ్ చేశారు. బీచ్ రోడ్డు నుంచి బ్రేక్ వాటర్ వరకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టారు. శాశ్వత రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే పూర్తికావడంతో రెండు కిలోమీటర్ల మేర శాశ్వత రోడ్డు సైతం నిర్మించారు. లేబర్ క్యాంపులు, ఆఫీసులు, అకడమిక్ బ్లాక్‌లు, వేయింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ల్యాబ్ నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. బెర్తు నిర్మాణం కోసం నేల గట్టితనాన్ని పరిశీలించి, నేలను పటిష్టం చేస్తున్నారు. అక్కడ పెద్ద స్థాయిలో బొగ్గు, ఇనుము నిల్వ చేస్తారు కాబట్టి ఆ బరువును తట్టుకొనే విధంగా నేలను గట్టి పరుస్తున్నారు. మొత్తం మీద ఇప్పటి వరకు దాదాపు రూ. 600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా...

మొదటి దశలో కార్గో రవాణా
కెపాసిటీ: 35.12 మిలియన్ టన్నులు
ప్రాజెక్టు విలువ: రూ.5,153.73కోట్లు
బెర్తుల సంఖ్య : 4(3–జనరల్‌కార్గో, 1–కోల్)
డ్రెడ్జింగ్: (–16.40)ఎంసీడీ
షిప్‌లు :80,000 డీడబ్ల్యూటీ
భూసేకరణ: 1,922 హెక్టార్లు
పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతం: 1688.82 హెక్టార్లు
రోడ్డు కనెక్టివిటీ కోసం: 234.15 హెక్టార్లు



మచిలీపట్నం పోర్టు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు

పనుల సరళి ఇలా...

- సౌత్ బ్రేక్ వాటర్‌కు సంబంధించి 2,075 మీటర్ల పనులు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,650 మీటర్ల పనులు చేశారు. అంటే 10.10లక్షల టన్నుల కొండరాళ్లను పరిచారు.
- నార్త్ బ్రేక్ వాటర్‌కు సంబంధించి 250మీటర్ల మేర పనులు జరగాల్సిండగా ఇప్పటికే ఆ మేర పనులు పూర్తయ్యాయి. ఇక్కడ 54,254 మెట్రిక్ టన్నుల రాళ్లను పరిచారు.
- సముద్రం ఒడ్డున డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించి, 10లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు చేశారు.
- బెర్తులు, ఫెర్టిలైజర్ యార్డు, అడ్మిన్ బిల్డింగ్, కోల్‌యార్డు, గోడౌన్ నిర్మాణం జరిగే ప్రాంతంలో 5మీటర్ల మేర ఎత్తును లేపాల్సి ఉండగా, ఇప్పటికే 9లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ఫిల్లింగ్ చేశారు.
- ఈ నిర్మాణాలు జరిగే ప్రాంతంలో భూమి కుంగిపోకుండా 21 లక్షల మీటర్ల మేర పీవీడీ (ప్రీ ఫ్యాబ్రికేటెడ్ వర్టికల్ డ్రెయిన్స్) రన్నింగ్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా 101 ఎకరాల్లో డ్రెయిన్స్‌కు గాను 96 ఎకరాల్లో పిల్లర్లను వేశారు.
- ప్రహరీకి సంబంధించి ఇప్పటికే 900 పిల్లర్లను వేశారు.
- కస్టమ్స్ బిల్డింగ్, పోర్టు ఆపరేషన్ భవనాలు, ఫైర్ స్టేషన్ సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతాన్ని చదును చేసే ప్రక్రియ పూర్తయ్యింది. అప్రోచ్ చానల్, రోడ్డు, రైలు కనెక్టివిటీ పనులు సాగుతున్నాయి. పోర్టు కనెక్టివిటీకి సంబంధించి 6.4 కిలోమీటర్ల శాశ్వత రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాల్సింది. దీనికి సంబంధించి భూసేకరణ పూర్తి చేశారు. రైతులకు సంబంధించి పరిహారం సొమ్మును చెల్లిస్తున్నారు. దీంతో ఇప్పటికే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు.

పనుల వేగం పెంచాం..

పోర్టు నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతం చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనులు ప్రారంభించిన వెంటనే పనులు ఊపందుకున్నాయి. ప్రాజెక్టు పనులకు సంబంధించి ఎలాంటి అటంకాలు లేకుండా అనుమతులు వచ్చాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు సాగే విధంగా, పోర్టు అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమీక్షిస్తున్నాం.

– పి. రాజాబాబు, కలెక్టర్ కృష్ణా జిల్లా

ఆడుదాం ఆంధ్రాతో క్రీడా పండుగ

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడస్పోర్ట్స్: ప్రజల ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడలు దోహదపడుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో కలెక్టర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో క్రీడా సంస్కృతిని పెంపొందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ క్రీడా సంబరాలను రూపొందించారన్నారు. డిసెంబర్ 26న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో ప్రారంభమైన ఈ పోటీలు మండల, నియోజకవర్గ స్థాయిలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయికి చేరుకున్నాయన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఫిబ్రవరి 6 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. క్రీడాకారులకు రవాణా, భోజన, వసతి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.

పెరిగిన మహిళల ప్రాతినిధ్యం..

జేసీ, ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో జరిగే 69 మ్యాచ్‌లలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఆనందించదగ్గ విషయమన్నారు. తొలుత కలెక్టర్ ఢిల్లీరావు క్రికెట్ ఆడి ఈ పోటీలను ప్రారంభించారు. విజయవాడ పశ్చిమ, సెంట్రల్, ఈస్ట్, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ కలెక్టర్, కార్పొరేటర్ అనిత పాల్గొన్నారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం



ధూపం వేస్తున్న బిషప్ తెలగతోటి రాజారావు

- గుణదల పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాలకు అంకురార్పణ
- గురువుల జ్ఞాపకార్థం స్మృతివనం ఏర్పాటు



మేరీమాత ప్రతిరూపంతో ఊరేగింపుగా వస్తున్న బిషప్ రాజారావు



మేరీమాత జెండా ఆవిష్కరణ

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడలోని క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఉత్సవాల నవదిన ప్రార్థనలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వందలాది మంది మఠకన్యలు, భక్తుల సమక్షంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మేరీమాత పతాకాన్ని ఆవిష్కరించి నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ మరియతల్లిని ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యమాతగా, లోకమాతగా కొనియడుతున్నారన్నారు. సర్వమానవులను రక్షించేందుకు లోక రక్షకుడైన క్రీస్తు ఆమె గర్భం నుంచి వచ్చారన్నారు.

9 నుంచి శతాబ్ది ఉత్సవాలు..

ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో ఉత్సవాలు జరుగనున్నాయని ప్రకటించారు. పుణ్యక్షేత్ర గురువులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. పుణ్యక్షేత్రాన్ని స్థాపించి నూరు వసంతాలు పూర్తయిన నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మరియమాత జెండాను ఆవిష్కరించి ఉత్సవాల నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ సునీల్ రాజు, లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిశోర్ పాల్గొన్నారు.

స్మృతివనం ప్రారంభం..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రాన్ని స్థాపించి అభివృద్ధి పరిచిన పూర్వ గురువుల జ్ఞాపకార్థం ప్రధానాలయం వెనుక స్మృతివనం ఏర్పాటు చేశారు. ఫాదర్ అర్లాటి, ఫాదర్ బియాంకి, అబ్రోస్ డి. బతిస్తా, డోమ్నిక్ గ్రాసీ వంటి గురువుల విగ్రహాలను బిషప్ రాజారావు ప్రారంభించారు.

మరియమాతను ఆశ్రయిస్తే శాంతి..

మరియమాతను ఆశ్రయించిన వారి జీవితాలలో శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయని వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు అన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనల మొదటి రోజు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మరియమాత నిష్కళంక మాతగా భక్తుల నీరాజనాలు అందుకుంటోందన్నారు. ఆమె పవిత్రతకు మెచ్చి దేవాది దేవుడే కుమారునిగా మరియతల్లి గర్భవాసాన జన్మించారన్నారు. అనంతరం భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు మఠకన్యలు, పలు విచారణల భక్తులు కొవ్వొత్తులు చేతబట్టి కొండ పైకి చేరుకున్నారు. మరియ తల్లిని కీర్తిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఉత్సవానికి వేళాయె

- నేడు రంగుల సంబరానికి తరలనున్న తిరుపతమ్మ
- పక్కా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



ముస్తాబైన దేవతామూర్తులు విడిది చేసే గ్రామంలోని రంగుల మండపం

పెనుగంచిప్రోలు: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే తిరుపతమ్మవారి రంగుల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 5.54 గంటలకు ఆలయం నుంచి గోపయ్య సమేత తిరుపతమ్మ వారితో పాటు సహదేవతలను బయటకు తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయం నుంచి విగ్రహాలను బయటకు తీసేముందు అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఆలయ అర్చకులు పాపమాంబ వంశీకులు అమ్మవారికి బోనం చెల్లిస్తారు. శాలివాహనులు కుండలో కుంభం(అన్నం) వండుకొని వస్తే రజకులు దానిని దిష్టి తీసేందుకు వినియోగిస్తారు. అనంతరం రజకులు విగ్రహాలను నెత్తిన పెట్టుకొని గ్రామంలో ఉత్సవంగా డప్పుల మోతలు, మంగళ వాయిద్యాలు, పలు రకాల నృత్యాల నడుమ గ్రామంలోని రంగుల మండపం వద్దకు చేరుస్తారు. మధ్యాహ్నం తర్వాత లాటరీ ద్వారా ఎంపిక చేసిన 11 ఎడ్లబండ్లపై 11 విగ్రహాలను మక్కపేట, చిల్లకల్లు మీదుగా జగ్గయ్యపేటలోని రంగుబజారులోని రంగుల మండపానికి ఫిబ్రవరి 2 ఉదయానికి చేరుస్తారు. ఎడ్ల బండ్ల వెంట వచ్చేవారికి భోజన ఏర్పాట్లు ఆలయం వారు చేస్తున్నారు.




అందరూ సహకరించాలి..


అమ్మవారి రంగుల మహోత్సవానికి అందరూ సహకరించాలని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె. రమేష్‌నాయుడు బుధవారం కోరారు. గురువారం ఉదయం 5గంటల నుంచి ఆలయంలో వైదిక పరమైన పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 5.54 గంటలకు దేవతామూర్తులను గర్భాలయం నుంచి బయటకు తీసుకువస్తారన్నారు. మధ్యాహ్నానికి గ్రామంలోని రంగుల మండపం వద్దకు విగ్రహాలను చేర్చుతామన్నారు. రాత్రికి తంబరేణి గార్డెన్స్ లేదా రైల్వే ట్రాక్ వద్ద బండ్ల వెంట వచ్చిన భక్తులకు, పనివారికి, ఎడ్లబండ్ల యజమానులకు భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు విగ్రహాలు వత్సవాయి మండలం మక్కపేట చేరుతాయన్నారు. అక్కడి నుంచి చిల్లకల్లు మీదుగా ఫిబ్రవరి 2 ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేటలోని రంగుల మండపానికి వస్తాయన్నారు. ఉత్సవం సందర్భంగా విగ్రహాల ముందు బేతాళ వేషాలు, కోలాట నృత్యాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలపారు. ఎడ్లబండ్ల యజమానులు కరెంట్ తీగలు, లైట్లు విద్యుత్ శాఖ అధికారులు సూచించిన విధంగా ఉండాలన్నారు. బండ్లు వెంట అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ కొత్త ఇన్‌చార్జుల నియామకం

- బందరు పార్లమెంట్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు డాక్టర్ చంద్రశేఖర్‌కు



డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్



ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సింహాద్రి రమేష్‌ను మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ప్రకటించారు.

కేన్సర్ వైద్యుడిగా మంచి గుర్తింపు..

దేశంలోనే ప్రముఖ కేన్సర్ వైద్యుడిగా చంద్రశేఖర్‌కు పేరుంది. దివంగత మంత్రి, దేవుడు మంత్రిగా గుర్తింపు పొందిన సింహాద్రి సత్యనారాయణరావు కుమారుడే చంద్రశేఖర్. గత రెండు ఎన్నికల్లో ఆయనను రాజకీయాల్లోకి తీసుకొచ్చేందుకు ప్రముఖ పార్టీలు ప్రయత్నించినప్పటికీ సుముఖత చూపలేదు. హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ దివిసీమతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన వారు ఎవరు చికిత్స కోసం వెళ్లినా వారిని ఎంతో ఆప్యాయంగా పలకరించడంతో పాటు చికిత్స అందించి బాగు చేయడంలో ఆయనకు ఎంతో పేరుంది. ఆయన తండ్రి సింహాద్రి సత్యనారాయణరావు 1985 నుంచి 1999 మధ్య మూడు పర్యాయాలు వరుసగా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి గెలుపొంది దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీగా పనిచేసిన మంత్రిగా సింహాద్రి సత్యనారాయణరావుకి ఎంతో పేరుంది. ఆయన రాజకీయ వారసత్వంగా సింహాద్రి చంద్రశేఖర్ రాజకీయాల్లోకి రావడం పట్ల దివిసీమ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మచిలీపట్నంకు రమేష్‌బాబు..

అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబుని మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్తగా ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు దివిసీమలో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో 20,725 రికార్డు స్థాయి మెజారిటీతో సింహాద్రి రమేష్‌బాబు విజయం సాధించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి గ్రామాల్లో తిరుగుతూ ప్రజలతో మమేకవుతూ ఏ సమస్య ఎదురైనా ముందున్నారు. వరదలు, తుపానులు విపత్తులతో పాటు కరోనా సమయంలో అవనిగడ్డలో కోవిడ్ సెంటర్ ఏర్పాటు చేయించి ఆక్సిజన్ కొరత రాకుండా చూశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో 22ఏ నిషేధిత భూముల కింద ఉన్న 16వేల ఎకరాలకు విముక్తి కలిగించడంతో రమేష్‌బాబు ఎంతో కృషి చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కృష్ణాజిల్లాలో ముందుగా పూర్తి చేయడం ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

సబ్ కలెక్టర్‌గా అదితి సింగ్ సేవలు భేష్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అదితిసింగ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సబ్ కలెక్టర్‌గా అదితి సింగ్ అందించిన సేవలు అభినందనీయమని, ఆమె అత్యంత సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పేర్కొన్నారు. విజయవాడ సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన అదితి సింగ్ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ కె. సునీత, వివిధ శాఖల అధికారులు అదితి సింగ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అదితి సింగ్ భర్త ఐఏఎస్ అధికారి ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. నిబద్ధతతో, క్రమశిక్షణతో అదితి సింగ్ సేవలు అందించి, తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, భూ సేకరణ, ఈసీఐ సదస్సులు వంటి వాటితో పాటు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు విజయవంతం కావడంలో ఆమె కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ కిందిస్థాయి సిబ్బందికి సరైన మార్గ నిర్దేశనం చేస్తూ, మంచి ఫలితాలు వచ్చేలా పనితీరు కనబరిచారన్నారు. భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. విజయవాడ ఇన్‌చార్జి ఆర్డీఓ జి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్కంఠంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



గుడ్లవల్లేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా బుధవారం గుడ్లవల్లేరు ఏఏఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన 200 మంది క్రీడాకారులు తలపడి క్రీడా స్ఫూర్తిని నింపారు. బాలికల పోటీల్లో గుడ్లవల్లేరు ప్రథమం, పెనమలూరు ద్వితీయం, పామర్రు తృతీయ స్థానాల్లో నిలిచి విజయకేతనం ఎగురవేశారు. బాలుర పోటీలకు సంబంధించి గురువారం ఫలితాలను ప్రకటించనున్నామని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఝాన్సీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.కరుణకుమార్, ఎస్.రాజశేఖర్, మెంటార్ రామాంజనేయులు, కార్యదర్శి నరసింహారావు, పీడీలు శివశంకర్, భిక్షపతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

గన్నవరం: చోరీ కేసులో నిందితుడికి రెండు నెలలు జైలుశిక్ష విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ న్యాయస్థానం బుధవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు...మండలంలోని అజ్జంపూడి గ్రామంలో ఉన్న ఓల్డ్ క్లాసిక్ ఫ్యాక్టరీలో గతేడాది డిసెంబర్ 12న చోరీ జరిగింది. ఈ ఘటనపై ట్రైనీ డీఎస్పీ శ్రీవేద కేసు నమోదు చేసి నిందితులైన కాకినాడ జిల్లా లంబర్తి మండలం మన్నెందొర సీతారామపురం గ్రామానికి చెందిన చెన్నాడా వినోద్‌కుమార్‌ను అరెస్ట్ చేసి గత నెల 29న కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో రెండు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ 12వ ఏఎంఎం జడ్జి తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న తెలిపారు.

పక్కాగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ

- రబీ సీజన్‌కు చురుగ్గా సాగుతున్న వైనం
- సాగుకు చేయూత అందించటంలో దోహదం
- విపత్తుల వేళ అన్నదాతలకు భరోసా
- అన్నింటికీ ఈ-క్రాప్ ఒక్కటే మార్గం
- కృష్ణా జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో చురుగ్గా నమోదు



పునాదిపాడు ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ

కంకిపాడు: ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా సాగుతోంది. రైతులు సాగు చేసే పంటల వివరాల నమోదుతో సాగుకు అవసరమైన చేయూత ప్రభుత్వం అందిస్తోంది. పంట చేతికొచ్చిన తరువాత కొనుగోలు విషయంలోనూ, విపత్తుల వేళ అన్నదాతలకు నష్టం వాటిల్లితే సాయం అందించటంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది. ఇందుకు ఈ క్రాప్ నమోదు దోహదపడుతోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ఎంతో సమర్థంగా సాగుతోంది. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో 1,60,901 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉంది. వరి, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, తదితర పంటలు జిల్లాలో సాగవుతున్నాయి. ఆయా ప్రాంతాలకు అనువైన విత్తన రకాలను రైతులు ఎంపిక చేసుకుని సాగు చేస్తున్నారు. ఇప్పటికే 1,07,062 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు జరిగాయి.

1,52,118 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు.....

కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో ఇప్పటికే 1,52,118 ఎకరాల్లో సాగైన పంటలకు సంబంధించిన ఈ క్రాప్ నమోదు పూర్తయింది. రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త భాగస్వామ్యంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పంటల నమోదు సజావుగా సాగిపోతుంది. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న సాగు, రైతులు, కౌలురైతుల వివరాలపై స్పష్టత కూడా ఏర్పడుతుంది. సాధారణ సాగు, పంట సాగు, ఏ పంట సాగు జరిగింది? వంటి వివరాలను ఆర్‌బీకే స్థాయిలో అధికారులు పూర్తి చేసుకున్నారు. ఈ క్రాప్ నమోదు ఆధారంగానే సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏ మేరకు అవసరం ఉందో స్పష్టమవుతుంది. పంటల సాగు, విస్తీర్ణం, దిగుబడి అంచనా, పంట కొనుగోళ్లకు బడ్జెట్, లక్ష్యాల నిర్దేశానికి ఈ క్రాప్ దోహదపడుతుంది. పంట చేతికొచ్చాక సేకరణ చేసే క్రమంలో అవరోధాలు అధిగమించొచ్చు. అంతే కాకుండా సాగుకు అవసరమైన భరోసా, భద్రత కల్పించటంలోనూ ఈ క్రాప్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. సాగుదారులు, రైతుల వివరాల నమోదు తోనే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా రైతులకు దక్కుతుంది. దీంతో పాటుగా ప్రకృతి విపత్తుల వేళ పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించే విషయంలోనూ ఈ క్రాప్ డేటా సమర్థంగా ఉపయోగపడుతోంది. సామాజిక తనిఖీ నిర్వహణ, లబ్ధిదారుల జాబితా తయారీ అంశాల్లోనూ ఉపకరిస్తోంది. ఇంతటి ప్రాధాన్యత నెలకొనటంతో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను జిల్లా అధికారుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. లక్ష్యానికి అనుగుణంగా ఈ క్రాప్ పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

ఈ క్రాప్ నమోదు జిల్లాలో ఎంతో సమర్థంగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పంటల కొనుగోళ్లు, విపత్తుల సమయంలో నష్టపరిహారం అందజేతకు ఈ క్రాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఆర్‌బీకేల పరిధిలో ఉన్న వీఏఏల ద్వారా పంటలను నమోదు చేయించుకోవాలి. పంట సేకరణలో తలెత్తే ఇబ్బందులను అధిగమించుకోవచ్చు.
ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి

నేటి నుంచి సాంస్కృతిక సమ్మేళనం



మాట్లాడుతున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ, వేదికపై భాస్కర శర్మ, బృంద సభ్యుడు సాయి తదితరులు

విజయవాడ కల్చరల్: అఖిల భారత సంస్కార భారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నాలుగురోజులపాలు బెంగళూరులోని రవిశంకర్ గురూజీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యలయంలో కళా సాధక సంగమం 2024 పేరుతో సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తునట్లు సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ తెలిపారు. అయోధ్యనగర్‌లోని సంస్కార భారతి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లలిత కళల ద్వారా యువతోని ప్రతిభను గుర్తించి వారిని ఉన్నతమైన విద్యావంతులుగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తునట్లు తెలిపారు. సంస్కారభారతి ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రారంభ కార్యక్రమంలో మైసూర్ మహారాజా యదువీర వడయార్, శ్రీ కృష్ణదేవరాయలు వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు, 4 వ తేదీ జరిగే ముగింపు కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ పాల్గొంటారని తెలిపారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతులకు అద్దంపట్టేలా ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. సంస్కార భారతి కుటుంబానికి చెందిన సంగీత కళాకారులు, నాటక కళాకారులు, నృత్య కళాకారులు 52 మంది ప్రదర్శనలో పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో సంస్కార భారతి నగర అధ్యక్షుడు పి. భాస్కర శర్మ, ప్రదర్శనలో పాల్గొనే బృంద సభ్యులు సాయి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో కుదువ పెట్టిన బంగారంతో వడ్డాణం

గంగూరు బ్యాంకు మేనేజరుపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరు యూనియన్ బ్యాంకు శాఖ మేనేజరుగా పనిచేస్తున్న దావులూరి ప్రభావతిపై పెనమలూరు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ... గంగూరు శాఖ మేనేజరుగా పనిచేస్తున్న ప్రభావతికి భర్తతో విబేధాలున్నాయి. ఆమె స్వగ్రామం నూజివీడు మండలం మర్రిబంధం గ్రామం. కాగా అదే గ్రామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావుకు హైదరాబాద్‌లో ఉన్న బ్యాంకు ఖాతాను ప్రభావతి గంగూరు శాఖకు ట్రాన్స్‌ఫర్ చేయించింది. ఈ సందర్భంగా యోగేశ్వరరావు తన వద్ద ఉన్న 380 గ్రాముల బంగారం కోసం లాకరు అడిగాడు. ప్రభావతి లాకరులో బంగారం దాయటం కన్నా బ్యాంకు రుణం తీసుకోమని ఆయనకు సూచించింది. దీంతో యోగేశ్వరరావు రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణాన్ని ఆయన గతేడాది నవంబరులో చెల్లించాడు. అనంతరం బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు గురించి అడగ్గా ఆ నగలు తన వద్దనే ఉన్నాయని ప్రభావతి తెలిపింది. ఈ విషయమై గంగూరులోని తన ఇంటికి వచ్చి మాట్లాడమని కోరింది. యోగేశ్వరరావు ఆమె ఇంటికి వెళ్లి బంగారు ఆభరణాలు విషయమై ప్రశ్నించగా తనంటే ఇష్టమని, పెళ్లి చేసుకోమని కోరింది. బంగారు ఆభరణాలతో వడ్డాణం చేయిస్తున్నానని చెప్పింది. ఒక్కసారిగా యోగేశ్వరరావు షాక్ తిన్నాడు. ఈ ఘటనపై యోగేశ్వరరావు పోలీసులను ఆశ్రయించాడు. తన ప్రమేయం లేకుండా తన సంతకాన్ని ప్రభావతి ఫోర్జరీ చేసి ఆభరణాలు కాజేసిందని పేర్కొన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నామినేషన్ల స్వీకరణ వరకు ఓటర్ల నమోదు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నామినేషన్ల స్వీకరణ వరకు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అర్హత ఉండి, ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి నమోదు చేయించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆయన కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 1,781 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి సీనియర్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించామని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బీఎల్వోలు ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి డూప్లికేట్, రిపీట్, డెత్, శాశ్వత వలస ఓటర్లను గుర్తించి ఎన్నికల మార్గదర్శకాల మేరకు తొలగించేల చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్థాయిలో ఏఈఆర్, బీఎల్వో, డెప్యూటీ తహసీల్దార్ సభ్యులుగా మండల్ టీం ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్ల జాబితా పరిశీలించి దోష రహిత జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులతో కిటకిటలాడిన 'సౌత్ జోన్ సైన్స్ ఫెయిర్'



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ సమీపంలోని మురళి రిసార్ట్‌లో బుధవారం ప్రారంభమైన సౌత్ జోన్ సైన్స్ ఫెయిర్ విద్యార్థులతో కిటకిటలాడింది. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఈ సైన్స్ ఫెయిర్ ఏర్పాటు జరిగింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూపొందించిన 210 ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు జిల్లాల నుంచి దాదాపు ఐదు వేల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సైన్స్‌ఫెయిర్‌ను వీక్షించినట్లు కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ఆర్.భాగ్యశ్రీ తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఈ ఫెయిర్ ముగుస్తుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

మద్యం, గంజాయి స్వాధీనం



రైలులో గంజాయి తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



రైలులో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఉత్తర్వుల మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు రైలులో మద్యం, బంగారం, గంజాయి, డబ్బు అక్రమ రవాణాపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వే స్టేషన్, రైళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాం నెంబర్ 8లో ఒరిస్సాకు చెందిన రంజాన్ ముని అనే వ్యక్తి బ్యాగును సోదా చేయగా అందులో 10 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు. అదే విధంగా ప్లాట్‌ఫాం నెంబర్ 6లో తిరుక్కురల్ ఎక్స్‌ప్రెస్ (12642)లోని బీ-3 కోచ్‌లో 63, 72 బెర్త్‌ల కింద ఆరు లగేజీ బ్యాగులను గుర్తించి వాటి గురించి ప్రయాణికులను విచారించగా వాటికి సంబంధించిన వారు లేరని తెలిపారు. దీంతో బ్యాగులను తెరచి చుడగా అందులో 285 మద్యం బాటిల్స్ లభ్యమయ్యాయి. వాటి విలువ సుమారు రూ. 2,56,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో జీఆర్‌పీ ఎస్సై ఖాదర్ హుసేన్, ఆర్‌పీఎఫ్ ఎస్సై మక్కతలాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

15 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం జరిగిన జాబ్‌మేళాలో 15 మంది విభిన్న ప్రతిభావంతులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామని ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి 52 మంది ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారని తెలిపారు. వారికి వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక లు నిర్వహించారన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధి కారి ఎం.రామ్మోహన్, యంగ్ ప్రొఫెషన్ ఎస్.జయరాజు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ జిల్లా సిబ్బంది నాగ స్వర్ణ, సులోచన జాబ్‌మేళాను పర్యవేక్షించారు.

పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడీసీపీలు బదిలీ



లాఅండ్ఆర్డర్ ఏడీసీపీ లక్ష్మీపతి



టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ జి.వి.రమణమూర్తి



హోంగార్డ్స్ కమాండెంట్ కె.వి.ప్రేమ్‌జిత్



సీఏఆర్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న నలుగురు ఏడీసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లా అండ్ ఆర్డర్-2 ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతిని పల్నాడు జిల్లా క్రైమ్ ఏఎస్పీగా, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ జీవీ రమణమూర్తిని గుంటూరు జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా, హోం గార్డ్స్ (ఏఆర్) కమాండెంట్ కేవీ ప్రేమ్‌జిత్‌ను విశాఖపట్నం హోం గార్డ్స్ (ఏఆర్) కమాండెంట్‌కు, సీఏఆర్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావును ఇంటెలిజెన్స్ ఏఎస్పీ (ఏఆర్)గా బదిలీ చేశారు. వీరి స్థానంలో జిల్లా లా అండ్ ఆర్డర్-2 ఏడీసీపీగా డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న టి.కనకరాజును, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా కృష్ణా జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా పని చేస్తున్న ఆర్.శ్రీహరిబాబును, సీఏఆర్ ఏడీసీపీగా గుంటూరు జిల్లా ఏఆర్ ఏఎస్పీగా పని చేస్తున్న కె.కోటేశ్వరరావును, హోం గార్డ్స్ (ఏఆర్)కమాండెంట్‌గా విశాఖపట్నం హోం గార్డ్స్ కమాడెంట్ యు.రామ్మోహనరావును నియమించినట్లు ఉత్తర్వుల్లో హోం శాఖ పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు...పెనమలూరుకు చెందిన ఆరేపల్లి గురుప్రసాద్ (20) బైక్‌పై ఉప్పలూరు నుంచి కంకిపాడు వైపు వస్తుండగా వంతెన దాటగానే బైక్ అదుపుతప్పి కిందపడటంతో వెనుకగా వచ్చిన టిప్పరు గురుప్రసాద్ మీదుగా వెళ్లింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో రూ. 13.95 లక్షల నగదు పట్టివేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.13.95 లక్షల నగదు పట్టుబడింది. సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న ఈ నగదును పట్టుకున్నారు. ఏలూరు వైపు నుంచి విజయవాడకు ఇన్నోవా కారులో వెళుతున్న రాయుడు వెంకన్నబాబు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.13.95 లక్షల సొమ్మును తరలిస్తుండటంతో పోలీసులకు చిక్కాడు. ఈ నగదును సీజ్ చేయటంతో పాటుగా, అతనిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ నరసింహమూర్తి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు.

అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో అర్హత ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం జిల్లాస్థాయి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావుతో కలిసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరుపై చర్చించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, విజయవాడ వారి కార్యాలయం నుంచి ప్రాథమిక వెరిఫికేషన్ జరిగి జిల్లాకు 1,277 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తులను ఆయా మండలాల తహసీల్దార్లకు పంపించి పరిశీలిస్తామని వివరించారు. స్థలాలను త్వరితగతిన గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులు ఒ.వెంకటరామిరెడ్డి, తిరుమలరావు, పి.ఫణీంద్రరెడ్డి, డీపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి పాల్గొన్నారు.

నేటి నుంచి కోర్బివాక్స్ వ్యాక్సిన్

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడ తూర్పు): జిల్లాలో నేటి నుంచి కోవిడ్ బూస్టర్ డోస్ కోర్బివాక్స్ వ్యాక్సిన్ వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత పర్యవేక్షణలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నుంచి మార్చి 20 వరకూ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వయస్సు 18 సంవత్సరాలు నిండి, గతంలో రెండు డోసులు కోవీషీల్డ్, కోవాక్సిన్ తీసుకున్న వారు ఈ వ్యాక్సిన్‌ను బూస్టర్ మోతాదుగా పొందవచ్చునని తెలిపారు. అంతేకాక వయస్సు 12 ఏళ్ల వారు గతంలో వ్యాక్సిన్ తీసుకోని వారు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చన్నారు. ముఖ్యంగా హజ్ యాత్రికులు, విదేశాలకు వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 21,300 డోసులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

31 మంది తహసీల్దార్ల బదిలీలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో 31 మంది తహసీల్దార్లను ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు బదిలీ చేస్తూ భూపరిపాలనాశాఖ కమిషనర్ జి. సాయి ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కృష్ణా జిల్లాకు 31 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు ఏడుగురు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 24 మంది బదిలీ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి కృష్ణా జిల్లాకు 21 మంది, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి కృష్ణా జిల్లాకు 11 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాన్ని నిబద్ధతగా నిర్వహించిన రాములు



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో సుదీర్ఘ కాలం టౌన్‌ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన గొర్రిపర్తి శ్రీరాములు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టౌన్‌ప్లానింగ్ విభాగం డెప్యూటీ సిటీప్లానర్ జుబెన్ రాయ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా వీఎంసీలో విధులు నిర్వహించిన రాములు ఉద్యోగాన్ని నిబద్ధతతో నిర్వహించేవారని అన్నారు. అసిస్టెంట్ సిటీప్లానర్ జగదీస్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని ఆశించారు. అనంతరం రాములు, సూర్యకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ జాన్‌ప్రసాద్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పద్మావతి, రంగప్రసాద్, పలువురు బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, చైన్‌మెన్‌లు శ్రీనివాస్, అలీ, జిలానీ, నాగరాజు, రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సూర్యచరిష్మ ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): జనవరి 27 నుంచి 30 వరకూ చెన్నైలో జరిగిన 6వ ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ 2023 పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థిని టి.సూర్యచరిష్మ బ్యాడ్మింటన్ అండర్ -19 బాలికల విభాగం సింగిల్స్‌లో మొదటి బహుమతి పొందింది. దీంతో ఆమె చదువుతున్న శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థినులు బుధవారం అభినందనలు తెలిపారు.

3వ తేదీ నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ప్రకటనలో తెలిపారు. మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ మహిళా ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా ఉత్సవ్‌లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న మహిళలు మొగల్రాజపురంలో రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

ఆధునికీకరించిన వ్యాయామశాలకు ఆదరణ



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 22వ డివిజన్‌లోని భ్రమరాంబపురంలో ఆధునికీకరించిన వ్యాయామశాలకు ఆరోగ్యాభిలాషులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. స్వర్గపరి పక్కనే వార్డు సచివాలయం ప్రాంగణంలో ఈ వ్యాయామశాలకు వీఎంసీ మంజూరు చేసిన రూ.15 లక్షలతో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. కోచ్ కూడా అందుబాటులో ఉన్నారు. దీతో ఈ డివిజన్‌తోపాటు పక్క డివిజన్ల నుంచి యువత క్యూ కడుతున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గుణదల (విజయవాడ తూర్పు): ఆరోగ్యం పట్ల మహిళలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రముఖ వైద్యురాలు ఎస్.హిమబిందు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో విజయపథంలో నడుస్తున్నారని తెలిపారు. దీనితో పాటు స్త్రీలలో మానసిక, శారీరక ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి మహిళ తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించాలని కోరారు. ఆందోళన చెందకుండా తగిన వైద్యం తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళల్లో రొమ్ము క్యాన్సర్ సమస్య తలెత్తినపుడు తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్ టి.తబిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వట్టిమాటలు కాదు.. గట్టి చేతలు

- వైఎస్సార్ సీపీతోనే తూర్పులో అభివృద్ధి
- దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం
- సీఎం జగన్ సహకారంతో సమస్యలు పరిష్కరించిన అవినాష్
- నియోజకవర్గ ప్రజలను గాలికి వదిలేసిన ఎమ్మెల్యే గద్దే



దేవినేని అవినాష్ చొరవతో ప్రారంభమైన షాదీఖానా పనులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రచారం కోసం ఎన్ని హామీలైన ఇస్తారు. పని చేసినట్లు ఫొటోలతో బిల్డప్ కూడా ఇస్తారు. కానీ వాటిలో ఒక్కటీ నెరవేర్చడు. ఆయనే విజయవాడతూర్పు శాసన సభ్యుడు గద్దే రామ్మోహన్. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు ఆయన బాధితులే. ప్రజలకు మంచి చేసిన దేవినేని అవినాష్ లాంటి వారు ధైర్యంగా నిత్యం ప్రజల మధ్య తిరుగుంటే, మోసం చేసిన వారు ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తారోనని ఆందోళనతో గడుపుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను తన మాయమాటలతో వంచించేందుకు మరోమారు సిద్ధమవుతున్నారు.

దళితులకు వంచన..

విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని గిరిపురం, న్యూగిరిపురం , బాడవపేట, నెహ్రూనగర్, ఉడ్‌పేట, ఫకీరుగూడెం, జార్జిపేట, ఇస్రాయేల్‌పేట, పిటింగెల్‌పేట వంటి 14 కాలనీల శ్మశానం విషయంలో దళితులను మోసం చేశారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని దళిత నేతలు ధర్నా చేస్తే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో దళిత మహిళా కార్పొరేటర్ కూడా ఉండటం విశేషం. జన్మభూమి సభల్లో శ్మశానం గురించి ప్రశ్నించకుండా వందలాది మంది పోలీసులతో దళితులను అడ్డుకునే వారు.

అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్మశాన స్థలాన్ని అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్థలం కేటాయిస్తే, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సమస్య పరిష్కారమైంది.

షాదీఖానా అంటూ మోసం..

తూర్పు నియోజకవర్గంలో దాదాపు 25 వేల మంది ముస్లింలు ఉన్నారు. వారి కోసం షాదీఖానా నిర్మించాలని కోరగా అదిగో.. ఇదిగో.. అంటూ కాలం గడిపారు. లబ్బీపేట బందరు కాల్వ ఒడ్డున అనువైన స్థలం ఉందని ముస్లింలు చెప్పినా పట్టించుకోలేదు. ఎన్నికలు మరో ఆరు నెలల్లో వస్తున్నాయనగా 15 రోజులకోసారి వచ్చి కొలతలు పేరుతో ఒకసారి, సర్వే పేరుతో మరోసారి, ముస్లిం నేతలతో చర్చలంటూ ఇంకోసారి ఫొటోలకు ఫోజులివ్వడం మినహా చేసిందేమీ లేదు.

రూ.2 కోట్లతో నిర్మాణాలు..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమస్యను నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విషయాన్ని వివరించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో జిల్లా అధికారులు కదిలారు. స్థల సమస్యను పరిష్కరించి రూ.2 కోట్లతో షాదీఖానా నిర్మాణ పనులు చేపట్టి వేగంగా పూర్తి చేస్తున్నారు.

పోలీసు కాలనీ సమస్య పట్టలేదు

రాష్ట్రంలో 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలాలపై ల్యాండ్ సీలింగ్ విధించారు. ఆ సమయంలో ఇరిగేషన్ నుంచి రిజర్వ్ పోలీసులు కొనుగోలు చేసిన పోలీస్ కాలనీ స్థలం కూడా సీలింగ్‌లోకి వెళ్లింది. అన్ని ఆధారాలతో కాలనీ వాసులు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ వద్దకు వెళ్లి వివరించారు. దీన్ని కాలయాపనతో సరిపెట్టారు.

స్పందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలనీ వాసులు విషయాన్ని దేవినేని అవినాష్‌కు తెలిపారు. ఆయన ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వాళ్లు సానుకూలంగా స్పందించడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ ఆ భూమిపై సీలింగ్ ఎత్తేస్తూ ఆదేశాలు జారీ చేయడంతో చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వమని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ నేతలు తిప్పకున్నారు.. వైఎస్సార్‌సీపీ చేసి చూపించింది..

ఎన్టీఆర్ కాలనీలో రోడ్లు వేయాలని కాలనీ ప్రజలు ఎమ్మెల్యే గద్దే చుట్టూ అనేక పర్యాయాలు తిరిగారు. అదిగో ఇదిగో అన్నారే కానీ రోడ్లు వేయలేదు. తమ వాడని వెళితే చేతులెత్తేశాడని తెలుసుకున్న కాలనీ వాసులు దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లారు. నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి రూ.4.50 కోట్లు వెచ్చించి రోడ్లు వేయించారు. ఇలా నియోజకవర్గంలో అనేక సమస్యలు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిష్కారమయ్యాయి.



శ్మశాన స్థలం అడిగితే అరెస్ట్ చేయించారు..

తూర్పు నియోజకవర్గంలో 14 కాలనీలకు శ్మశానం కేటాయించమని అడిగితే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు. మహిళా దళిత కార్పొరేటర్‌ను అని కూడా చూడకుండా అర్ధరాత్రి వరకూ స్టేషన్‌లో ఉంచి వదిలారు. నా భర్త, దళిత నాయకుడు కుక్కల ఏసును తెల్లవార్లు స్టేషన్‌లోనే ఉంచి ఉదయం పంపారు. శ్మశాన సమస్యను పరిష్కరించకుండా ఎమ్మెల్యే గద్దే నియోజకవర్గంలోని దళితులను మోసం చేశారు. ఆయనకు దళితులంటే చిన్నచూపు.

–పాల రూన్సీలక్ష్మి, మాజీ కార్పొరేటర్



ఐదేళ్లు ఆయన చుట్టూ తిరిగాం..

నియోజకవర్గంలో ముస్లింలకు షాదీఖానా ఏర్పాటు చేయాలని ఐదేళ్లు ఆయన చుట్టూ తిరిగాం. అనువైన స్థలం కూడా ఉందని చెప్పాం. నెలకోసారి ఆ స్థలం వద్దకు రావడం, ముస్లిం ప్రతినిధులను పిలిచించి షో చేసి వెళ్లారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవినేని అవినాష్ చొరవతో సమస్య పరిష్కారమైంది. సీఎం వైఎస్ జగన్ దృష్టి తీసుకెళ్లారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అవినాష్ చిత్తశుద్ధి ఉన్న నాయకుడు.

–ఎండీ ఆబీద్, ముస్లిం ప్రతినిధి, లబ్బీపేట

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం

డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురేంద్ర



లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశ ప్రగతిలో మానవ వనరుల పాత్ర కీలకమని డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.పురేంద్ర అన్నారు. రహదారి ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలన్నారు. కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. బెంజిసర్కిల్ సమీపంలోని తమ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పురేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కృష్ణలంక సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ వాహన డ్రైవర్లకు కచ్చితమైన పనిగంటలు కేటాయించడం, రవాణా వాహనాలకు తప్పనిసరిగా రెండవ డ్రైవర్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించే వీలుంటుందన్నారు. రహదారి భద్రత లక్ష్యంగా కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ స్కూలు ద్వారా శాస్త్రీయంగా డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కాజ వెంకట సత్య చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, చెన్నుపాటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

లా అండ్ ఆర్డర్ డీసీపీగా కృష్ణకాంత్ పటేల్

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా లా అండ్ ఆర్డర్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా కృష్ణకాంత్‌పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కర్నూలు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ని జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు హోం శాఖ కేటాయించింది.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ లక్ష్యం

- నిరంతరం మీకు అందుబాటులో ఉంటా
- వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్
- 7వ డివిజన్‌లో గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ



7వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ మాధురి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ప్రతికాలనీని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ప్రజలకు మంచి చేయాలనేదే ఆయాన ఆకాంక్ష అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం బుధవారం 7వ డివిజన్‌లోని ఉడుముల రామారావు వీధి, ఉడ్‌పేట ప్రాంతాల్లో జరిగింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ ప్రతి ఇంటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో ఆ ప్రాంతంలో చేపట్టబోయే పనులతో మీ అవినాష్ అన్న హామీ పేరుతో ఉన్న కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు మంచి చేస్తున్న వారిని మంచి మనస్సుతో దీవించాలని అవినాష్ కోరారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం సంక్షేమ పథకాలను అందించి వైఎస్ జగన్‌చరిత్ర సృష్టించారన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ దత్తత తీసుకున్న డివిజన్‌లో సైతం అభివృద్ధిని విస్మరించిన సంగతి తెలిసిందేనన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు మెరకనపల్లి మాధురి ఇతర నేతలు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్లో అవినాష్ కుటుంబ సభ్యులు వై సిద్ధార్థ్ పర్యటించారు. రెహ్మాన్ నగర్, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, జార్జిపేట, గాంధీకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పథకాలను వివరించారు. కార్పొరేటర్ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, నాయకులు బుర్రి జగ్జీవన్‌రావు, చింతగుంట విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై యువత దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఫణీంద్ర

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సమస్యలను నిశితంగా పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వాటిని ఎలా పరిష్కరించాలనే అంశాలపై యువత ఆలోచనలు చేయాలని గుంటూరులోని విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఫణీంద్ర చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కంప్యూటర్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ సదస్సు ముగింపు సమావేశం సిద్ధార్థ కళాశాలలోని వెబ్‌నార్ హాలులో బుధవారం జరిగింది. ఫణీంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా పరిశోధనల ఆవశ్యకతను తెల్సుకోవాలని చెప్పారు. ఉద్యోగ నియమకాల్లో పరిశోధనల దృక్పథం ఉన్న యువతకు కంపెనీలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సీ, జావా, డేటా మేనేజ్‌మెంట్, వెబ్ సర్వీసెస్, డేటా స్ట్రక్చర్స్ అంశాలపై యువత నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కోసం ఈ సదస్సు ఎంతగానో దోహదం చేసిందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా కళాశాల అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అతిథి ఫణీంద్రను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే విజయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే విజయాలను సాధిస్తారని ప్రముఖ మానసిక వికాస వైద్య నిపుణుడు ఆర్కే అయోధ్య, మానస కాజా అన్నారు. ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 రోజుల సమయాన్ని విద్యార్థులు ప్రణాళిక వేసుకొని విద్యనభ్యసించాలని సూచించారు. సరదాలు, ఆటలకు దూరంగా ఉండి, కష్టపడి చదివి ఇటు పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పాఠశాల కార్యదర్శి కేఎల్వీ మోహనరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

గుణదల పుణ్యక్షేత్రానికి ఉత్సవ శోభ





క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రమైన గుణదల మేరీమాత పుణ్య క్షేత్రం ఉత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం మరియమాత జెండాను ఆవిష్కరించి నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. మఠకన్యలు, భక్తుల సమక్షంలో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మేరీమాత పతాకాన్ని ఆవిష్కరించారు.

–గుణదల (విజయవాడ తూర్పు)





పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కాంట్రాక్టర్లు, అధికారులతో అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఆయన అభివృద్ధి పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే సమయంలో స్థానికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని అన్నారు. కాంట్రాక్టర్ చేసిన పనులు బిల్లుల చెల్లింపులో ఏఈలు సత్వరమే అధికారులకు నివేదించాలని, కాంట్రాక్టర్లకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఏఈలకు, డీఈలకు, ఈఈలను ఆదేశించారు. ఇంజినీరింగ్ సిబ్బంది కాంట్రాక్టర్ల సమన్వయంతో నగరాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) నరసింహమూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్ (వర్క్స్) రామ్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డెప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



తాగునీటి సరఫరాపై ఆరా తీసుకున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులకు తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా నిత్యం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సరఫరాలో సమస్యలు రాకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం వీరిరువురూ 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నూతనంగా వేసిన బోర్‌వెల్స్‌ను తనిఖీ చేశారు. యుద్ధ ప్రాతపదికన నిర్మాణం పూర్తి చేసి తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. రాజీవ్‌నగర్ ప్రధాన రహదారి వెంబడి ఉన్న ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం అనుమతి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాజీవ్‌నగర్ ప్లే స్కూల్ పక్కన పార్క్ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలకు గురికాకుండా త్వరతగతిన కాంపౌండ్ వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి 25వ డివిజన్, కాల్వ గట్టు ప్రాంతాన్ని పరిశీలించి స్థానికంగా ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని, డ్రెయిన్ నిర్మాణం, సీతారాంపురం పంపింగ్ స్టేషన్, బీటీ రోడ్డు అభివృద్ధి తదితర పనులు వెంటనే ప్రారంభించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, 25వ డివిజన్ కార్పొరేటర్ శకుంతలాదేవి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

డీటీసీ పురేంద్ర

విజయవాడస్పోర్ట్స్: దృష్టి లోపాలను అధిగమించేందుకు డ్రైవర్లు ప్రతి ఆరు నెలలకు ఓ సారి కంటి పరీక్షలు చేయించుకోవాలని డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డీటీసీ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ.. కంటి చూపు మందగించినప్పటికీ కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. శారీరక వైకల్యం, వృద్ధాప్యంతో ఉన్న వారు వాహనాలు నడపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ వై.ఐశ్వర్యరెడ్డి, ఎంవీఐలు పి.వి.రమణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ఏఓ సీహెచ్.శ్రీనివాసరావు, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగమురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విజయసాయిరెడ్డికి అదనపు బాధ్యతలు

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అప్పగింత



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వి. విజయసాయిరెడ్డికి అదనంగా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం రాత్రి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

రీజినల్ కో–ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఒంగోలు పార్లమెంటు, కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ స్థానాలు అప్పగింత



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలతో పాటు, కందుకూరు, సంతనూతలపాడు, కావలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రీజినల్ కో–ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు బుధవారం రాత్రి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

నూజివీడు టీడీపీలో టికెట్ లొల్లి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నూజివీడు: టీడీపీ అధిష్టానం ఏలూరు జిల్లా నూజివీడు టికెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు కాకుండా వేరేవారికి ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదని ఆ పార్టీ నాయకులు పలువురు స్పష్టం చేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి ఇంటివద్ద బుధవారం టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ముద్దరబోయిన రెండుసార్లు ఓడిపోయినా ఇక్కడే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషిచేశారని.. అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వరా అని ప్రశ్నించారు. కొత్త వ్యక్తులు ఎవరొచ్చినా నియోజకవర్గంలోని కేడర్ ఎట్టి పరిస్థితుల్లో సహకరించదని వారు పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు హరికోటి సంగీతరావు, మాజీ వైస్ ఎంపీపీ తాళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొంతూళ్లో ఓట్లుంటే అక్కసు ఎందుకు!

- ఈనాడు కథనంపై బాధితుల మండిపాటు



కొసనం కృష్ణ-నాగమణి

గణపవరం (మైలవరం): పనుల నిమిత్తం పొరుగూరికి వెళ్లొస్తున్న తమను ఊరు మారిపోయినట్టు.. ఓటు మాత్రం అలానే ఉండిపోయినట్టు ఈనాడు పత్రికలో అసత్య కథనం ప్రచురించారని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన ఓటర్లు మండిపడుతున్నారు. 'మేం ఊరు మారలేదు. మా ఓటూ మారలేదు. స్వగ్రామంలో మాకు ఓట్లుంటే ఈనాడుకు అక్కసు ఎందుకు. ఎందుకీ పిచ్చిరాతలు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గణపవరం గ్రామానికి చెందిన కొసనం కృష్ణ, కొసనం నాగమణి దంపతులు నిత్యం కూలి పనుల కోసం మైలవరం వెళ్లొస్తుంటారు. కాగా.. గణపవరంలోని 57వ పోలింగ్ బూత్‌కు చెందిన ఓటర్లు కొసనం కృష్ణ, నాగమణి గ్రామాన్ని విడిచిపెట్టి వెళ్లారని, ఇంకా వారి ఓట్లు గ్రామంలో కొనసాగుతున్నాయంటూ బుధవారం ఈనాడు పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆ దంపతులు స్పందిస్తూ.. తాము గణపవరంలో ఇంటి వద్దనే ఉంటున్నామని, పనుల నిమిత్తం మైలవరం వెళ్లొస్తుంటామని చెప్పారు. తాము గ్రామాన్ని, సొంత ఇంటిని విడిచి ఎక్కడికీ వెళ్లలేదని స్పష్టం చేశారు. తాము వైఎస్సార్‌సీపీ అభిమానులమనే అక్కసుతో ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించే ప్రయత్నంలో భాగంగా కొందరు ఇటువంటి రాతలు రాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ ఓట్లు తొలగించవద్దని కృష్ణ వారు వేడుకుంటున్నారు.

27 అదనపు పోస్టులు మంజూరు హర్షణీయం

ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: ఉద్యోగుల పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సచివాలయంలో వివిధ కేటగిరీలలో 27 పోస్టులు మంజూరు చేస్తూ బుధవారం కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడం నిజంగా హర్షణీయమని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఎస్‌ఓ, ఏఎస్ కేటగిరీలో కనీసం 15 పోస్టులు మంజూరు చేయాలని గత కొంతకాలంగా సంఘం తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తమ అభ్యర్థనను మన్నించి అదనపు పోస్టులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిలకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రౌడీ 'తమ్ముళ్లు'

పలువురు టీడీపీ నేతలపై హైదరాబాద్‌లో కేసులు

- భూమా అఖిల ప్రియ, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరద కుమారుడిపై గత ప్రభుత్వంలోనే నమోదు
- జేసీ ప్రభాకర్‌రెడ్డి అల్లుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిపై కూడా
- సెటిల్‌మెంట్లతో రౌడీయిజం చేస్తోన్న టీడీపీ, జనసేన నేతలు



సాక్షి ప్రతినిధి కర్నూలు: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను అడ్డాగా చేసుకుని టీడీపీ నేతలు దందాలు కొనసాగించారు. రాయలసీమకు చెందిన కీలక నేతలపై నమోదైన కేసులు, వాటి వివరాలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది. కేసులు నమోదైన వారిలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్లు ఆశిస్తున్నవారే అధికం. వీరితో పాటు టీడీపీతో పొత్తు కట్టి ఎన్నికల బరిలోకి వస్తున్న జనసేన నేతలూ ఉన్నారు. భూతగాదాలు, కిడ్నాప్‌లు, సెటిల్‌మెంట్ల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో పలు స్టేషన్లలో వారిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. గతేడాది వరకూ సాగిన ఈ గూండాగిరీపై ‘రాజధానిలో రాయలసీమ గూండాలు’ అని మీడియాలో విస్తృత కథనాలు వచ్చాయి. మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డి, మాజీమంత్రి భూమా అఖిలప్రియ, కర్నూలు టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ తండ్రి టీజీ వెంకటేశ్, బంధువు టీజీ విశ్వప్రసాద్, ఆదోని జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మల్లికార్జునపై వేర్వేరు ఘటనల్లో కేసులు నమోదయ్యాయి. వీరితో పాటు జేసీ పవన్ కుమార్‌రెడ్డి, సీఎం రమేశ్ నాయుడుపై కూడా కేసులు ఉన్నాయి.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డిపై

సినీ డిస్ట్రిబ్యూటర్ శివగణేశ్ కిడ్నాప్ వ్యవహారంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డిపై రెండున్నరేళ్ల కిందట బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. శివగణేశ్‌కు ప్రొద్దుటూరులో 2.5 ఎకరాల స్థలం ఉంది. వివాదంలో ఉన్న ఈ స్థలాన్ని పరిష్కరించేందుకు వరదరాజులరెడ్డి బంధువు రామచంద్రారెడ్డి ద్వారా శివగణేశ్, కొండారెడ్డిని ఆశ్రయించారు. కొండారెడ్డి పంచాయతీ తెంపారు. దీంతో ఎకరం స్థలాన్ని కొండారెడ్డికి ఇచ్చేలా శివగణేశ్ ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రకారం ఇచ్చిన స్థలం కాకుండా శామీర్‌పేటలో భూములను తమకే రాయించాలని కొండారెడ్డితో పాటు అతని గన్‌మెన్లు, 18 మంది అనుచరులు శివగణేశ్‌ను బెదిరించారు. ఇందుకు శివగణేశ్ ససేమిరా అనడంతో ఎర్రమంజిల్‌లో కిడ్నాప్ చేసి సినీఫక్కీలో సిటీ మొత్తం తిప్పి డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకున్నారు. దీంతో శివగణేశ్ అప్పటి హైదరాబాద్ సీపీ అంజన్ కుమార్‌తో పాటు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.14కోట్ల విలువైన ఈ భూకబ్జా వ్యవహారంలో కొండారెడ్డిపై సెక్షన్ 452, 341, 386, 506, 120బి-రెడ్‌విత్, 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిపై పలుస్టేషన్లలో :

దీపక్‌రెడ్డి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డికి స్వయనా అల్లుడు. 2012లో టీడీపీలో చేరారు. అప్పట్లో ఎన్నికల అఫిడవిట్‌లో రూ.6,781.05 కోట్ల ఆస్తులను చూపించి, అవి వివాదాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏడాదికి రూ.3.27 లక్షల వార్షికాదాయం ఉండే వ్యక్తి రూ.6,781 కోట్ల ఆస్తులను ఎలా సంపాదించారు? భారీస్థాయిలో ఆస్తులు సంపాదించేందుకు భూకబ్జాలు, సెటిల్‌మెంట్లే కారణమన్న ఆరోపణలున్నాయి. కబ్జాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ సెక్షన్ 506 కింద రెండు కేసులు, ఆక్రమణలకు పాల్పడ్డారంటూ సెక్షన్ 447 కింద గతంలో కేసులు నమోదయ్యాయి. కొందరిపై దాడి చేశారని సెక్షన్ 341 కింద ఓ కేసు, మారణాయుధాలు కలిగి ఉన్నాడని సెక్షన్ 148 కింద మరో కేసు నమోదైంది. ఇవి కాకుండా భూకబ్జాలకు సంబంధించి హైదరాబాద్‌లో 6 కేసులు నమోదయ్యాయి. గతంలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు దీపక్‌రెడ్డిని అరెస్టు కూడా చేశారు. మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో బెదిరింపుల కేసు, సైఫాబాద్ పోలీసుస్టేషన్‌లో ‘సాక్షి’ ఫోటోగ్రాఫర్‌ను బెదిరించిన కేసులు ఉన్నాయి. జేసీ బ్రదర్స్ అండతోనే దీపక్‌రెడ్డి అప్పట్లో పేట్రేగిపోయారనే ఆరోపణలున్నాయి.

జేసీ పవన్, సీఎం రమేశ్‌పై కేసు నమోదుకు ఫిర్యాదు

మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు జేసీ పవన్‌కుమార్‌రెడ్డి నిధులు దుర్వినియోగం చేశారని 2016లో హైదరాబాద్‌లో కేసు నమోదైంది. గల్లా జయదేవ్, ఎంపీ సీఎం రమేశ్ ఆధ్వర్యంలో అప్పట్లో వేర్వేరుగా ఒలంపిక్ అసోసియేషన్లు నడిపారు. ఇందులో సీఎం రమేశ్ వర్గంలో జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జేసీ పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. వివాదాల్లో ఉన్న సమయంలో అసోసియేషన్‌కు సంబంధించి పలు బ్యాంకు అకౌంట్లను అంతకు ముందు అసోసియేషన్‌లోని పురుషోత్తం వర్గం 2016 జూన్ 9న ఫ్రీజ్ చేసింది. ఫ్రీజ్ చేసిన అకౌంట్ల నుంచి నిధులు డ్రా చేశారని జేసీ పవన్, సీఎం రమేశ్‌తో పాటు జీసీ రావు అనే మరో వ్యక్తిపై సైఫాబాద్ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీంతో పాటు కోర్టులో కూడా సివిల్, క్రిమినల్ కేసు దాఖలు చేశారు.

రూ.100 కోట్ల స్థలంపై టీజీ కుటుంబం కన్ను

బంజారాహిల్స్‌లో ఏపీ జెమ్స్ అండ్ జ్యూవెలరీ పార్క్ నిర్మించేందుకు 2005లో 2.5 ఎకరాల స్థలాన్ని ఆ సంస్థకు కేటాయించారు. ఇందులో రెండెకరాల్లో నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే నిలిపేశారు. తక్కిన అరెకరం(2,250గజాలు) ఖాళీగా ఉంది. దీనిపై వీవీఎస్ శర్మ అనే వ్యక్తి కన్నుపడింది. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ స్థలాన్ని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ బంధువు టీజీ విశ్వప్రసాద్ చౌకగా కొనుగోలు చేశారు. దీన్ని స్వాధీనం చేసుకునేందుకు ఆదోని, మంత్రాలయంలో 50 మంది, హైదరాబాద్‌లో మరి కొంతమందిని తీసుకుని మొత్తం 63 మందితో స్థలంలోకి వెళ్లి గేటు పగలకొట్టి సెక్యూరిటీ ఆఫీసర్ నవీన్‌పై దాడికి పాల్పడ్డారు. ఓ కంటైనర్ ఆఫీసును తీసుకుని వెళ్లి అక్కడ ఉంచారు. దీంతో నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో ఏ–1గా టీజీ విశ్వప్రసాద్, ఏ2గా వీవీఎస్ శర్మ, ఏ3గా సుభాశ్ పోలిశెట్టి, ఏ–4గా అల్లు మిథున్‌కుమార్, ఏ–5గా టీజీ వెంకటేశ్, ఏ–13గా మల్లికార్జున అలియాస్ మల్లప్ప పేర్లు చేర్చారు. ఆ తర్వాత టీజీ వెంకటేశ్ పేరును ఎఫ్ఐఆర్ నుంచి తొలగించారు. టీజీ విశ్వప్రసాద్ ధమాకా, బ్రో సినిమాల నిర్మాత. ప్రస్తుతం టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాతల్లో ఒకరుగా ఉన్నారు. ఈయన రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆదోని నుంచి జనసేన టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏ–13 మల్లప్ప 2019 ఎన్నికల్లో జనసేన తరఫున ఆదోని నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఏ3 సుభాశ్ పోలిశెట్టి అప్పట్లో తూర్పుగోదావరి జిల్లా జనసేన కన్వీనర్.

మాజీమంత్రి భూమా అఖిలప్రియపై..

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో 40 ఎకరాల భూమి ఆక్రమించుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బంధువులను కిడ్నాప్ చేసిన వ్యవహారంలో మాజీమంత్రి భూమా అఖిలప్రియపై గతంలో కేసు నమోదైంది. 14 రోజుల రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. ఈ కేసులో ఏ–1గా అఖిల, ఏ2గా ఆమె భర్త భార్గవ్‌రామ్ పేర్లు ఉన్నాయి. కిడ్నాప్ కేసులో ఓ మహిళా మాజీ మంత్రి జైలుకు వెళ్లడం అదే తొలిసారి.

పాతపట్నంలో కొత్త రచ్చ

టీడీపీలోని రెండువర్గాలు బాహాబాహీ

- దూషించుకుంటున్న కలమట, మామిడి వర్గీయులు
- సర్వే ద్వారా అభ్యర్థి ఎంపికలో రేగిన చిచ్చు
- సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పాతపట్నం తెలుగుదేశం పార్టీలో మరోసారి రచ్చ జరుగుతోంది. టీడీపీ అభ్యర్థి ఎంపిక సర్వే కలకలం రేపుతోంది. ఐవీఆర్‌ఎస్, ఎస్‌ఎంఎస్ పేరుతో జరుగుతున్న అభిప్రాయ సేకరణలో ఏది వాస్తవమో, ఏది నకిలీయో తెలియదు గాని రెండు వర్గాల మధ్య చిచ్చు రేపింది. టిక్కెట్ ఆశిస్తున్న కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. వీరి మధ్య ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా బాహాబాహీకి దిగుతున్నాయి.

ఇద్దరికన్నా నోటాకే ఎక్కువ అభిప్రాయాలు

అధిష్టానం చేస్తుందో, ప్రైవేటు ఏజెన్సీలు చేస్తున్నాయో తెలియదు గానీ అభిప్రాయ సేకరణ పేరుతో నియోజకవర్గంలో రచ్చ నడుస్తోంది. ఒకసారి వెంకటరమణ, గోవిందరావు, కలమట సాగర్ పేరుతో అభిప్రాయ సేకరణ జరగ్గా.. మామిడికి ఎక్కువ సానుకూలత ఉన్నట్టు వారిలో వారే ప్రచారం చేసుకున్నారు. మరోసారి వెంకటరమణ, గోవిందరావు నోటా పేరుతో అభిప్రాయ సేకరణ జరగ్గా ఇద్దరి కన్న నోటాకే ఎక్కువ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇంకోసారి జరిగిన అభిప్రాయ సేకరణలో మామిడి కన్న కలమటకు ఎక్కువ మద్దతు వచ్చినట్టు సోషల్ మీడియాలో ట్రోల్ చేసుకుంటున్నారు. తాజాగా గోవిందరావు ప్రస్తావన లేకుండా వెంకటరమణ, జనసేన నాయకుడు గేదెల చైతన్య, నోటా పేరుతో అభిప్రాయ సేకరణ జరిగిందని టీడీపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి.

సోషల్ మీడియాలో రచ్చ

మరోవైపు గోవిందరావు జనసేన తీర్థం పుచ్చుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. దీనిపై గోవిందరావు తనపై ఫేక్ ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాతపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు పెడతానని సోషల్ మీడియా వేదికగా వార్నింగ్ ఇచ్చారు. తమకు అనుకూలంగా వస్తే అసలైన సర్వే అని, వ్యతిరేకంగా వస్తే ఫేక్ సర్వే అని రెండు వర్గాలు సోషల్ మీడియా వేదికగా రచ్చ చేస్తున్నాయి.

కుమ్ములాటలు కొత్తకాదు..

పాతపట్నం టీడీపీలో కుమ్ములాటలు కొత్త కాదు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి వెళ్లిపోయింది. తరచూ పార్టీలు మార్చి అక్రమాలకు పాల్పడ్డారని, వంశధార నిర్వాసితుల పరిహారాన్ని మింగేయడమేన కాకుండా ప్యాకేజీ కోసం ఎమ్మెల్యేగా ఉండి పార్టీ ఫిరాయించారని మాజీ ఎమ్మెల్యే వెంకటరమణపై గోవిందరావు వర్గీయులు ఆరోపణలు చేస్తున్నారు. దానికి ధీటుగా గోవిందరావుపై వెంకటరమణ వర్గం అంతే విమర్శలతో తిప్పికొడుతున్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో భూదందాలు చేశారని, ఆ డబ్బులతో రాజకీయం చేస్తున్నారని, పార్టీ పెద్దలంతా తన వెనకే ఉన్నారంటూ గోవిందరావుపై విమర్శలు చేస్తున్నారు.

నీ అంతు చూస్తా.. నీ దగ్గరికొచ్చి తంతా!

- దళిత అధికారికి టీడీపీ నేతల బెదిరింపులు
- ఏక వచనంతో సంబోధిస్తూ బూతుల పర్వం
- చిత్తూరు కార్పొరేషన్‌లో ఘటన

చిత్తూరు అర్బన్: దళిత అధికారిపై టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగడంపై దళిత సంఘాలు మండిపడుతున్నాయి. తన ఉన్నతాధికారి చెప్పిన పని చేసినందుకు.. దళిత అధికారి అంతు చూస్తామని ఒకరంటే.. ఫోన్ చేసి అమ్మనా బూతులు తిట్టి కథ తేలుస్తామన్నారు మరొకరు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యపై టీడీపీ నేతలు దౌర్జన్య కాండను దళిత సంఘాలు ఖండిస్తున్నాయి. చిత్తూరు నగరంలో టీడీపీ రంగులు పులిమిన నాసిరకం సిమెంటు దిమ్మెలను టీడీపీ నేతలు ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బల్లల ఏర్పాటుకు కార్పొరేషన్ అధికారుల అనుమతి తీసుకోకపోగా, అవి నాసిరకంతో ఉండడంతో వాటిపై కూర్చున్నప్పుడు కూలిపోయేలా ఉన్నాయి. దీంతో కట్టమంచి చెరువుపై ఏర్పాటు చేసిన దిమ్మెలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ అరుణ రెండు రోజుల కిందట ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారి చెప్పిన ఆదేశాలను అమలు చేయడానికి టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు దిమ్మెలను తొలగించడానికి వెళ్లారు. దీంతో టీడీపీ నేతలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ మాజీ కార్పొరేటర్ భర్త యువరాజులునాయుడు అందరి సమక్షంలోనే దళిత అధికారి చిన్నయ్యను లక్ష్యంగా చేసుకుని 'నీ అంతు చూస్తా.. మరో 72 రోజుల్లో మా ప్రభుత్వమే వస్తుంది.. నువ్వు నా మదిలో ఉన్నావ్.. కొంగారెడ్డిపల్లెలో నా బ్యానర్లు కావాలనే తీయించావు. నీ కథ తేలుస్తా..' అంటూ ఏక వచనంతో సంబోధిస్తూ ఆ అధికారిపైకి దూసుకొచ్చారు.

నువ్వు దళితుడివైతే నాకేంటి?

టీడీపీకి చెందిన సురేష్.. బుధవారం ఉదయం చిన్నయ్యకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. 'నువ్వు దళితుడివైతే నాకేంటి? ఏమనుకుంటున్నావు రా.. నిన్ను వదిలే ప్రసక్తే లేదు.. ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చి అక్కడే తంతా.. నీ కథ తేలుస్తా నా కొడకా..' అంటూ బూతులు తిట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన చిన్నయ్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే జరిగిన ఘటనను మున్సిపల్ కమిషనర్‌కు వివరించడంతో దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. దళిత అధికారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు బూతులు తిట్టడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), జిల్లా దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు చిన్నయ్యకు మద్దతుగా ఆందోళనకు పిలుపునిచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి రావెల



సీఎం వైఎస్ జగన్‌తో రావెల దంపతులు



సీఎం వైఎస్ జగన్‌తో విల్సన్ బాబు

- సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన రావెల కిషోర్ బాబు దంపతులు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు దంపతులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కిషోర్ బాబు, ఆయన సతీమణి శాంతి జ్యోతి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని, అందుకే తాను వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. సీఎం వైఎస్ జగన్ విజయవాడ నడిబొడ్డున ప్రపంచంలోనే ఎత్తైన అంబేడ్కర్ మహాశయుని విగ్రహాన్ని ఆవిష్కరించి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని అన్నారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగనే కావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. 'సీఎం జగన్ 120 సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రూ.2.5 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయడం ఓ విప్లవమన్నారు. 31 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నారు. పేద పిల్లలకు నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నారు. సీఎం జగన్ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ ఆ వర్గాలకు ఆర్థిక దన్ను కల్పించారు. సామాజికంగా, రాజకీయంగా వారికి అవకాశమున్న ప్రతి చోటా గుర్తింపునిచ్చారు. నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని సీఎం జగన్‌ను అడగలేదు. పార్టీ కోసం ఏలా సేవలందించమంటే అలా చేస్తానని చెప్పా. ఎలాంటి షరతు లేకుండా పార్టీలో చేరాను. సీఎం జగన్ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తా. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సీఎం జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తా' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఐఆర్ఎస్ మాజీ అధికారి విల్సన్ కూడా..

గుంటూరుకు చెందిన ఐఆర్ఎస్ మాజీ అధికారి చుక్కా విల్సన్ బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. విల్సన్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ని కలిశారు. సీఎం జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన అనంతరం విల్సన్ బాబు సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని విల్సన్ బాబు చెప్పారు. సామాజిక సాధికారతకు సీఎం జగన్ నిలువుటద్దంగా నిలిచారని అన్నారు. సీఎం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను ఎంతగానో ఆకర్షించాయని చెప్పారు. సీఎం జగన్ ఎలా చెబితే అలా చేస్తానన్నారు. ప్రత్తిపాడు సీటు ఇచ్చే విషయమై తనకు సమాచారం లేదని అన్నారు. ప్రత్తిపాడులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయమన్నా చేస్తానని చెప్పారు.

'ఒంగోలు'పై అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలు అర్బన్: ఒంగోలు ఎంపీ టికెట్ విషయంలో అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒంగోలు ఎంపీ విషయంలో అన్ని నియోజకవర్గాలు బాగుండాలనే ఉద్దేశంతోనే తాను మాగుంటకు సీటు ఇవ్వాలని కోరానన్నారు. అయితే అధిష్టానం ఏది చెబితే అది చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఒంగోలులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీ విషయంలో అధిష్టానంపై తాను అలిగానంటూ మీడియాలో కథనాలు ప్రసారం చేయడం సరికాదన్నారు. 'సీఎం పిలిస్తే పోనన్నానంటూ టీవీల్లో ప్రసారం చేయడం ఎంతవరకు సబబు. నేనేమైనా మీడియాతో మాట్లాడానా? నేనేది మాట్లాడినా భూతద్దంలో చూపించడం పరిపాటిగా మారిందని' అని ఎల్లో మీడియాపై మండిపడ్డారు. ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం ఎవరిని ప్రకటించినా ఒంగోలులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని బాలినేని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తానని స్పష్టం చేశారు.

పేదల కళ్లల్లో ఆనందం చూడాలనే..

ఒంగోలు నగరంలో 24 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే తన తపన అని బాలినేని అన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు వేగంగా తీసుకుంటున్నామన్నారు. ఈ విషయానికి సంబంధించి బుధవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను కలిశారు. ఇళ్ల పట్టాల విషయంపై చర్చించారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న గట్టి సంకల్పంతో పనిచేస్తున్నామని బాలినేని చెప్పారు. రైతులకు నగదు జమ చేసే కార్యక్రమం ప్రారంభించామని గురువారానికి చెల్లింపులు పూర్తవుతాయన్నారు.

నిరుద్యోగుల పక్షపాతి సీఎం జగన్



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

1,221వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: ఇప్పటికే సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి 2.50 లక్షలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసిన సీఎం జగన్ ప్రభుత్వం.. తాజాగా మెగా డీఎస్సీ, అటవీ శాఖ, ఏపీపీఎస్సీ ద్వారా భారీగా ఉద్యోగాలు భర్తీ చేసేందుకు సమాయత్తమవ్వడం శుభపరిణామమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,221వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. సీఎం జగన్ హయాంలో 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్లస్థలాలు అందజేయడంతో పాటు మహిళలకు భూహక్కు రిజిస్ట్రేషన్లు చేయడం బహుజనుల అదృష్టమన్నారు. గత ప్రభుత్వ హయాంలో బాబు, ఇతర పార్టీలకు చెందిన నేతలు పేదలకు ఏం ప్రయోజనాలు కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. పెట్టుబడిదారులు, అగ్రవర్ణాలు, ఎన్ఆర్ఐలు, ఆర్థిక ఉగ్రవాదులు, కులోన్మాదుల శ్రేయస్సు కోసమే పనిచేసిన చంద్రబాబు.. అమరావతి పేరుతో దొంగ ఉద్యమాలు చేయిస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బహుజనుల మద్దతుతో 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పి.దాసు, పి.వరప్రసాద్, కె.పుష్పరాజు, పి. బాబు, ఆదాం, బి.సాంబయ్య, బందెల కిరణ్, ఓబులేసు పాల్గొన్నారు.

బోగస్ ఓట్ల సూత్రధారి 'ఏలూరి'ని అరెస్ట్ చేయాలి

వైఎస్సార్‌సీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి

మార్టూరు: విధి నిర్వహణలో అధికారులను అడ్డుకోవడమే కాక కారు డ్రైవర్‌పై దగ్గరుండి తమ అనుచరులతో విచక్షణారహితంగా దాడి చేయించిన బోగస్ ఓట్ల సూత్రధారి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును పోలీసులు అరెస్టు చేయాలని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై ఏలూరి చేసిన నిరాధార ఆరోపణలను ఖండించారు. గ్రానైట్ ఫ్యాక్టరీల యాజమాన్యాల నుంచి అధికార పార్టీ నేతలకు ముడుపులు అందుతున్నాయని ఏలూరి ఆరోపించారని.. అదే నిజమైతే అధికారుల దాడులను తాము అడ్డుకుంటామే కానీ ఏలూరి వెళ్లి అడ్డుకోవాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ఇటీవల ఎన్నికల సంఘం సర్వే చేసి 13,550 బోగస్ ఓట్లు తొలగించిందని, అప్పటి నుంచి ఏలూరి ఓటమి భయంతో ప్రజలను రెచ్చగొడుతూ ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆమంచి వివరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపైనా ఏడుపేనా రామోజీ?

పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయడం కూడా తప్పేనా?

- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ని పట్టా అని తప్పుదోవ పట్టించడం దేనికి?
- రిజిస్ట్రేషన్‌కు విలువ ఉండదా?
- ఎన్‌వోసీ అవసరం ఉండకూడదనే కన్వేయన్స్ డీడ్లు
- 'ఈనాడు' విష కథనంపై ఫ్యాక్ట్ చెక్


ఎన్ఓసీ లేకుండా హక్కులు ఇవ్వగలరా..?
• జగనన్న ఇళ్ల స్థలాల దస్త్రావేజుల జారీలో విచిత్రాలు
అక్క, చెల్లెమ్మలకు..

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు వరుస అబద్ధాలతో, కట్టు కథలతో రాష్ట్ర ప్రభుత్వంపై విషం జిమ్ముతున్న ఈనాడు రామోజీరావు మరోసారి అడ్డగోలు రాతలకు దిగారు. ఇళ్లు లేనివారు రాష్ట్రంలో ఒక్కరు కూడా ఉండకూడదని ప్రభుత్వం 31 లక్షల మందికి పైగా పేద మహిళలకు ఇంటి స్థలాలు ఇచ్చినా రామోజీ తట్టుకోలేకపోయారు. ఇప్పుడు ఇళ్లను ప్రభుత్వం లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నా ఓర్వలేక విషం జిమ్ముతున్నారు. లక్షలాది మంది పేద అక్కచెల్లెమ్మలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుగా చిత్రీకరిస్తూ అడ్డగోలు రాతలతో బరితెగించారు. పేదలకు ఇచ్చిన లక్షలాది ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయడం, వారికి కన్వేయన్స్ డీడ్‌లు ఇవ్వడాన్ని తప్పుపడుతూ తన కడుపుమంటకు మందే లేదని రామోజీ చాటుకున్నారు. ఇందులో భాగంగానే 'ఎన్‌వోసీ లేకుండా హక్కులు ఇవ్వగలరా' అంటూ 'ఈనాడు'లో పెడార్థాలు తీశారు. ఎన్‌వోసీ (నిరభ్యంతర ధ్రువపత్రం) పేరుతో పేదలు భవిష్యత్తులో ఇబ్బందులు పడకూడదనే కన్వేయన్స్ డీడ్ ఇస్తారు. ఆ విషయం తెలిసి కూడా ప్రజల్లో అపోహలు సృష్టించడమే లక్ష్యంగా రామోజీ తన పచ్చ పైత్యాన్ని ప్రదర్శించారు.

ఇచ్చిన హామీ కంటే మిన్నగా..

వైఎస్సార్‌సీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇళ్ల స్థలాలు లేని 25 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, వారికి ఇళ్లు కట్టించి ఇస్తామని.. వారి పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇచ్చిన హామీ కంటే మిన్నగా ప్రభుత్వం 31.19 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి అందులో 22 లక్షల ఇళ్లు మంజూరు చేసింది. ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామనే మాటకు కట్టుబడి 2020లోనే జీవో ఇచ్చింది. అయితే పేదలకు మంచి జరగకూడదనే ఉద్దేశంతో టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలోపు పేదలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఒకేసారి 71,811 ఎకరాల భూమిని సేకరించి డీకేటీ పట్టాలిచ్చింది. నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించడానికి అసైన్ ల్యాండ్స్ (పీవోటీ) చట్టాన్ని 2021లో సవరించింది. దీని ప్రకారం.. పదేళ్ల తర్వాత ఇంటి స్థలాన్ని లబ్ధిదారులు అమ్ముకునే అవకాశం కల్పించింది. ఇళ్ల పట్టా ఇచ్చి, ఇళ్లు మంజూరు చేయడంతోపాటు ఇచ్చిన మాటకు కట్టుబడి న్యాయపరమైన అవరోధాలను అధిగమించి ఇటీవలే ఆర్డినెన్స్ తెచ్చింది. తద్వారా రిజిస్ట్రేషన్లు చేయడానికి మార్గం సుగమం చేసింది. అయితే ఈ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పట్టాతో పోల్చడం 'ఈనాడు' దివాళాకోరుతనం కాక మరేమిటి?

రిజిస్ట్రేషన్‌కు విలువ ఉండదా?

విలువ లేని రిజిస్ట్రేషన్ అంటూ 'ఈనాడు' తన కథనంలో అసత్యాలను వల్లె వేసింది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ని సైతం పట్టా అని తప్పుదోవ పట్టించింది. రిజిస్ట్రేషన్ చేస్తుంటే దాన్ని విలువ లేని రిజిస్ట్రేషన్ అంటారా? ఇళ్ల పట్టాకు రిజిస్ట్రేషన్ చేయడం వల్ల బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే రుణం లభిస్తుంది. ఏకంగా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేస్తుంది కాబట్టి బ్యాంకులు త్వరగా రుణాలిస్తాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాబట్టి డేటా బేస్‌లోనూ ఆ వివరాలన్నీ పదిలంగా ఉంటాయి. ఎప్పుడంటే అప్పుడు సర్టిఫైడ్ కాపీ పొందొచ్చు. ఫోర్జరీ, ట్యాంపర్ భయాలు అసలు ఉండవు. ఇంటిని అమ్ముకునే సమయంలో ఈ డాక్యుమెంట్ ఒక్కటి సరిపోతుంది.. ఎటువంటి లింక్ డాక్యుమెంట్లు అవసరం లేదు. నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇలాంటి ఎన్నో ఉపయోగాలు ఉండగా విలువ లేని రిజిస్ట్రేషన్ అంటూ అబద్ధాలను అచ్చేయడం 'ఈనాడు' కడుపు మంట కాక మరేమిటి? పట్టా రూపంలో ఇచ్చే కన్వేయన్స్ డీడ్ వల్ల లబ్ధిదారులకు ఎలాంటి ఉపయోగం ఉండదని లబ్ధిదారుల్లో అపోహ సృష్టించడమే 'ఈనాడు' పచ్చరాతల లక్ష్యం. డీడ్‌లో ఏ తేదీ నుంచి లబ్ధిదారులకు సర్వ హక్కులు లభిస్తాయో స్పష్టంగా ఉంటుంది. ఏ విధమైన ఎన్‌వోసీ లేకుండా బదిలీ చేసుకోవచ్చు. లబ్ధిదారులు ఏ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ ఎన్‌వోసీ కోసం తిరగనక్కర్లేదు. ఇది ఉపయోగం కాదా? ఎలాంటి ఉపయోగం లేదని 'ఈనాడు' వక్రభాష్యం చెప్పడం ఎంతవరకు సమంజసం?

వక్రీకరణలు.. అసత్యాలు..

కన్వేయన్స్ డీడ్ విధానంలో జరిగే రిజిస్ట్రేషన్ల సమయంలో షరతులు విధించినట్లు 'ఈనాడు' అబద్ధాలను అచ్చేసింది. ఇంటి నిర్మాణం 24 నెలల్లో పూర్తి చేయాలనే షరతును వక్రీకరించింది. ఈనాడుకు చట్టాల మీద ఎటువంటి అవగాహన లేదని దీని ద్వారా స్పష్టమవుతోంది. ప్రతి డి పట్టా మీద ఈ షరతు ఉంటుందని చట్టాల మీద అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క డీకేటీ పట్టా అయినా ఇచ్చి ఉంటే.. ఈనాడుకు పట్టాలో పొందుపరిచే నిబంధనల గురించి తెలిసి ఉండేది. లబ్ధిదారు రెండేళ్లలో ఇల్లు కట్టుకోలేరని తెలిసి, కన్వేయన్స్ డీడ్ చేయడానికి తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌లో ఈ 24 నెలల సమయాన్ని పొడిగించే అధికారం తనకు ఉండేలా ప్రభుత్వం చూసింది. పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలకు అన్యాయం జరిగే ఏ నిర్ణయం తీసుకోదు. ప్రభుత్వానికి పేదలకు ఏ విధంగా మంచి చేద్దామనే ఆలోచన తప్ప మరే దురాలోచన లేదు.

హయగ్రీవ భూ కేటాయింపుల రద్దుపై నిర్ణయానికి మరికొంత గడువివ్వండి

- హైకోర్టును కోరిన రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి
- అంగీకరించిన ధర్మాసనం.. విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖపట్నం, యండాడ గ్రామంలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించిన 12.41 ఎకరాల భూముల రద్దు విషయంలో నిర్ణయం తీసుకునేందుకు మరో నాలుగు వారాల గడువు కావాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టును కోరింది. ఈ మేరకు గడువు పెంపు కోసం పిటిషన్ వేశామని రెవెన్యూ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది పోతిరెడ్డి సుభాష్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యండాడ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 92/3లోని 12.41 ఎకరాల భూమిలో అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం నిర్మించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆ భూమిని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించారని, ఈ కేటాయింపులను రద్దు చేసి భూమిని వెనక్కి తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఇదే అంశంపై టీడీపీ నేత పల్లా శ్రీనివాసరావు కూడా పిల్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై బుధవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో కేటాయింపుల రద్దు విషయంలో తగిన నిర్ణయం తీసుకునేందుకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి మరింత గడువు కోరారు.

క్లుప్తంగా...

వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు విఘాతం కలగకూడదు

రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డ్ స్టాండింగ్ కమిటీ భేటీలో మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు సమీపంలోని గ్రామాల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కారణంగా వన్యప్రాణి చట్టాలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం స్టేట్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్ రెండో స్టాండింగ్ కమిటీ సమావేశం పెద్దిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో వన్యప్రాణి సంరక్షణ చర్యలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా కొల్లేరు అభయారణ్యం పరిధిలో వన్యప్రాణి సంరక్షణ చట్టాల అమలు, ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అనుమతులపై అధికారులతో చర్చించారు. రహదారులు, ఇతర నిర్మాణాల సందర్భంగా వన్యప్రాణులకు ఎటువంటి హాని, వాటి సహజ ఆవాసాలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (అటవీ, పర్యావరణం) నీరబ్ కుమార్ ప్రసాద్, పీసీసీఎఫ్ చిరంజీవి చౌధరి, తదితరులు పాల్గొన్నారు.

■ తెలంగాణ

జూబ్లీహిల్స్‌లో మరో హిట్ అండ్ రన్

- ఐదుగురికి గాయాలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): అదుపుతప్పి వేగంగా దూసుకొచ్చిన స్పోర్ట్స్ కారు ఢీకొట్టడంతో ఓ బైక్‌పై వెళ్తున్న అన్నాచెల్లెళ్లతో పాటు మరో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో కృష్ణానగర్‌కి చెందిన ఉదయ్ అనే యువకుడు తన సోదరిని తీసుకొని బైక్‌పై జూబ్లీహిల్స్ 36 మీదుగా మాదాపూర్ వైపుకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు వీరిని ఢీకొట్టి అదే వేగంతో ముందున్న మరో బైక్‌ను కూడా ఢీకొట్టింది. కారు డ్రైవర్ అదే వేగంతో మాదాపూర్ వైపు దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై వెళ్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా వీరిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

గద్దర్ పేరిట ఏటా పురస్కారాలు ఇస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): వచ్చే ఏడాది గద్దర్ జయంతి నాటికి ప్రభుత్వం తరఫున కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ పురస్కారాలు ప్రదానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ఇటీవల సినీ ప్రముఖులు నన్ను కలిశారు. గత ప్రభుత్వాలు నంది అవార్డులు ఇచ్చాయని, వాటిని పునరుద్ధరించాలని అడిగారు. నంది అవార్డులు కాదుగానీ, మా ప్రభుత్వం గద్దర్ పేరిట అవార్డులు ఇస్తుంది..బాహుబలిలో శివగామి శాసనం మాదిరి ఈ వేదికగా చెబుతున్న ఈ ప్రకటనే శాసనం, జీఓ'అని సీఎం తెలిపారు. బుధవారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు గజ్జెకట్టి గళం విప్పిన గొప్పవ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసే విషయమై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

'వ్యూహం' సినిమా ఎవరి పరువుకూ నష్టం కలిగించదు

- లోకేశ్‌కు పిటిషన్ వేసే అర్హత లేదన్న నిర్మాత
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం సినిమా ఏ పార్టీ, ఏ వ్యక్తి పరువుకు నష్టం కలిగించేదిగా లేదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కమిటీ అభిప్రాయపడిందని తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనానికి నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ నివేదించారు. చిత్రం చూడకుండా వేసిన.. ఎవరో చెబితే విన్నాం (హియర్ సే ఎవిడెన్స్) అంటూ పిటిషన్ అనుమతించడం సరికాదని, వ్యక్తిగత పరువు నష్టాన్ని పేర్కొంటూ పార్టీ తరఫున పిటిషన్ వేయడం సమర్థనీయం కాదని చెప్పారు. వ్యూహం చిత్రానికి సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికెట్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్‌వర్మ తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫున న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ (నారా లోకేశ్)కు ఈ పిటిషన్ వేసే అర్హతే లేదు. చిత్రం చూడకుండా ట్రెయిలర్ చూసి రిట్ కోర్టులను ఆశ్రయించడం చట్టవిరుద్ధం. ఇది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సంబంధించి బయోపిక్ మాత్రమే' అని పేర్కొన్నారు. సీబీఎఫ్‌సీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, రామ్‌గోపాల్ తరఫు న్యాయవాదుల వాదనల్ని కూడా విన్న ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

బాబుకు వయసొచ్చింది కానీ బుద్ధిరాలేదు

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం
- టీడీపీ, జనసేన పొత్తులో సీట్లపై ఇప్పటికీ స్పష్టతలేదు
- సీట్ల విషయంలో బాబు, పవన్ కొంపను వారి కార్యకర్తలే తగలబెడతారు



గుడివాడ టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు మతి భ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) విమర్శించారు. కృష్ణాజిల్లా గుడివాడలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు వయసు వచ్చింది కానీ బుద్ధి రాలేదన్నారు. ఊరూరా తిరుగుతూ ప్రజలకు ఏం చేస్తారో చెప్పడంలేదని, కేవలం ముఖ్యమంత్రిని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను తిట్టడమే ఆయన ప్రజా సంక్షేమంగా భావిస్తున్నారంటూ మండిపడ్డారు. చంద్రబాబు తలుపులు తెరిస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంతమంది వెళతారో తెలియదు గాని ఇప్పటికే రాష్ట్ర ప్రజలు ఆయన కొంప, గోడు, తలుపులు, కిటికీలు 2019 ఎన్నికల్లో పీకి హైదరాబాద్‌కి పార్సిల్ చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ప్రకటించాక జాబితాలో పేర్లు లేని కొంతమంది చంద్రబాబు దగ్గరకు వెళ్లవచ్చని అన్నారు. అయితే జనసేన, టీడీపీ అభ్యర్థుల జాబితా ప్రకటించే విషయంలో చంద్రబాబుకు, పవన్‌కు స్పష్టత లేదన్నారు. సీట్లు సర్దుబాటు విషయంలో వారిలో వారే కొట్టుకుని పవన్ కొంప, చంద్రబాబు కొంప వారి పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలే తగుల బెడతారన్నారు. కొంప తగలబడకుండా చంద్రబాబు ఇంటి దగ్గర ఫైర్ ఇంజిన్ ఒకటి పెట్టుకోవాలని సూచించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి కొత్త మేనిఫెస్టోతో తిరిగి ఎన్నికలకు సిద్ధం అవుతున్నామని నానీ చెప్పారు. ఈ మేనిఫెస్టో చూసి చంద్రబాబుకు దిమ్మతిరిగి బొమ్మకనబడుతుందన్నారు.

షర్మిల అప్పుడేమయ్యారు..

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల.. తెలంగాణలో పార్టీ పెట్టి ఏమి వెలగబెట్టారో రెండు రాష్ట్రాల ప్రజలు చూశారని నాని అన్నారు. ఒక్కశాతం కూడా ఓటింగ్‌లేని కాంగ్రెస్ పార్టీకి షర్మిలను అధ్యక్షురాలిని చేస్తే ఒరిగేదేముందని ప్రశ్నించారు. గతంలో తెలంగాణలో ఏ మాటలైతే షర్మిల వాడారో అవే మాటలు ఇప్పుడు ఆంధ్రాలో కూడా వినియోగిస్తున్నారన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదని, చంద్రబాబు అసంపూర్తిగా మిగిల్చిన పోలవరం ప్రాజెక్టును జగన్ పూర్తిచేస్తే ఇన్నాళ్లు దాని గురించి ఎందుకు మాట్లాడలేదని, ఇప్పుడు అవి గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు ఆమె ఏమి చేశారని, 2014కు ముందు పార్టీ తరఫున పాదయాత్ర చేసిన ఆమె ఆ తర్వాత ఇప్పటి వరకు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కోసం ఎక్కడైనా పనిచేశారా, 2014 ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను చంద్రబాబు తీసుకుపోతే అప్పుడేమైనా మాట్లాడారా అని అన్నారు. పాదయాత్ర చేసి వైఎస్ జగన్ పార్టీని బతికించుకున్నారని, ఆ పాదయాత్రలో ఏనాడూ కనిపించని షర్మిల పార్టీకోసం పనిచేశాననడం హాస్యాస్పదమని అన్నారు. నిస్వార్థంగా అన్న కోసం పనిచేశానని చెపుతున్న ఆమె ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరి విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టిన దుర్మార్గపు కాంగ్రెస్‌లో చేరి పనికిమాలిన 10 మంది నాయకులను వెనకేసుకుని వైఎస్ జగన్‌ను విమర్శించడం సరికాదన్నారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాలు ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలి గానీ ఇలా రోడ్డునపడటం, రాజశేఖరరెడ్డి బద్ధ శత్రువులైన ఏబీఎన్ రాధాకృష్ణ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతో చెట్టాపట్టాలు వేసుకుని జగన్‌ను విమర్శించడం సరికాదని హితవు పలికారు.

బీజేపీ ఒంటరి పోరు

జాతీయ పార్టీ సూచనలతో దూకుడు పెంచిన రాష్ట్ర పార్టీ

నేడు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభం

4 తర్వాత అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డా రాష్ట్ర పర్యటనలు

సాక్షి, అమరావతి : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్రంలో ఒంటరి పోరుకు సన్నద్ధమవుతోంది. పొత్తులకు సంబంధించి రకరకాల ప్రచారం సాగుతున్నప్పటికీ, జాతీయ పార్టీ సూచనల మేరకు రాష్ట్ర పార్టీ ఒంటరిగా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా గురువారం ఒకే రోజున రాష్ట్ర వ్యాప్తంగా 25 లోక్‌సభ స్థానాల పరిధిలో పార్టీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభిస్తోంది. కొన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ గురువారమే నియోజకవర్గ కార్యాలయాలను ప్రారంభిస్తోంది. గత నెల రోజులుగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రమంతటా పార్టీ శ్రేణులను భాగస్వాములను చేస్తోంది. నెల క్రితమే.. బీజేపీకీ 'రాష్ట్రంలో ఒక్క అవకాశం – కేంద్రంలో మరో విడత' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా 46 వేలకుపైగా వాల్ పెయింటింగ్‌లు, పోస్టర్లు వేయించారు.



బీజేపీకి ఆంధ్రాలో ఒక్కసారి అధికారం ఇవ్వాలని కోరుతూ విజయవాడ కరెన్సీ నగర్ ఇంటి గోడపై అంటించిన పోస్టర్లు

అభ్యర్థుల ఎంపికకు కసరత్తు

20 రోజుల క్రితం రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు ముగ్గురేసి ఒక కమిటీగా ఏర్పడి జిల్లాల్లో పర్యటించారు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి ఉండే అభ్యర్థుల బయోడేటాలు సేకరించారు. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాలకు 2,438 మంది దరఖాస్తు చేసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల జాతీయ పార్టీ సహ సంఘటన కార్యదర్శి శివప్రకాష్‌తో జరిగిన రాష్ట్ర ముఖ్యనేతల భేటీలో లోక్‌సభ స్థానాల్లో పోటీకి అవకాశం ఉన్న నాయకులు, పార్టీ బలాబలాలపై చర్చించారు. రాజ్యసభ సభ్యులు జీవీఎల్, సీఎం రమేష్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి తదితరులతో పాటు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్న పరిపూర్ణానంద స్వామి కూడా లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో ఉన్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల వారీగా ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలు

కేవలం నామమాత్రంగా కాకుండా, పూర్తి స్థాయిలో పార్టీ పోటీలో ఉండేలా పార్టీ పలు చర్యలు చేపట్టింది. అభ్యర్థులకు అన్ని విధాలా తోడ్పాటునందించేందుకు ప్రతి లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు 37 మందితో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తోంది. ఎన్నికల నిర్వహణలో అంశాలను 37 విభాగాలుగా వర్గీకరించారు. ఒక్కొక్క విభాగం బాధ్యతలు ఈ కమిటీలోని ఒకరికి అప్పగించారు. పార్టీ ఎన్నికల కార్యక్రమాలను జాతీయ, రాష్ట్ర పార్టీ సులభంగా పర్యవేక్షించేలా ఐదేసి లోక్‌సభ నియోజకవర్గాలను ఒక క్లస్టర్‌గా విభజించి, 5 క్లస్టర్లు ఏర్పాటు చేశారు.

అగ్రనేతలు రంగప్రవేశం..

ఎన్నికలకు సంబంధించి బీజేపీ రానున్న నెల రోజుల కార్యక్రమాలను సిద్ధం చేసుకుంది. ఫిబ్రవరి 4వ తేదీ తర్వాత పార్టీ అగ్రనేతలు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా రాష్ట్రంలో పర్యటించనున్నారు. క్లస్టర్ల వారీగా ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఇతరత్రా కార్యక్రమాలు ఉండవు. ఒక వేళ రెండో పూట పర్యటన ఉంటే ఆ ప్రాంతంలోని వివిధ రంగాల నిపుణులతో సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపారు. ఫిబ్రవరి 9, 10 తేదీల్లో రాష్ట్రంలో అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పార్టీ ముఖ్య కార్యకర్తలు పర్యటించి, బూత్‌లవారీగా పార్టీ పరిస్థితిని అంచనా వేస్తారు. అక్కడ పార్టీ ఏజెంట్లుగా పనిచేసే వారిని గుర్తించి రాష్ట్ర పార్టీకి నివేదిస్తారు. ఎన్నికల ప్రక్రియ జరిగే నెలన్నరలో రాష్ట్రమంతటా 20 వేల బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించండి

కోనసీమ అల్లర్ల కేసుల ఉపసంహరణపై పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చిన సందర్భంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి పలువురిపై పోలీసులు నమోదు చేసిన కేసుల ఉపసంహరణ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ఆదేశించింది. అలాగే సీఆర్‌పీసీ నిబంధనలతో పాటు స్వతంత్రంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. కేసుల ఉపసంహరణ విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కోనసీమ అల్లర్లకు సంబంధించి పలువురిపై పోలీసులు నమోదు చేసిన కేసుల ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 20న జారీ చేసిన జీవో 1566ను సవాలు చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబురావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వం జారీ చేసిన జీవో సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని తెలిపారు. కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించిందన్నారు. వాస్తవానికి కేసుల ఉపసంహరణ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే ఇక్కడ అందుకు విరుద్ధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.



కేసుల ఉపసంహరణ ప్రభుత్వ విధాన నిర్ణయం...

హోంశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం పాలనాపరమైన నిర్ణయం తీసుకుని జీవో జారీ చేసిందని తెలిపారు. అంతిమంగా పబ్లిక్ ప్రాసిక్యూటరే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కేసుల ఉపసంహరణ ప్రభుత్వ నిర్ణయమేనని, చివరకు సంబంధిత కోర్టు అందుకు అనుమతినివ్వాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ కోర్టు కేసుల ఉపసంహరణకు అనుమతినిస్తే, దానిపై అభ్యంతరం ఉన్న వారు హైకోర్టును ఆశ్రయించవచ్చునన్నారు. అసలు ఇంకా కేసుల ఉపసంహరణ వరకు రాలేదని తెలిపారు. కేసుల ఉపసంహరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ఉదహరించారు. గడువునిస్తే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది.

ఆసరా విప్లవం – మహిళల్లో ఉజ్వలం

ఆసరా తెచ్చిన విప్లవం అంతా ఇంతా కాదు. అచేతనంగా ఉండిపోయిన మహిళల్లో ఈ పథకం జీవవాయువులు ఊదింది. ప్రోత్సాహం అందిస్తే పురుషులతోపాటు సమానంగా వ్యాపార సామ్రాజ్యం విస్తరిస్తామంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలకు ఆసరా పథకంలో రుణమాఫీ చేయడంతో మహిళామణులు తమలో ఉన్న సృజనాత్మకతను బయటకు తీస్తున్నారు. ఆసరా డబ్బులతో పచ్చళ్లు తయారు చేసి విదేశాలకు ఎగుమతులు చేయడం, వస్త్రాల వ్యాపారం, పాలవ్యాపారం చేస్తూ కుటుంబాలను అభివృద్ధిపథంలో నడుపుతున్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా వాటిని అవసరాలకు ఖర్చు చేయకుండా వారికాళ్లపై వారు నిలబడి కొత్త సమాజం నిర్మాణానికి బాటలు వేసేలా ముందుకు కదులుతున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

విదేశాలకు పచ్చళ్ళు ఎగుమతి



ఈమె పేరు రావూరి కమలమ్మ గుంటూరు జిల్లా తెనాలిలోని చినరావూరు. మరో ముగ్గురు మహిళలతో కలిసి ఆమె పచ్చళ్ళు తయారు చేస్తారు. ఆసరాలో వారి గ్రూపునకు రూ.10లక్షలు రుణమాఫీ జరిగింది. వచ్చిన నగదును వ్యాపారానికి ఉపయోగించారు. తద్వారా వ్యాపారాన్ని విస్తరించారు. అలాగే వారి ప్రాంతంలోని కొందరు వివిధ దేశాలలో స్థిరపడ్డారు. వారికి పచ్చళ్ళను పంపుతున్నారు. అలాగే ఆసరా కింద ప్రభుత్వం రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.48వేలు ఆమెకు వచ్చాయి. –రావూరి కమలమ్మ

ఆసరా డబ్బుతో గేదెను కొన్నారు



ఈమె పేరు పెట్టా భువనేశ్వరి. తూర్పు గోదావరి జిల్లా పెరవలి. మూడు విడతల్లో వచ్చిన రూ.30 వేలకు మరికొంత అప్పు చేసి పాడి గేదెను కొనుగోలు చేశారు. అవి ఇప్పుడు రెండు గేదెలు అయ్యాయి. పాలపై వచ్చిన ఆదాయంతో అప్పు తీర్చటమే కాకుండా మూడవ విడత వచ్చిన సొమ్ముతో మరో గేదెను కొనుగోలు చేశారు. ఇప్పుడు ఆనందంగా పాల వ్యాపారం చేస్తున్నారు. –భువనేశ్వరి

ఆసరా మమ్మల్ని నిలిపింది



నాకు వివాహమై 19 ఏళ్లవుతుంది. నరసరావుపేటలోని షాలెంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటాం. ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ప్రశాంతి డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిని. నాకు వైఎస్సార్ ఆసరాలో రూ.16వేలు రుణమాఫీ జరిగింది. మేము జిల్లాలో ఎక్కడ తిరునాళ్ల, ఉత్సవాలు జరిగినా అక్కడకు వెళ్లి ఫ్యాన్సీ ఐటమ్స్, గిల్టు నగల వ్యాపారం చేస్తాము. మాకు ఆసరాతోపాటు జగనన్న తోడు, అమ్మఒడి, పింఛన్ పథకాలు అందుతున్నాయి. ఒక అమ్మాయి దివ్యాంగురాలు, ఆమెకు నెలకు రూ.3వేలు పింఛన్ ఇస్తున్నారు. – షేక్ హుస్నేన్‌బీ, పల్నాడు జిల్లా

చిల్లర కొట్టు పెట్టుకున్నాం



మాది తాజ్‌మహల్ గ్రూపు. మా గ్రూపునకు రూ.4.80 లక్షలు రుణమాఫీ జరగగా నాకు రూ.48 వేలు రుణమాఫీ అయింది. ఈ డబ్బులతో చిల్లర కొట్టులోకి సరుకులు తెచ్చుకుంటున్నా. వ్యాపారం చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. మాకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు మంజూరు చేశారు. రూ.1.80 లక్షలకు తోడు మరో రూ.35 వేలు రుణం ఇచ్చారు. దీంతో కాలనీలో ఇల్లు కట్టుకున్నాం. పిల్లలకు అమ్మఒడి రావడంతో పాటు మా అత్తయ్యకు పింఛన్ వస్తోంది. జగనన్న చేసిన మేలు మరువలేం. – షేక్ రేష్మా, రామాయమ్మరావుపేట, నూజివీడు, ఏలూరు జిల్లా

చీరల వ్యాపారాన్ని విస్తరించా



నేను డ్వాక్రా సంఘ సభ్యురాలిగా ఉంటూ చీరల వ్యాపారం చేస్తుంటాను. మా డ్వాక్రా సంఘ సభ్యులు అందరం కలిసి బ్యాంక్‌లో రూ.10లక్షల రుణం తీసుకున్నాం. ఆసరా పథకంలో భాగంగా నాకు రూ. లక్ష రుణమాఫీ అయింది. వాటిని చీరల వ్యాపారానికి పెట్టుబడిగా వాడుకున్నా. ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా కింద నాకు రూ.7వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.28 వేలు వచ్చాయి. –దేవరపల్లి సీత, చినరావూరు, తెనాలి,గుంటూరు జిల్లా

ఇది గతం..

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యానికి జిల్లా ఆస్పత్రికో లేదా ప్రైవేటు ఆస్పత్రికో వెళ్లాల్సిందే. వైద్య సదుపాయం ఉన్న గ్రామాలే తక్కువ. అక్కడ వైద్యుడు ఉంటాడన్న నమ్మకం లేదు. ప్రాంతీయ ఆస్పత్రులూ అంతంతమాత్రమే. అక్కడా వైద్యులు ఉండరు. దీంతో వృద్ధులైనా, మహిళలైనా, దివ్యాంగులైనా వ్యయప్రయాసలకోర్చి జిల్లా ఆస్పత్రికో, ప్రైవేటు ఆస్పత్రికో వెళ్లక తప్పని పరిస్థితి. అక్కడా పెద్ద క్యూలు. ఉండేదే అరకొర వైద్య సిబ్బంది. ఆరోజు తమను చూస్తారో లేదోనన్న ఆందోళన.

నేడు గ్రామాలకే వైద్యులు..

ఇప్పుడున్నది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం. ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్.. గ్రామాల్లోని ఆస్పత్రుల నుంచి జిల్లా ఆస్పత్రుల వరకు అధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. అంతే కాదు.. గ్రామీణ ప్రజలు చిన్న సమస్యలకు కూడా పెద్దాస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్యులనే గ్రామాలకు పంపిస్తున్నారు. ఇందుకోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు గ్రామీణులెవరూ వైద్యం కోసం పరుగులు పెట్టాల్సిన అవసరంలేదు. వారి వద్దకే వైద్యులు వస్తున్నారు. వారి ఆరోగ్యాన్ని పరీక్షించి, పరీక్షలు చేసి, అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు.

•గ్రామీణులకు వరం.. 'ఫ్యామిలీ డాక్టర్'

15 నెలల్లో రికార్డు స్థాయిలో 3.15 కోట్ల వైద్య సేవలు

దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్

- సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్యం, పరీక్షలు, మందులు
- మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే వైద్యం
- వారి కుటుంబ సభ్యులకు పెద్ద ఊరట
- బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల అవస్థలకు చెక్



గుంటూరు జిల్లా పెదపాలెంలో శేషగిరిరావుకు ఇంటివద్ద వైద్యం అందిస్తున్న డాక్టర్ షారోన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమం 'ఫ్యామిలీ డాక్టర్'. ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యులు వెళ్లే ఈ కార్యక్రమాన్ని 2022 అక్టోబర్ నెలలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ట్రయల్ రన్ మొదలు పెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 15 నెలల్లో రికార్డు స్థాయిలో 3.15 కోట్ల వైద్య సేవలు అందించారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకు మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండేలా ప్రస్తుతం ఉన్న 1142 పీహెచ్‌సీలకు అదనంగా 88 కొత్త వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. మండలంలో ఒక పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉన్న 63 చోట్ల వైద్యులను నియమించింది. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు వారి పరిధిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను సమానంగా విభజించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10,032 విలేజ్ క్లినిక్‌లను వైద్యులు నెలలో రెండుసార్లు సందర్శిస్తున్నారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ)లతో పాటు వైద్యులు గ్రామాలకు వెళుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఉన్న 676 ఎంఎంయూలకు అదనంగా 260 వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ 104 యూనిట్, వైద్యుడు గ్రామానికి వెళ్లిన రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రజలకు అవుట్‌పేషెంట్ సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారికి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇక నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో భాగంగా 30 ఏళ్లు పైబడిన వారందరినీ వైద్య శాఖ స్క్రీనింగ్ చేస్తోంది. వీరిలో బీపీ, షుగర్, ఇతర సమస్యలు ఉన్న వారికి నిర్దేశించిన ప్రమాణాలతో మెడికల్ ఫాలోఅప్ చేస్తూ ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.

'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామాల్లో అందే వైద్య సేవలు

- జనరల్ అవుట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు.
- ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం
- చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ
- పాలియేటివ్ కేర్
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు

గ్రామాల్లోనే 14 రకాల వైద్య పరీక్షలు

- ✔ గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్
- ✔ హిమోగ్లోబిన్ టెస్ట్
- ✔ ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (సుగర్)
- ✔ మలేరియా టెస్ట్
- ✔ హెచ్‌ఐవీ నిర్ధారణ
- ✔ డెంగ్యూ టెస్ట్
- ✔ మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్)
- ✔ అయోడిన్ టెస్ట్
- ✔ వాటర్ టెస్టింగ్
- ✔ హెపటైటిస్ బి నిర్ధారణ
- ✔ ఫైలేరియాసిస్ టెస్ట్
- ✔ సిఫ్లిస్ ర్యాపిడ్ టెస్ట్
- ✔ విజువల్ ఇన్‌స్పెక్షన్
- ✔ స్పుటమ్ (ఏఎఫ్‌బీ)

3.15 కోట్ల సేవల్లో వివిధ సేవలు ఇలా

విభాగం	వైద్య సేవలు
జనరల్ ఓపీ	91,37,222
గర్భిణులకు ఏఎన్‌సీ చెకప్‌లు	23,05,684
బాలింతలకు పీఎన్‌సీ చెకప్‌లు	7,39,177
రక్తహీనత ((ఎన్‌సీడీ ఫాలోఅప్))	1,33,597
బీపీ	77,16,217
షుగర్	46,92,513
బీపీ, షుగర్	65,42,193
ఇతర సేవలు	2,58,291



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వరం

సాధారణంగా బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు, వైద్యులను సంప్రదిస్తూ ఉండాలి. మారుమూల గ్రామాల్లో ఉండే వారు ప్రతి నెలా వైద్యుడిని సంప్రదించాలంటే 4 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉండే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లాలి. ఆస్పత్రికి వెళ్లి రావడానికి ప్రయాణ చార్జీలతో పాటు, ఒక రోజంతా కేటాయించాలి. మంచానికే పరిమితమైన వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటే ఆ కుటుంబాలు పడే కష్టాలు వర్ణనాతీతం. ఈ కష్టాలకు చెక్ పెడుతూ సీఎం వైఎస్ జగన్ వైద్యులనే ప్రజల వద్దకు పంపుతున్నారు. ఇది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వరంగా మారింది. విలేజ్ క్లినిక్‌లలోనే 105 రకాల మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. థైరాయిడ్, గుండె సంబంధిత, ఇతర సమస్యలకు మందులు గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉంటున్నాయి.

'భూమా'రాంగ్!

- బాబును నమ్మి మునిగిన భూమా అఖిలప్రియ!
- కుటుంబంలో రచ్చకెక్కిన విభేదాలు
- అఖిలప్రియకు మద్దతు ఇవ్వబోమంటున్న సోదరుడు కిశోర్‌రెడ్డి
- కుటుంబ కలహాల నేపథ్యంలో టికెట్ నిరాకరించే యోచనలో చంద్రబాబు
- పొత్తులో భాగంగా జనసేనకు సీటు ఇస్తారంటూ లీకులు



సాక్షి, నంద్యాల: టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి అఖిలప్రియ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారా? ఆమె వ్యవహార్శైలి బూమరాంగ్ అవుతుందా? సొంత కుటుంబ సభ్యులకే నచ్చడం లేదా? ఆమె ఏకాకిగా మిగిలారా? కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమెకు టికెట్ నిరాకరించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధమయ్యారా? అంటే అవుననే జవాబులే వినిపిస్తున్నాయి. బాబు మోసాల ఖాతాలో మరో వికెట్ పడిందని నంద్యాల జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. దివంగత భూమా నాగిరెడ్డి కూతురిగా అఖిలప్రియ వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత పార్టీ ఫిరాయించి టీడీపీలోకి వెళ్లారు. అప్పటి నుంచి ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఆమె పార్టీ మారినా భూమా కుటుంబ సభ్యుల్లో అధికశాతం వైఎస్సార్ సీపీకే మద్దతుగా నిలిచారు. దీనికితోడు అఖిలప్రియ భర్త భార్గవరాం నాయుడు వ్యవహార శైలిని అనుచరులతోపాటు కుటుంబ సభ్యులూ తప్పుపట్టారు. అఖిలప్రియకు, ఆమె భర్త భార్గవరాం నాయుడికి భూమా కుటుంబంతో సంబంధం లేదని భూమా కిశోర్ రెడ్డి (అఖిలప్రియ పెదనాన్న కొడుకు) స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులంతా సమావేశమై ఈ ఎన్నికల్లో అఖిలకు మద్దతు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నామని కిశోర్ పేర్కొన్నారు. తండ్రి భూమా నాగిరెడ్డి మరణానంతరం మంత్రి పదవి చేపట్టిన నాటి నుంచి అఖిల వ్యవహార శైలిలో మార్పులు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒంటెత్తు పోకడలకు పోవడంతో బంధువుల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. 2019 ఎన్నికల్లో ఓడిన అనంతరం హైదరాబాద్‌కు మకాం మార్చిన తర్వాత దోపిడీ, బెదిరింపులు, కిడ్నాప్ కేసులతో అఖిల తీరు వివాదాస్పదమైంది. బంధువులతోనూ వివాదాలు, ఆస్తి తగాదాలు రావడం, అఖిల భర్త వ్యవహార్శైలి వల్ల కుటుంబ సభ్యులు ఆమెతో బంధుత్వం తెంచుకోవాలనే నిర్ణయానికి వచ్చారు.

అఖిలను పక్కకు పెట్టేసినట్టే..

భూమా నాగిరెడ్డికి కుడి భుజంగా ఉన్న ఏవీ సుబ్బారెడ్డిని అఖిలప్రియ దూరం పెట్టారు. గతేడాది నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఆళ్లగడ్డలో జరిగినప్పుడు సుబ్బారెడ్డిపై దాడి చేయడం పార్టీలో కలకలం రేపింది. ఈ ఘటన యాత్రపై ప్రభావం చూపడంతో అప్పట్లో బాబు అఖిలను మందలించారని సమాచారం. అయినా ఆమె వ్యవహార్శైలిలో మార్పు రాలేదని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఆమె వల్ల పార్టీ దెబ్బతింటోందని జిల్లా నాయకులు ఇప్పటికే చంద్రబాబుకు వివరించారు. దీంతో ఆళ్లగడ్డ బరి నుంచి ఆమెను తప్పించాలనే నిర్ణయానికి బాబు వచ్చినట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా ఆళ్లగడ్డ సీటును జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఆళ్లగడ్డలో నిర్వహించిన రా.. కదలిరా సభలోనూ టికెట్ విషయం తేల్చకపోవడం ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తోంది. ఇప్పటికే నంద్యాల నియోజకవర్గ బాధ్యతల నుంచి అఖిలప్రియ సోదరుడు భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించడం .. ఇప్పుడు ఆళ్లగడ్డ టికెట్ అఖిలప్రియకు ఇవ్వరనే ప్రచారం నేపథ్యంలో చంద్రబాబును నమ్మి భూమా కుటుంబం పెద్ద తప్పే చేసిందనే వాదన జిల్లాలో వినిపిస్తోంది. అఖిల కూడా ఈ విషయంపై ఆవేదన చెందుతున్నట్టు సమాచారం.

దొంగ ఓట్లూ పోయె.. పరువూ పాయె!

ఇరకాటంలో టీడీపీ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిస్థితి

- ఎన్‌ఆర్‌ఐలు, గ్రానైట్ వ్యాపారులు సమకూర్చిన నల్లధనంతో ఎన్నికల అక్రమాలు
- కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించిన పోలీసులు
- నల్లధనం వ్యవహారాలు వెలుగు చూస్తాయని అనుచరుల్లో భయం
- ఏలూరి అక్రమాల్లో ఇరుక్క పోయామని ఆందోళన



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అడ్డూ అదుపూ లేకుండా అవకాశమున్న మేర అక్రమాలకు తెగబడితే ఏదో రోజు పట్టుబడి ఇట్టే ఇరుక్కు పోవడం ఖాయమన్న విషయం ఇప్పుడు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అవగతమైంది. తన నోవా అగ్రిటెక్ కంపెనీ మాటున ఎన్ఆర్ఐ, గ్రానైట్ నల్లధనంతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏలూరి, ఆయన అనుచరులపైనా పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ జరిగితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. దీంతో ఏలూరి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుక చందంగా మారింది. ఆయనకు నల్లధనం అందించిన ఆయన అనుచరులు బెంబేలెత్తి పోతున్నారు. కేసుల నమోదుతో ఎమ్మెల్యే వ్యవహారం పర్చూరుతో పాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

డైరీల్లో నిధుల వివరాలు!

ఈ నెల 24న గుంటూరులో ఏలూరికి చెందిన నోవా అగ్రిటెక్ కార్యాలయంలో ఆర్‌డీఐ జరిపిన తనిఖీల్లో ఆయన ఖాతాలకు చేరిన నల్లధనం చిట్టాతోపాటు గత ఎన్నికల్లో పాల్పడిన అక్రమాల వ్యవహారం వెలుగుచూసింది. దీంతో ఇంకొల్లు పోలీసులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు ఆయన కంపెనీ ఉద్యోగులపైనా 123(1), ఐపీసీ సెక్షన్ 171(ఇ) రెడ్ విత్ 120(బి), సీఆర్‌పీసీ 155 (2) ల ప్రకారం కేసులు నమోదు చేసి లోతైన విచారణకు దిగారు. ఈ విచారణలో ఎమ్మెల్యే ఏలూరికి పెద్దఎత్తున నిధులు సమకూర్చే ఎన్ఆర్ఐలు, నియోజకవర్గంలోని గ్రానైట్ వ్యాపారుల అక్రమార్జన బయటపడే అవకాశం ఉంది. ఏలూరి కార్యాలయంలో దొరికిన డైరీల్లో ఆయనకు తరలివచ్చే నిధుల వివరాలు ఉన్నట్లు తెలిసింది. ఆయన అకౌంట్లకు వచ్చిన నిధులపైనా, గ్రానైట్ పరిశ్రమల ముడుపులపైనా పోలీసులు విచారణ జరపనున్నారు. సాక్షాత్తూ ఎమ్మెల్యే, ఆయన కంపెనీ ప్రధాన ఉద్యోగులపై కేసులు నమోదు కావడంతో ఏలూరికి నిధులు సమకూర్చే ఎన్ఆర్ఐలు, గ్రానైట్ వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. నిధుల వ్యవహారాలు బయటకు పొక్కితే మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. నిధులు ఇచ్చే ఎన్ఆర్ఐల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఎన్ఆర్ఐలు అధికంగా ఉన్న గ్రామాలతోపాటు వారు ఉన్న దేశాలు, బ్యాంకు అకౌంట్ల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దీంతోపాటు నియోజకవర్గంలోని మార్టూరు ప్రాంతంలో 250కి పైగా ఉన్న గ్రానైట్ పరిశ్రమలపైనా పోలీసులు విచారణకు దిగనున్నారు. గ్రానైట్ అసోసియేషన్ల నుంచి ఏలూరికి ముట్టిన ముడుపుల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆయనకు అతి సన్నిహితంగా ఉన్న గ్రానైట్ వ్యాపారుల బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలిస్తారు. ఏలూరి ఖాతాలకు, ఆయన నోవా అగ్రిటెక్ బ్యాంకు ఖాతాలకు వచ్చిన నిధుల వివరాలపైనా విచారణ జరుపుతారు. ఈ విచారణ పూర్తయిన తర్వాత వచ్చిన నల్లధనం వివరాలను బట్టి ఆయా వ్యక్తులపైనా కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

దొంగ ఓట్లతోనే రెండు సార్లు గెలుపు!

ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా ఏలూరి నియోజకవర్గ వ్యాప్తంగా 15 వేలకు మించి దొంగ ఓట్లను చేర్పించారు. ఇక్కడి వారికి చాలామందికి ఈ నియోజకవర్గంలోనే రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో వారంతా పోలింగ్ నాడు పథకం ప్రకారం ఓట్లు వేయడం పరిపాటి. దొంగ ఓట్లు వేసేందుకు ఏలూరి ప్రత్యేక బ్యాచ్‌లనూ ఎంపిక చేస్తారు. నల్లధనంతో కోట్లు ఖర్చు చేసి అక్రమాలకు తెరలేపుతారు. ఓటుకు రూ.2 వేల నుంచి 5 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేసిన ఉదాహరణలూ కోకొల్లలు. విపరీతంగా వచ్చిపడుతున్న అక్రమార్జన నిధులను వెచ్చించి ఎన్నికల అక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ఆయనకు పరిపాటిగా మారింది. దీంతో ఆయన గత రెండు ఎన్నికల్లోనూ గెలుపొందారు. 2014 ఎన్నికల్లో సుమారు 10,775 ఓట్ల ఆధిక్యంతో, 2019 ఎన్నికల్లో కేవలం 1647 ఓట్ల మెజార్టీతో గెలిచారు. దొంగ ఓట్లు లేకపోతే ఈ నియోజకవర్గంలో ఏలూరి గెలిచే అవకాశమే లేదన్నది ఓట్ల గణాంకాలు చూస్తే తెలిసిపోతుంది. పర్చూరు నియోజకవర్గంలో దొంగ ఓట్లపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎన్నికల అధికారులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణకు దిగిన అధికారులు నియోజకవర్గంలోని సుమారు 12 వేలదొంగ ఓట్లను తొలగించారు. దొంగ ఓట్ల తొలగింపును అడ్డుకునేందుకు ఏలూరి కోర్టును సైతం ఆశ్రయించినా అది వీలుకాలేదు.

పార్ట్‌టైం పొలిటీషియన్లు

- ఎన్నికల వేళ ప్రత్యక్షం
- బీఫాం తీసుకునే ముందు హడావుడి
- ఓడినా..గెలిచినా నియోజకవర్గ ప్రజలను పట్టించుకోరు
- టీడీపీ అంటే 'టెంపరరీ డెలిగేట్స్ ఇన్ పార్టీ'అంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో అధికార వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లోనే ఉండగా, ప్రధాన ప్రతిపక్ష టీడీపీ నేతలు ఎన్నికల ముందు మాత్రమే హడావుడి చేసే నాయకులుగా మిగిలారు. ప్రధానంగా గత రెండున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతలు పార్టీ అధిష్టానం నిర్దేశించిన పలు కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి గడపనూ సందర్శించారు. సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని ఆరా తీశారు. సమస్యలేమైనా ఉంటే తెలుసుకుని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అదే ప్రతిపక్ష టీడీపీలో ఎమ్మెల్యేలు, కొందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల వేళ కనిపించడం, బీఫాం తీసుకునే వరకు హడావుడి చేయడం, ఫలితాల అనంతరం.. గెలిచినా, ఓడినా పత్తా లేకుండా పోవడంతో 'పార్ట్ టైం పొలిటీషియన్లు'గా ముద్ర వేసుకున్నారు. మరికొందరైతే సీజన్‌లో వచ్చిపోయే వలస పక్షులేనంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. వీరికి ప్రజాసేవ కన్నా సొంత కార్యకలాపాలే ముఖ్యం. దీంతో టీడీపీ అంటే 'టెంపరరీ డెలిగేట్స్ ఇన్ పార్టీ'గా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అస్మిత్‌రెడ్డి కేరాఫ్ హైదరాబాద్



తాడిపత్రిలో తెలుగుదేశం పార్టీ నుంచి జేసీ అస్మిత్‌రెడ్డి 2019లో పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఆరు మాసాలకోసారి తాడిపత్రికి వచ్చిపోవడం తప్ప, ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు నియోజకవర్గంలోకి వచ్చి ఊరూరా కలియదిరుగుతున్నారు.

బాలయ్యా.. ఏడాదికోసారైనా రావయ్యా



హిందూపురం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ ఏడాదికోసారి వస్తే చాలా గొప్ప అని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ఎన్టీయార్ మీద ప్రేమతో బాలయ్యను గెలిపిస్తే ఆయన ఇక్కడకు ఎప్పుడూ రావడం లేదు. ఇక్కడ ఆయన పీఏలదే పెత్తనమని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఎప్పుడైనా వస్తే.. రెండ్రోజులు హడావుడి చేయడం, ఎన్నికల సమయంలో భార్యతో ప్రచారం చేయించడం, ఆ తర్వాత షూటింగులతో బిజీ అవడం పరిపాటిగా మారిందని విమర్శిస్తున్నారు.

ప్రజలకు దూరంగా పయ్యావుల



ఉరవకొండ నుంచి గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నియోజకవర్గంలో చాలా అరుదుగా కనిపిస్తారని ప్రజల మాట. ఆయన ఎన్నికల ముందే వస్తారని, ఎక్కువగా హైదరాబాద్‌లో ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఆయన సోదరుడు శీనయ్య ఇక్కడ పెత్తనం చేస్తారని, కేశవ్ అంతగా రారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. పీఏసీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ ఈయన్ని నియోజకవర్గంలో 'పార్ట్ టైమ్ పొలిటీషియన్'గానే జనాలు పరిగణిస్తున్నారు.

హమ్మయ్య.. సూరికి ధర్మవరం గుర్తుకొచ్చింది



ఎప్పుడు కనిపించినా మందీ మార్బలంతో హడావుడి చేసే వరదాపురం సూరి ఈసారీ అదే చేస్తున్నారు. 2019లో ధర్మవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి.. ఓడిపోయాక బీజేపీలో చేరిన ఈయన పత్తా లేకుండా పోయారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ ఫ్లెక్సీలతో మళ్లీ ప్రత్యక్షమయ్యారు. ప్రస్తుతం సూరి.. ధర్మవరంలో చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. అసలు ఈయన బీజేపీలో ఉన్నారా? టీడీపీలో ఉన్నారా? అన్న ధర్మసందేహంలో ధర్మవరం నియోజకవర్గ ప్రజలు సతమతమవుతున్నారు.

నేడు త్రిసభ్య కమిటీ భేటీ

- ఉమ్మడి ప్రాజెక్టులు బోర్డుకు అప్పగింతపై విధి విధానాల రూపకల్పనే అజెండా

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన నాగార్జునసాగర్, శ్రీశైలంలో ఏపీ పరిధిలోని 6, తెలంగాణలోని 9 అవుట్‌లెట్లను కృష్ణా బోర్డుకు అప్పగించే విధి విధానాలను రూపొందించడమే అజెండాగా ఫిబ్రవరి 1న (నేడు) త్రిసభ్య కమిటీ సమావేశాన్ని బోర్డు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు త్రిసభ్య కమిటీలో సభ్యులైన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు ఇప్పటికే కృష్ణా బోర్డు లేఖ రాసింది. సీఆర్పీఎఫ్ పోలీసుల పహారాలో నాగార్జున సాగర్‌ను నిర్వహిస్తున్నామని.. తమ అనుమతి తీసుకోకుండా ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లొద్దని రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు లేఖలో బోర్డు సూచించింది. నాగార్జున సాగర్‌కు అత్యవసరంగా ఏవైనా మరమ్మతు పనులు చేపట్టాలంటే బోర్డు నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచుగా వివాదాలకు దారితీస్తున్న శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డు అధీనంలోకి తెచ్చి, నిర్వహించడం ద్వారా వాటికి చెక్ పెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే డిసెంబర్ 17న ఢిల్లీలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశంలో ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. దాంతో ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింత విధి విధానాలను త్రిసభ్య కమిటీ వారంలోగా అంటే డిసెంబర్ 24లోగా ఖరారు చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ ఆదేశించింది. ఆ తర్వాత ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను బోర్డుకు అప్పగిస్తామని స్పష్టం చేసింది. కానీ.. హైదరాబాద్‌కు చేరుకోగానే తెలంగాణ అధికారులు.. ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు తాము అంగీకరించలేదంటూ మాటమార్చారు.

ముద్దనూరులో టీడీపీ మూక దాడి

- దౌర్జన్యంగా వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంట్లోకి చొరబడి కారు అద్దాలు ధ్వంసం
- జమ్మలమడుగు ఎమ్మెల్యే కార్యకర్తలతో చర్చిస్తుండగా ఘటన
- రోడ్డుపై బైఠాయించి రాళ్ళు రువ్విన టీడీపీ శ్రేణులు
- దగ్గరుండి రెచ్చగొట్టిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి
- భారీగా మోహరించిన పోలీసులు



టీడీపీ వర్గీయులను అదుపుచేస్తున్న పోలీసులు

ముద్దనూరు: వైఎస్సార్ కడప జిల్లాలో టీడీపీ మూకలు చెలరేగిపోయాయి. దౌర్జన్యంగా వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లోకి టీడీపీ శ్రేణులు చొరబడి కారు అద్దాలను ధ్వంసం చేశారు. ముద్దనూరులో బుధవారం జరిగిన ఈ సంఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిరాజారెడ్డి ఇంట్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యకర్తలతో చర్చిస్తుండగా ఒక్కసారిగా తెలుగుదేశం నేతలు ఇంటిపై దాడి చేశారు. బయట నిలిచి ఉన్న కారుపై రాళ్లతో దాడి చేయడంతో కారు అద్దాలు పగిలిపోయాయి. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమీప బంధువు కుడుముల శశిధర్‌రెడ్డి టీడీపీలో చేరారు. ఈ విషయంపై తన సోదరుడైన శశిధర్‌రెడ్డితో కలిసి అతని ఇంటి పక్కనే ఉన్న మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి ఉదయం నుంచి చర్చిస్తున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా అక్కడికి చేరుకున్నారు. శశిధర్‌రెడ్డితో వారు చర్చిస్తున్న విషయం తెలుసుకున్న మండలంలోని కొంతమంది టీడీపీ నాయకులు శశిధర్‌రెడ్డి ఇంటిపై దండెత్తి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.

భారీ సంఖ్యలో టీడీపీ మూకలు దాడి

ఇది జరుగుతుండగానే టీడీపీ మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలు భారీ సంఖ్యలో తమ వర్గీయులతో అక్కడకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుకుంటున్నా లెక్కచేయకుండా ప్రధాన రహదారిలో బైఠాయించి రాళ్లు రువ్వారు. అనంతరం రహదారిపై శివనాథరెడ్డి, భూపేష్‌రెడ్డిలు తమ అనుచరులతో సుమారు అరగంట పాటు వైసీపీ నాయకులపై నిరసనలు చేశారు. శశిధర్‌రెడ్డి ఇంటిలో ఉన్న ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రెచ్చగొట్టారు. చివరికి పరిస్థితులు చేయిజారిపోతున్న తరుణంలో ఎమ్మెల్యే బయటకు రాకుండా పోలీసులు మోహరించారు. భారీ సంఖ్యలో పోలీసు బలగాలు ముద్దనూరుకు చేరుకుని టీడీపీ శ్రేణులను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బయటకు వచ్చి మాట్లాడారు. టీడీపీ నాయకుల దౌర్జన్యానికి తాను భయపడబోనన్నారు. బంధువులతో చర్చలు జరుపుతున్న సమయంలో ఇంటిపై దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. పోలీసు స్టేషన్ నుంచే టీడీపీ వర్గీయులు ఈలలు, కేకలతో మరోసారి రెచ్చిపోయారు. సుమారు అరగంటకుపైగా టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే మేనమామ ఇంటి దగ్గరకు చేరుకుని రాళ్లు రువ్వడం, రహదారిపై బైఠాయించడం పోలీసుల నిర్లక్ష్యమేనని స్థానికులు విమర్శిస్తున్నారు.

నేతలు కం'ట్రోల్ కాక'

టీడీపీకి సోషల్ మీడియా తలనొప్పి

- 'కోటంరెడ్డి రాసలీలలు' అంటూ వాయిస్ వైరల్
- అజీజ్ వర్గం పనేనన్న భావనలో కోటంరెడ్డి
- కోటంరెడ్డి, అజీజ్‌ల మధ్య రగులుతున్న విభేదాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికలు కూతవేటు దూరంలో ఉన్న తరుణంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వర్గపోరుతో టీడీపీకి తలబొప్పి కడుతోంది. తాజాగా ఆ పార్టీలో ఇద్దరి మధ్య సోషల్ మీడియాలో ట్రోలింగ్ వార్ నడుస్తోంది. గత ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి బరిలోకి దిగి ఓటమి పాలైన అబ్దుల్ అజీజ్ ఈ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి టీడీపీ టికెట్ వస్తుందనే సమాచారంతో అజీజ్ రగిలిపోతున్నారు. వాస్తవానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అవినీతి, అరాచకాలపై టీడీపీ నేత అబ్దుల్ అజీజ్ గతంలో పలుమార్లు ప్రెస్‌మీట్లలో గళమెత్తారు. తాజాగా 'కోటంరెడ్డి రాసలీలలు' అంటూ వాయిస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఇదంతా టీడీపీలోని కోటంరెడ్డి వ్యతిరేకులే ట్రోల్ చేయిస్తున్నారనే ప్రచారం రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. కోటంరెడ్డి వర్గం కూడా రగిలిపోతోంది.

నమ్ముకుంటే నట్టేట ముంచారు

టీడీపీని నమ్ముకున్న మైనార్టీ నేతను అధిష్టానం నట్టేట ముంచింది. నెల్లూరులో టీడీపీని నాలుగేళ్లుగా భుజాన వేసుకుని అబ్దుల్ అజీజ్ ముందుకు నడిపిస్తున్నారు. గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ శక్తికి మించి పనిచేశారు. ఆయన అనుచరులపై కొందరు దాడులు చేసి, హత్యాయత్నాలు చేయించారు. అలాగే ఆయన ఆర్థిక మూలాలపై దెబ్బతీసి కోలుకోలేని విధంగా చేశారు. అన్నింటినీ భరించి పార్టీ జెండా మోసిన అజీజ్‌కు పార్టీ ఎక్కడా టికెట్ ఇస్తానని చెప్పలేదు. మరోవైపు ఎవరైతే ఆయనను ముప్పతిప్పలు పెట్టారో ఆ నేతనే పార్టీలోకి ఆహ్వానించి జైకొట్టింది టీడీపీ. ఇదంతా జీర్ణించుకోలేని అజీజ్ వర్గం లోలోన మథనపడుతోంది.

శభాష్... మల్లేశం

చార్జింగ్ బైక్ తయారుచేసిన గ్రామీణ ఎలక్ట్రీషియన్

చెన్నారావుపేట: తనమదిలో మెదిలిన ఆలోచనతో ఓ గ్రామీణ ఎలక్ట్రీషియన్ బ్యాటరీతో నడిచే ద్విచక్ర వాహనాన్ని తయారు చేశారు. మూడు గంటల చార్జింగ్‌తో 60 కిలోమీటర్లు ప్రయాణించేలా బైక్ తయారు చేసి ఔరా అనిపించాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురానికి చెందిన అనుమాండ్ల మల్లేశం ఎలక్ట్రీషియన్. వైండింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక స్థోమత కారణంగా బ్యాటరీ బైక్ కొనలేక తానే ఓ బైక్ తయారు చేయాలనుకున్నాడు. ఆలోచన వచ్చిన వెంటనే రూ.3,500తో బజాజ్ 100సీసీ పాత బైక్‌ను కొనుగోలు చేశాడు. దాని ఇంజన్‌ను తొలగించి, రూ.35 వేలతో కొనుగోలు చేసిన 48 వాట్స్, 750 ఓల్టేజీ లిథియం బ్యాటరీని అమర్చాడు. దానికి అనుసంధానంగా రూ.15 వేలతో కొనుగోలు చేసిన 759 వాట్ల మోటార్, కంట్రోలర్లను అమర్చాడు. అనంతరం విద్యుత్ చార్జింగ్ పెట్టి బైక్‌ను నడిపించాడు. ఈ వాహనం తయారు చేయడానికి రెండు నెలల సమయం పట్టిందని, తయారీకి రూ 53,500 ఖర్చు అయిందన్నారు. మూడు గంటలు చార్జింగ్ పెడితే 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 1-2-2024



● తాడేపల్లి సుబ్బలక్ష్మి, గాయని, వయొలిన్ విద్వాంసురాలు

స్వరవీణ

**ఏడు పదులు దాటిన వయసు.
ఆరు దశాబ్దాలు దాటిన సంగీత సాధన.
దేశవిదేశాలకు విస్తరించిన ప్రతిభ.
సంగీతాన్నే శ్వాసించాలన్న అభిలాష.
ప్రచారానికి దూరంగా పరిమళిస్తున్న స్వరం.
ఇది... తాడేపల్లి సుబ్బలక్ష్మి స్వర ప్రస్థానం.**

ఇంట్లోకి అడుగుపెట్టగానే సోఫా కార్నర్‌లో త్యాగయ్య విగ్రహం అతిథులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉంటుంది. అదే గదిలో మరోదిక్కున వీణాపాణియైన సరస్వతీ మాత పాదాల చెంత తంబుర మీటుతున్న త్యాగరాజు, కామధేనువు నిత్యపూజలందుకుంటున్న దృశ్యం ఆకట్టుకుంటుంది. ''పుష్యమాసం బహుళ పంచమి త్యాగరాజు సిద్ధి పొందిన రోజు. తమిళనాడులో ఆరాధనోత్సవాలు మొదలయ్యాయి'' అంటూ సంతోషం నిండిన స్వరంతో తన సంగీత ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు తాడేపల్లి సుబ్బలక్ష్మి.

''మాది విజయవాడ. మా పెదనాన్న కొమ్ము వెంకటాచల భాగవతార్ హరికథకులు. కళల నిలయమైన ఇంట్లో పుట్టాను. ఆరవ ఏటనే నా సంగీత సాధన మొదలైంది. ఆకెళ్ల మల్లికార్జున శర్మ, కోటిపల్లి ప్రకాశరావులు నా వయొలిన్ గురువులు. విజయవాడ సత్యనారాయణపురంలో 'ప్రభుత్వ సంగీత కళాశాల' పెట్టారు. పదేళ్లకు ఆ కాలేజ్‌లో చేరాను. మంగళంపల్లి బాలమురళీకృష్ణ మా ప్రిన్సిపల్. ఆ తర్వాత నేదునూరి కృష్ణమూర్తిగారు కూడా. ఆరేళ్లపాటు సాధన చేసి వయొలిన్ లో సర్టిఫికేట్ కోర్సు, డిప్లమో చేశాను. ప్రైవేట్‌గా వోకల్ కోర్సు కూడా చేశాను. డిప్లమో అందుకోవడం ఆ వెంటనే పెళ్లి. అబ్బాయిని వెతుక్కోవాల్సిన పని పడలేదు. మా వారు ఉమాశంకర్ నా క్లాస్‌మేట్. జీవితాన్ని పంచుకున్నాం. సంగీత విద్వాంసులుగా వందలాది వేదికలను పంచుకున్నాం. సంగీత సాగరంలో మా జ్ఞానాన్వేషణ కొనసాగుతోంది.

సంగీత గురువు

సంగీత గురువుగా నా బాధ్యత 1985లో మొదలైంది. జవహర్ బాలభవన్‌లో వయొలిన్ ఇన్‌స్ట్రక్టర్‌గా చేరాను. ఆ తర్వాత నేను చదివిన కాలేజ్‌లోనే 'గాయక్ అసిస్టెంట్'గా చేరాను. వేదికల మీద గాత్ర సహకారం, వయొలిన్ సహకారం రెండూ చేయగలగడంతో అనేకమంది ప్రముఖులతో వేదిక పంచుకునే అవకాశం వచ్చింది. ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి శోభానాయుడుకి గాత్ర సహకారం, ప్రముఖ గాయని శోభారాజ్‌కి వయొలిన్ సహకారం అందించాను. అలేఖ్య పుంజల, భాగవతుల సేతురామ్, ఆనంద్ శంకర్, మంజులా రామస్వామి, ఉమారామారావు, వాసిరెడ్డి కనకదుర్గ వంటి గొప్పవారితో నా సరిగమల, స్వర రాగాల ప్రయాణం సాగింది. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత సంగీత సేవ విస్తృతంగా చేయడానికి నాకు అవకాశాలు వచ్చాయి. దూరదర్శన్, భక్తి చానెల్, ఎస్‌వీబీసీ – నాద నీరాజనంతోపాటు ఇతర దేవాలయాల్లో లెక్కకు మించిన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఐసీసీఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్) నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సింగపూర్, టర్కీ, లెబనాన్, సౌత్ ఆఫ్రికా, శ్రీలంక, అబుదాబి వంటి దేశాల్లో కచేరీలు చేయగలిగాను. ఎన్టీఆర్‌గారు కళలను అభిమానించేవారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాదాపుగా ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ ప్రారంభగీతం ఆలపించాను. గవర్నర్ రంగరాజన్‌గారి హయాంలో గవర్నర్ బంగ్లాలో అప్పటి రాష్ట్రపతి కే ఆర్ నారాయణన్ గౌరవార్థం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భక్తి సంగీతం ఆలపించడం వంటి ఎన్నో సంతోషాలను సంగీత సరస్వతి నాకిచ్చింది. నా వయసు 74. ఆరు దశాబ్దాలు దాటిన సంగీత సాధనను ఒకసారి సింహావలోకనం చేసుకుంటే నాకు ముచ్చటగా అనిపించే సందర్భం జూనియర్ ఎన్టీఆర్ నాట్యప్రదర్శన. మద్రాసు (చెన్నై)లో జరిగిన ఆ కార్యక్రమానికి సంగీత సహకారం అందించాను. ఆ పిల్లవాడు చాలా మంచి డాన్సర్.

నిరంతర గాన వాహిని

నేను మ్యూజిక్ కాలేజ్ నుంచి రిటైర్ అయ్యేటప్పటికి ప్రభుత్వ ఉద్యోగం నుంచి మా వారు కూడా రిటైర్ అయి ఉన్నారు. ఇద్దరం కలిసి 'వాగ్దేవి సంగీత విద్యాలయం' పేరుతో సంగీత పాఠశాలను స్థాపించాం. పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి డెబ్బైమందికి పైగా విద్యార్థులను పరీక్షలకు పంపించాం. నా స్టూడెంట్స్ కెనడా, యూఎస్, సింగపూర్‌లలో మ్యూజిక్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. ఈ తరం బాల్యం చాలా చురుగ్గా ఉంటోంది. పిల్లల్లో గ్రహణ శక్తి చాలా మెండుగా ఉంది. త్వరగా నేర్చుకుంటున్నారు. అందుకు టెక్నాలజీ కూడా బాగా ఉపయోగపడుతోంది. అప్పట్లో మాకు గురువు పాడి వినిపించిన పాటను ఇంట్లో సాధన చేసేటప్పుడు ఏదైనా సందేహం వస్తే, మరునాడు క్లాస్‌లో నివృత్తి చేసుకోవాల్సిందే. ఇప్పుడలా కాదు, గురువు పాడేటప్పుడే రికార్డ్ చేసుకుని మళ్లీ మళ్లీ వింటూ నేర్చుకుంటున్నారు. కానీ సంగీతంలో కొనసాగేవాళ్లు తక్కువ. మూడేళ్లపాటు బాగా నేర్చుకున్న తర్వాత టెన్త్‌క్లాస్‌కు వచ్చారని, ఇంటర్‌మీడియట్ కూడా కీలకం కాబట్టి పూర్తి సమయం చదువుల కోసమే కేటాయించాలనే ఉద్దేశంతో సంగీతసాధనకు దూరమవుతున్నారు. మా రోజుల్లో సంగీతమే అసలు చదువుగా ఉండేది. నేను ప్రైవేట్‌గా మెట్రిక్యులేషన్ పూర్తి చేశాను. తమిళులు మాత్రం ఉన్నత చదువులు చదువుతూ సంగీతాన్ని కూడా కొనసాగిస్తుంటారు. మన తెలుగు వాళ్లలో ప్రతిభ ఉంది. అయితే అంకితభావమే తక్కువ. ఉపాధికి భరోసా ఉంటే ఈ కళను కెరీర్‌గా ఎంచుకునే వాళ్ల సంఖ్య పెరుగుతుంది. నాకనిపించేదేమిటంటే... పిల్లలకు స్కూల్ దశలోనే సంగీతం, నాట్యం వంటి కళల కోసం ఒక క్లాసు ఉంటే బాల్యంలోనే కళలు పరిచయమవుతాయి. కళాసాధనతో వచ్చే క్రమశిక్షణ వారిలో దుడుకుతనాన్ని తగ్గించి ఒద్దిక నేర్పుతుంది. పిల్లలు మంచి పౌరులుగా ఎదగడానికి పరోక్షంగా దోహదం చేస్తుంది. కాబట్టి పాఠశాల విద్యలో సంగీత, నాట్యాలను సిలబస్‌గా పెట్టే విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి'' అని ఆశాభావం వ్యక్తం చేశారు తాడేపల్లి సుబ్బలక్ష్మి.



● అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుబ్బులక్ష్మి

సుబ్బలక్ష్మి మంచి టీచర్

ఇది నేను సంపాదించుకున్న బిరుదు. ఇప్పటికీ రోజుకు రెండు గంటల పాటు కదలకుండా కూర్చుని సాధన చేస్తాను. పిల్లల చేత సాధన చేయిస్తాను. ఇంట్లో సంగీతపాఠాలు చెప్పే టీచర్లు కొందరు పిల్లలను తాళం వేయమని చెప్పి తాము వంట చేసుకుంటూ ఒక చెవి ఒగ్గి గమనిస్తుంటారు. టీచర్ ఎదురుగా ఉంటేనే క్రమశిక్షణ అలవడుతుందని నా విశ్వాసం. సంగీతం అంటే సరిగమలు పలకడం మాత్రమే కాదు. ఆత్మతో మమేకం కావాలి. సంగీత సాధన పట్ల పిల్లల్లో ఆసక్తిని, ఇష్టాన్ని కలిగించినప్పుడే గురువుగా మేము ఉత్తీర్ణత సాధించినట్లు. అలాగే కళ కోసం జీవించడంలో ఉండే సంతృప్తి జీవితాన్ని పరిపూర్ణం చేస్తుంది. నా యూట్యూబ్ చానెల్ 'తిల్లానా' కోసం పాటలు పాడి రికార్డ్ చేస్తున్నాను. భగవంతుడు ఒక నైపుణ్యాన్ని ఇస్తాడు, దానిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉంటుంది.

- తాడేపల్లి సుబ్బలక్ష్మి,
గాయని, వయొలిన్ విద్వాంసురాలు



– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: **నోముల రాజేశ్ రెడ్డి**



BUDGET 2024
ఉమెన్ పవర్‌కు ఊతం ఇచ్చేలా...

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్ గురించి గత వారం రోజుల నుంచి 'ఈసారి కూడా పేపర్‌లెస్ బడ్జెటే' అనే విశేషంతో పాటు ఫైనాన్స్ బిల్లులు, కేటాయింపులు, స్మార్ట్ ఫోన్ పరికరాలపై దిగుమతి సుంకాలు, వాయుకాలుష్యం తగ్గించడానికి ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడానికి ఏంచేయబోతున్నారు... ఇలా రకరకాల విషయాలపై ఊహాగానాలు, చర్చలు జరిగాయి.

వ్యాపార రంగంలో మహిళ వ్యాపారవేత్తలు సత్తా చాటుతున్న కాలం ఇది.

వారి అడుగులను మరింత వేగవంతం చేయడానికి ఈ బడ్జెట్‌లో ఏం చేయబోతున్నారు?

మహిళల్లో నైపుణ్యాభివృద్ధికి ఎలాంటి కార్యాచరణ ఉండబోతోంది?

ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ప్రోత్సాహకాలు, రాయితీలు అందనున్నాయి... ఇలాంటి ప్రశ్నలెన్నో బడ్జెట్ నేపథ్యంలో మదిలో మెదులుతాయి.

'మహిళలకు సంబంధించి బడ్జెట్ 2024 ఎలా ఉండాలి?' అనే దానిపై కొందరు ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల అభిప్రాయాలు...

ప్రత్యేక నిధి



గత అయిదేళ్లలో మన దేశంలో మహిళల యాజమాన్యంలోని వ్యాపారాలు 20 శాతానికి పైగా పెరిగాయి. రాబోయే అయిదేళ్లలో 90 శాతం వరకు పెరుగుతాయని అంచనా. ఎన్నో నగరాల్లో మహిళా వ్యాపారుల ప్రతిభాసామర్థ్యాలను ప్రత్యక్షంగా చూశాను. ఇలాంటి వారికి 2024 బడ్జెట్ ఫండింగ్, మౌలిక సదుపాయాల విషయంలో వెన్నుదన్నుగా నిలవాలి. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల ఉండాలి.

-స్వాతి భార్గవ, కో–ఫౌండర్, క్యాష్ కరో

మహిళా శ్రేయస్సు



మహిళల హెల్త్‌కేర్ బ్రాండ్ వ్యవస్థాపకురాలిగా మహిళల శ్రేయస్సుకు 2024 బడ్జెట్ దోహదకారి కావాలని కోరుకుంటున్నాను. స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్‌కేర్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లలో మహిళలు రాణించేందుకు, వారికి సాధికారత కల్పించేందుకు బడ్జెట్ ఉపయోగపడాలని ఆశిస్తున్నాను.

- రచనా గుప్తా, కో–ఫౌండర్, జినోవేద

గేమ్ చేంజర్‌గా...



మహిళలు నిర్వహించే వ్యాపారాలను ముందుకు నడిపించే గేమ్‌చేంజర్‌గా ఈ బడ్జెట్ ఉండాలని ఆశిస్తున్నాను. రుణ ప్రక్రియను సరళతరం చేయాలి. మహిళల నేతృత్వంలోని వ్యాపారాల్లో వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులను ప్రోత్సహించాలి. నిధుల అంతరాన్ని పూడ్చాలి. గ్రాంట్లు, సబ్సిడీలు, పన్ను మినహాయింపుల రూపంలో ఆర్థిక ప్రోత్సాహకాల కోసం ఎదురు చూస్తున్నాం. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల వ్యాపార చతురత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా కార్యక్రమాల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు అవసరం. మహిళలకు సంక్షేమ పథకాలు అందే విషయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయాలి. మాటలు కాదు కార్యాచరణ కనిపించాలి. 'ఇది కొత్త బడ్జెట్' అనిపించాలి.

- సోమ్‌దత్తా సింగ్, ఇ–కామర్స్ ఎంటర్ ప్రెన్యూర్, ఏంజెల్ ఇన్వెస్టర్, రైటర్

మరిన్ని పొదుపు పథకాలు



గ్రామీణ సమాజంలోని మహిళల కోసం మరిన్ని పొదుపు పథకాలను రూపొందిస్తారని ఆశిస్తున్నాను. వడ్డీ లేని రుణాలను ప్రవేశ పెట్టాలి. మహిళల నేతృత్వంలోని సంస్థల అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ ఉండాలి. మహిళలకు సంబంధించి ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌కు ప్రోత్సాహం అందేలా, స్కిల్ బిల్డింగ్‌కు ప్రయోజనం చేకూర్చే పథకాలను ప్రవేశపెట్టాలని ఆశిస్తున్నాను. స్కిల్ గ్యాప్స్ లేకుండా ఉండడానికి మహిళల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలి. కృత్రిమ మేధ ఆధారిత రంగాలలో మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

- ఉపాసన టకు, కో ఫౌండర్–మొబిక్విక్

ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదిగేలా...



పన్నెండవ తరగతి తరువాత యువతులకు నైపుణ్యశిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. 'మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం' అని ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. వ్యవసాయరంగంలో ఉన్న మహిళలపై దృష్టి సారించాలి. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మన దేశ లక్ష్యం నెరవేరేలా వివిధ రంగాల మహిళలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.

- జ్యోతీ బండారీ, లోవక్ క్యాపిటల్ ఫౌండర్, సీయివో

బాలికల విద్యకు ప్రాధాన్యత



రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన అలవెన్స్ పెంచాలి. ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు సంబంధించి ఎడ్యుకేషనల్ బెనిఫిట్స్‌ను పెంచాలి.

- రాధిక దాల్మియ, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (కోల్కతా చాప్టర్)– ఛైర్‌పర్సన్

మహిళా రైతుల కోసం...



బడ్జెట్‌లో మహిళా రైతులు, కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యానికి గుర్తింపు ఇచ్చే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాయితీల ద్వారా మహిళా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా ప్రోత్సాహకాలు అందించాలి.

- ధనశ్రీ మంథానీ, సలాం కిసాన్–ఫౌండర్

ఫ్యూచర్ రెడీ స్కిల్స్



'ఫ్యూచర్ రెడీ' స్కిల్స్ కోసం మహిళలను సన్నద్ధం చేసే కార్యాచరణను రూపొందించాలి. మహిళల నైపుణ్య శిక్షణకు సంబంధించి పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు ఇవ్వాలి. స్కిల్ డెవలప్‌మెంట్ వల్ల కెరీర్ బ్రేక్ తీసుకున్న మహిళలు తిరిగి ఉద్యోగాలు చేయడానికి అవకాశం ఉంటుంది.

- నేహా బగారియా,
ఫౌండర్– జాబ్స్ ఫర్ హర్



జంక్ ఫుడ్‌ని మాన్పిద్దాం ఇలా...

పీజా, బర్గర్, శాండ్‌విచ్, కూల్ డ్రింక్స్ లాంటి జంక్ ఫుడ్స్‌కు అలవాటుపడిన పిల్లలు ఇంట్లో చేసిన ఆహార పదార్థాలు తినడానికి ఇష్టపడరు. రోజూ జంక్‌ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది. ఇది పట్టని పిల్లలు అదే కావాలని మొండికేస్తుంటారు. ఇటువంటి వారిని జంక్‌ఫుడ్‌ని దూరంగా ఉంచాలంటే ఇలా చేయండి చాలు...

ఇష్టమైనవి వండండి: జంక్‌ఫుడ్ పూర్తిగా మాన్పించాలంటే ... ముందుగా పిల్లలు బాగా ఇష్టపడే వంటకాలను వండాలి. పిల్లలు ఏది తినడానికి ఆసక్తి చూపుతున్నారో అవి మాత్రమే వారికి చేసిపెట్టాలి. పెద్దలు తినేదే రోజు పెడితే అది నచ్చక బయట ఫుడ్‌కి అలవాటు పడతారు. ఇంట్లో ఫుడ్ మొహం మొత్తకుండా ఉండాలంటే పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు ఉపయోగించి బర్గర్స్, పిజ్జాలను ఇంట్లోనే తయారు చేసి పెట్టాలి.

అలవాట్లు: వీలైనంత త్వరగా పిల్లల ఆహారపు అలవాట్లు మార్చాలి. అలవాట్లు మార్చుకోకపోతే జంక్‌ఫుడ్ మానరు. మీరు చేసే ఫుడ్ వల్ల ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో వివరిస్తూ, బుజ్జగిస్తూ చెబితే బయట తినే అలవాటును మానుకుంటారు.

పోషకాల గురించి వివరించాలి: ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయాల్లో పిల్లలకు పెట్టే రకరకాల డిష్‌లను వేటితో తయారు చేశారు, వాటిలో పోషకాలు ఏం ఉంటాయి? అవి శరీరానికి చేసే మేలుని చక్కగా వివరిస్తే ఇంటి ఫుడ్‌ని తినడానికి ఆసక్తి చూపి జంక్ ఫుడ్‌ని అస్సలు ముట్టరు.

ఈ పద్ధతులను అనుసరిస్తే మీ పిల్లలు ఆరోగ్యంగా మారడం ఖాయం.

చైతన్యపథం

విద్యాప్రవీణ



**మద్యానికి బానిసై తండ్రి చనిపోయాడు.
కష్టాల మధ్య పెరిగిన ప్రవీణ పశువుల కాపరిగా
పనిచేసింది. కూలిపనులు చేసింది.
చదువు ఆమెకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది.
ఆ ఆత్మవిశ్వాసమే ప్రవీణను 23 సంవత్సరాల
వయసులో సర్పంచ్‌ని చేసింది. బాలికల విద్య నుంచి
స్త్రీ సాధికారత వరకు ఎన్నో విషయాలపై
స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తోంది ప్రవీణ.**

రాజస్థాన్‌లోని పలి జిల్లా సగ్దార గ్రామానికి చెందిన ప్రవీణ తన గ్రామంలోనే కాదు చుట్టుపక్కల ఎన్నో గ్రామాల ప్రజలకు స్ఫూర్తిదాయక మహిళగా మారింది. మూడోక్లాసులో ఉన్నప్పుడు ప్రవీణను చదువు మానిపించారు. దీంతో తనకు ఇష్టమైన చదువుకు దూరం అయింది.

చదువుకు దూరం అయిన ప్రవీణ పశువులను మేపడం నుంచి కూలిపనుల వరకు ఎన్నో చేసింది. రెండు సంవత్సరాల తరువాత ఆమె జీవితాన్ని మార్చే సంఘటన జరిగింది. తమ ఊరికి నలభై కిలోమీటర్ల దూరం లో ఉన్న గ్రామంలోని రెసిడెన్షియల్ స్కూల్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ (కేజీబీవి)లో చదువుకునే అవకాశం వెదుక్కుంటూ వచ్చింది.

అయితే మొదట్లో కుటుంబ సభ్యులు ససేమిరా అన్నారు. 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ఒక ఫీల్డ్ వర్కర్ కృషివల్ల ఎట్టకేలకు బడిలో ప్రవీణను చేర్పించడానికి ఒప్పుకున్నారు.

స్కూల్ చదువు వల్ల ఆత్మవిశ్వాసం పెరగడం మాత్రమే కాదు, ఆడపిల్లలు చదువుకోవడం వల్ల ఎంత మేలు జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకోగలిగింది ప్రవీణ. చదువు పూర్తయిన తరువాత ఒక కన్‌స్ట్రక్షన్ వర్కర్‌తో ప్రవీణ పెళ్లి జరిగింది. 'చదువుకున్న అమ్మాయి'గా అత్తగారి ఇంట్లో ప్రవీణకు తగిన గౌరవ మర్యాదలు ఇచ్చేవారు. తాను తీసుకునే నిర్ణయాలకు అండగా నిలబడేవారు.

'సర్పంచ్ ఎలక్షన్‌లో పోటీ చేయాలనుకుంటున్నాను' అన్నప్పుడు అందరూ అండగా నిలబడ్డారు. కొంతమంది మాత్రం వెనక్కి లాగే ప్రయత్నం చేశారు. అయితే అవేమీ పట్టించుకోకుండా ముందుకు వెళ్లింది. సర్పంచ్‌గా విజయం సాధించింది. చదువు విలువ తెలిసిన ప్రవీణ సర్పంచ్ అయిన రోజు నుంచి బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇంటింటికి వెళ్లి చదువుకోవడం వల్ల ఆడపిల్లలకు కలిగే ఉపయోగాల గురించి ప్రచారం చేసేది. బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకునేది.

'అప్పుడెప్పుడో మా అమ్మాయిని చదువు మానిపించాం. ఇప్పుడు తిరిగి బడిలో చేర్చాలనుకుంటున్నాం' అంటూ ఎంతోమంది తల్లిదండ్రులు ప్రవీణ సలహాల కోసం వచ్చేవారు.

సర్పంచ్‌గా ఆడపిల్లలకు ప్రత్యేకంగా స్కూలు కట్టించింది ప్రవీణ. బాలికల విద్య కోసం పనిచేస్తున్న సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ప్రవీణ ఏదైనా గ్రామానికి వెళ్లినప్పుడు ఉపాధ్యాయులు తమ స్కూలుకు తీసుకువెళ్లి ఆడపిల్లలకు పరిచయం చేసేవారు. 'చదువుకోకపోతే ప్రవీణ కూలిపనులు చేస్తూ ఉండిపోయేది. చదువుకోవడం వల్ల ఆమెలో ఆత్మవిశ్వాసం వచ్చింది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రవీణను సర్పంచ్‌ను చేసి పదిమందికి ఉపయోగపడే మంచి పనులు చేసేలా చేసింది. మీరు బాగా చదువుకుంటే సర్పంచ్ మాత్రమే కాదు కలెక్టర్ కూడా కావచ్చు'... ఇలాంటి మాటలు ఎన్నో చెప్పేవారు.

ఆడపిల్లల చదువు కోసం పనిచేస్తున్న 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ తమ ప్రచార చిత్రాలలో ప్రవీణ ఫొటోలను ఉపయోగించుకుంటుంది. దీంతో ఎన్నో గ్రామాలకు ఆమె సుపరిచితం అయింది.

'ఏదైనా గ్రామానికి వెళ్లినప్పుడు స్కూల్లో చదివే అమ్మాయిలతో మాట్లాడుతుంటాను. మీ గురించి ఫీల్డ్ వర్కర్స్ మా పేరెంట్స్‌కు చెప్పి స్కూల్‌కు పంపించేలా ఒప్పించారు... అని ఎంతోమంది అమ్మాయిలు అన్నప్పుడు గర్వంగా అనిపించేది. ఆడపిల్లల విద్యకు సంబంధించి భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నాను' అంటుంది ప్రవీణ.



మూడోసారి ఏసీసీ అధ్యక్షుడిగా జై షా

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా మూడోసారి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బాలిలో బుధవారం జరిగిన ఏసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో జై షాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2021 జనవరిలో తొలిసారి ఏసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జై షా ఈ పదవిలో మరో ఏడాదిపాటు కొనసాగుతారు. జై షా పర్యవేక్షణలో ఏసీసీ 2022లో ఆసియా కప్ టి20 టోర్నీ, 2023లో ఆసియా కప్ వన్డే టోర్నీని విజయవంతంగా నిర్వహించింది.

రెండో టెస్టుకు జాక్ లీచ్ దూరం

భారత జట్టుతో జరిగే రెండో టెస్టులో ఇంగ్లండ్ బృందంలోని అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జాక్ లీచ్ బరిలోకి దిగడం లేదు. బుధవారం జరిగిన ట్రెయినింగ్ సెషన్‌లో జాక్ లీచ్ పాల్గొనలేదు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో జాక్ లీచ్ మోకాలికి గాయమైంది. రెండో టెస్టుకు లీచ్ అందుబాటులో లేకపోవడంతో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అరంగేట్రం చేయడం ఖాయమైంది.



అఖిల్‌కు కాంస్యం



కైరో: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్ అఖిల్ షెరాన్ కాంస్య పతకంతో మెరిశాడు. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో అఖిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఫైనల్లో అఖిల్ 451.8 పాయింట్లు స్కోరు చేశాడు. అఖిల్ ప్రదర్శనతో భారత్ ఈ టోర్నీని రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఆరు పతకాలతో అగ్రస్థానంతో ముగించింది.

భారత్‌కు ఐదో స్థానం



మస్కట్: 'ఫైవ్-ఎ-సైడ్' పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు ఐదో స్థానం లభించింది. బుధవారం ముగిసిన ఈ టోర్నీలో 5-6 స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6-4 గోల్స్ తేడాతో ఈజిప్ట్ జట్టును ఓడించింది. భారత్ తరఫున మణీందర్ (10వ, 23వ ని.లో) రెండు గోల్స్ చేయగా... రాహీల్ (8వ ని.లో), పవన్ (9వ ని.లో), ఉత్తమ్ (13వ ని.లో), మందీప్ (11వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఫైనల్లో నెదర్లాండ్స్ 5-2తో మలేసియాపై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

మయాంక్ డిశ్చార్జి



అగర్తలా: కర్ణాటక రంజీ జట్టు కెప్టెన్, భారత క్రికెటర్ మయాంక్ అగర్వాల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. శుక్రవారం నుంచి రైల్వేస్‌తో జరిగే రంజీ ట్రోఫీ మ్యాచ్ కోసం మంగళవారం సాయంత్రం అగర్తలా నుంచి సూరత్ బయలుదేరేందుకు మయాంక్ విమానం ఎక్కాడు. తాను కూర్చున్న సీటు ముందు ప్లాస్టిక్ కవర్‌లో ఉంచిన హానికారక ద్రవ్యాన్ని నీళ్లనుకొని మయాంక్ తాగాడు. ఆ వెంటనే అతని నోరు వాచిపోయి బొబ్బలు రావడంతో మాట్లాడలేకపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దాంతో వెంటనే విమానాన్ని ఆపి అతడిని ఆసుపత్రికి తరలించారు. రోజంతా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న మయాంక్ బుధవారం సాయంత్రంకల్లా కోలుకోవడంతో అతడిని డిశ్చార్జి చేశారు.

రోహిత్ పైనే భారం



కెప్టెన్‌కు కలిసొచ్చిన విశాఖపట్నం మైదానం
ఇక్కడ ఆడిన గత టెస్టులో రెండు సెంచరీలు చేసిన రోహిత్

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా తదితర కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం... మరో వైపు అనుభవంలేని యువ ఆటగాళ్లు... తొలి టెస్టులో ఊహించని పరాజయం... ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని వైఎస్‌ఆర్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే రెండో టెస్టులో భారత ప్రదర్శన ఎలా ఉంటుందోనని ఆసక్తి నెలకొని ఉంది. ఈ వేదికపై భారత జట్టు ఇప్పటి వరకు రెండు టెస్టులు ఆడింది. ఆ రెండింటిలోనూ భారత జట్టే గెలిచింది. కోహ్లి కెప్టెన్సీలో 2016 నవంబర్ 17 నుంచి 21 వరకు ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో టీమిండియా 246 పరుగుల తేడాతో గెలిచింది. అనంతరం 2019 అక్టోబర్ 2 నుంచి 6 వరకు దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో కోహ్లి సారథ్యంలోనే భారత జట్టు 203 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్రితంసారి ఇక్కడ ఆడిన భారత టెస్టు జట్టు నుంచి కేవలం రోహిత్, అశ్విన్ మాత్రమే ఈసారి ఆడుతున్నారు. నాటి టెస్టులో రోహిత్ రెండు సెంచరీలతో (తొలి ఇన్నింగ్స్‌లో 176; రెండో ఇన్నింగ్స్‌లో 127) అదరగొట్టాడు. ఫలితంగా బ్యాటింగ్ విషయంలో ఈసారీ రోహిత్ శర్మపైనే అధిక భారం పడనుంది. మరోసారి రోహిత్ మెరిసి... యశస్వి, అయ్యర్ ఇతర ఆటగాళ్లు కూడా రాణిస్తే విశాఖపట్నంలో భారత జట్టు ప్రత్యర్థికి గట్టిపోటీనిచ్చే అవకాశం ఉంటుంది.



అయ్యర్, సర్ఫరాజ్, రజత్, యశస్వి

సంయమనం అవసరం: కోచ్ రాథోడ్

యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని భారత్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నారు. ఒకట్రెండు మ్యాచ్‌లతో వారి సత్తాపై అంచనాకు రావొద్దని ఆయన కోరారు. బుధవారం ఇరు జట్ల ఆటగాళ్లు ముమ్మర సాధన చేశారు. ప్రాక్టీస్ సెషన్ అనంతరం విక్రమ్ రాథోడ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ప్రస్తుత భారత జట్టులోని శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్ ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడలేదు. వారి విషయంలో తొందరపడాల్సిన అవసరం లేదు. వారిపట్ల సంయమనంతో వ్యవహరించాలి. అయ్యర్ త్వరలోనే ఫామ్‌లోకి వస్తాడని గట్టి నమ్మకంతో ఉన్నా. పిచ్, మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టు ఆడటం అలవాటు చేసుకోవాలి. పరుగులు చేసేందుకు అవకాశాలు ఉంటే వాటిని సద్వినియోగం చేసుకోవాలి. షాట్‌ల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి' అని రాథోడ్ వ్యాఖ్యానించారు.

అశ్విన్ టాప్ ర్యాంక్ పదిలం



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో అశ్విన్ మొత్తం ఆరు వికెట్లు పడగొట్టాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 853 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబడ ఒక స్థానం పురోగతి సాధించి 851 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఒక స్థానం మెరుగుపర్చుకొని 825 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలువగా... స్పిన్నర్ రవీంద్ర జడేజా 754 పాయింట్లతో ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం పడిపోయి 729 పాయింట్లతో 12వ ర్యాంక్‌లో నిలిచాడు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్, రవీంద్ర జడేజా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు.

శ్రీకాంత్ ముందంజ

ప్రిక్వార్టర్స్‌లో శంకర్, మిథున్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి, మిథున్ మంజునాథ్ శుభారంభం చేశారు. సమీర్ వర్మ, కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 45 నిమిషాల్లో 22-20, 21-19తో ప్రపంచ 26వ ర్యాంకర్ వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై గెలుపొందగా... శంకర్ 21-14, 21-17తో లియోంగ్ జున్ హావో (మలేసియా)ను, మిథున్ 21-17, 21-8తో జేసన్ (హాంకాంగ్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మరో మ్యాచ్‌లో సమీర్ వర్మ 14-21, 18-21తో లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోగా... లె లాన్ జి (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ జార్జి తొలి గేమ్‌ను 17-21తో కోల్పోయాక గాయంతో వైదొలిగాడు. మహిళల సింగిల్స్‌లో అష్మిత, మాళవిక ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టగా... హైదరాబాద్ అమ్మాయి సామియా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. అష్మిత 21-10, 21-16తో వాంగ్ లింగ్ చింగ్ (మలేసియా)పై, మాళవిక 22-20, 21-8తో ఇనెస్ (పెరూ)పై నెగ్గగా... సామియా 14-21, 18-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో రష్మిక జోడీ



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో ఓడిపోయిన రష్మిక... డబుల్స్‌లో వైదేహి చౌధరీ (భారత్)తో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 'వైల్డ్ కార్డు'తో సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో పోటీపడిన రష్మిక తొలి రౌండ్‌లో 6-7 (8/10), 6-7 (2/7)తో రీనా సాల్గో (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఏడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి జంట 6-3, 6-3తో సహజ యామలపల్లి-వైష్ణవి (భారత్) జోడీపై విజయం సాధించింది.

ప్లే ఆఫ్స్‌కు జైపూర్ పింక్ పాంథర్స్

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందిన తొలి జట్టుగా డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ నిలిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 42-27తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. ఈ టోర్నీలో పింక్ పాంథర్స్‌కిది 12వ విజయం కావడం విశేషం. 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో పింక్ పాంథర్స్ 71 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. తలైవాస్‌తో మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేశాడు. పట్నా పైరేట్స్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 29-29తో 'డ్రా'గా ముగిసింది. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో బెంగాల్ వారియర్స్; గుజరాత్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

సినిమా

మూడోసారి

డైరెక్టర్ శేఖర్ కమ్ముల, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ కలయికలో మూడో సినిమా ప్రకటన వచ్చింది. శ్రీ నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గతంలో వీరి కలయికలో నాగచైతన్య, సాయిపల్లవి జంటగా వచ్చిన 'లవ్ స్టోరీ' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. రెండో సినిమాగా ధనుష్, నాగార్జునలతో ఓ మల్టీ స్టారర్ మూవీ తెరకెక్కిస్తున్నారు శేఖర్ కమ్ముల. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం తిరుపతిలో జరుగుతోంది. తాజాగా ఈ ప్రొడక్షన్ హౌస్ తమ కొత్త చిత్రాన్ని ప్రకటించింది. ''శేఖర్ కమ్ములతో తీయబోయే మూడో చిత్రం లార్జర్ దెన్ లైఫ్‌గా ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. హై బడ్జెట్, టాప్ క్లాస్ సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో ఈ మూవీ రూపొందనుంది. ధనుష్, నాగార్జునలతో శేఖర్ కమ్ముల తీస్తున్న మూవీ చిత్రీకరణ పూర్తయ్యాక ఈ మూవీ సెట్స్‌పైకి వెళుతుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్.



● శేఖర్ కమ్ముల

వారి కష్టానికి ప్రతిఫలం రావాలి - 'దిల్' రాజు



● విక్రాంత్ శ్రీనివాస్, లక్ష్, 'దిల్' రాజు

''25 ఏళ్ల నుంచి చదలవాడ బ్రదర్స్‌ని చూస్తున్నాం. శ్రీనివాస్‌గారు చిన్న నిర్మాతలకు ఫైనాన్షియల్‌గా సపోర్ట్ చేస్తారు. ఇక లక్ష్ నటించిన 'ధీర' ట్రైలర్ బాగుంది. తన హార్డ్ వర్క్, చిత్ర యూనిట్ పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. లక్ష్ చదలవాడ హీరోగా విక్రాంత్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ధీర'. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో పద్మావతి చదలవాడ నిర్మించిన ఈ మూవీ రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి 'దిల్' రాజు, దర్శకులు గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన అతిథులుగా హాజరై, సినిమా బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''ఇన్నేళ్లలో ఎంతో మంది దర్శకులని పరిచయం చేశాను. 'ధీర'తో విక్రాంత్‌ను పరిచయం చేస్తున్నాను. లక్ష్‌ను చూసి తండ్రిగా గర్విస్తుంటాను. మా ప్రొడక్షన్‌లో ఇప్పుడు పదహారు చిత్రాలు రెడీగా ఉన్నాయి'' అన్నారు. ''పక్కోడి గురించి పట్టించుకోకుండా నచ్చింది చేసే వాడికి ఓ మిషన్ అప్పగిస్తే ఆ ప్రయాణంలో ఏర్పడిన సమస్యల్ని 'ధీర'లో చూస్తారు'' అన్నారు లక్ష్ చదలవాడ. ''ధీర' చాలా యూనిక్ పాయింట్. అందరికీ నచ్చుతుంది'' అన్నారు విక్రాంత్ శ్రీనివాస్.

రేపు బ్యాండు మోగించాలి - అడివి శేష్



● సుహాస్, అడివి శేష్, శివాని

''చాయ్ బిస్కెట్ సంస్థలో సుహాస్ వీడియోలు చేస్తున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఇలాంటి ప్రతిభ ఉన్న నటులు చాలా అరుదుగా ఉంటారు. తను ఏ స్థాయికి వెళతాడో ఊహించలేను. ఏదో ఒక రోజు తను నా వేడుకకి అతిథిగా రావాలి. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ట్రైలర్ నచ్చడంతో పది సార్లు చూశా. రేపు (శుక్రవారం) మనమంతా ఈ సినిమా బ్యాండ్ మోగించాలి'' అని హీరో అడివి శేష్ అన్నారు. సుహాస్, శివానీ నాగరం జంటగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి అడివి శేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుష్యంత్ కటికనేని మాట్లాడుతూ– ''సుహాస్ లేకుంటే డైరెక్టర్‌గా ఈ వేదికపైకి వచ్చేందుకు ఇంకా ఎన్నేళ్లు పట్టేదో తెలియదు'' అన్నారు. ''నేను నిర్మాతగా ఈ వేదికపై నిలబడటానికి అల్లు అరవింద్, అల్లు శిరీష్, 'బన్నీ' వాసుగార్లే కారణం. సుహాస్ లేకుంటే ఈ చిత్రం లేదు'' అన్నారు ధీరజ్ మొగిలినేని.

కథే మొదటి హీరో - యశ్ పూరి



''హ్యాపీ ఎండింగ్' సినిమాలో మంచి పాటలు, కామెడీ ఉంటాయి. వీటిని కనెక్ట్ చేస్తూ కథలో బ్యూటిఫుల్ హ్యూమన్ ఎమోషన్ ఉంటుంది. అదే ఈ సినిమా కథకు అసలైన పాయింట్. ఒక్క మాటలో చెప్పాలంటే అన్నీ ఉన్న ధమ్ బిర్యానీ లాంటి సినిమా ఇది'' అని యష్ పూరి అన్నారు. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యష్ పూరి, అపూర్వా రావ్ జంటగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా యష్ పూరి మాట్లాడుతూ– ''పురాణాల్లో మనం చదివిన శాపాలు నేటి తరం కుర్రాడికి వస్తే అతని జీవితం ఎలా మారిపోయింది? ఆ శాపాన్ని ఎదుర్కొనేందుకు హర్ష్ చేసిన ప్రయత్నాలు ఏంటి? అనేది వినోదాత్మకంగా తెరకెక్కించాం. ఈ సినిమాకి మొదటి హీరో కథే.. నేను సెకండ్ హీరోని. కమర్షియల్ హీరోగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అయితే హీరోగా స్థిరపడ్డాకే పక్కా కమర్షియల్ స్టైల్ సినిమాలు చేస్తాను'' అన్నారు.

ఈ సినిమాతో సమస్య అర్థమవుతుంది - మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



● 'మెకానిక్' యూనిట్‌తో కోమటి రెడ్డి

''నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యను ప్రధానంగా తీసుకుని సమాజానికి సందేశం ఇచ్చేలా రూపొందిన 'మెకానిక్' సినిమాని ప్రజలందరూ ఆదరించాలి. ఈ మూవీ ద్వారా ఫ్లోరైడ్ సమస్య, బాధితుల బాధలు సమాజానికి అర్థమవుతాయి. ఈ చిత్రం హిట్ అవుతుంది'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా ముని సహేకర దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్'. ఎం. నాగమునెయ్య (మున్నా) నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను కోమటిరెడ్డి వెంకటరెడ్డి రిలీజ్ చేశారు. ''మా చిత్రంలో అన్ని వాణిజ్య అంశాలు ఉన్నాయి. మంచి సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

హాలీవుడ్‌కి హాయ్

హాలీవుడ్‌లో చాన్స్ అంటే అంత సులభం కాదు. కానీ ప్రతిభ, కష్టపడేతత్వం ఉంటే అసాధ్యం కూడా కాదు. దాంతో పాటు కాస్త అదృష్టం కూడా తోడవ్వాలి. అలా టాలెంట్‌తో పాటు హార్డ్‌వర్క్ చేస్తున్న కొందరు హీరోయిన్లను అదృష్టం కూడా వరించడంతో హాలీవుడ్ కబురు అందింది. హాలీవుడ్‌కి హాయ్ చెప్పిన ఆ కథానాయికల గురించి తెలుసుకుందాం

● శ్రుతీహాసన్‌కు గత ఏడాది బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. శ్రుతి హీరోయిన్‌గా నటించిన 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి', 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. అలాగే శ్రుతీహాసన్ ఓ లీడ్ రోల్‌లో చేసిన ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' గ్రీక్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. 'రివర్ సిటీ', 'ది లాస్ట్ కింగ్‌డమ్' వంటి సిరీస్‌లలో నటించిన మార్క్ రౌలీ ఈ సినిమాలో శ్రుతీహాసన్‌కు జోడీగా నటించారు. దర్శకురాలు డాఫ్నే ష్మోన్ తెరకెక్కించారు. 'ది ఐ' సినిమాను త్వరలోనే థియేటర్స్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. సో.. శ్రుతీ హాసన్‌కు ఇదే తొలి ఇంగ్లిష్ మూవీ అవుతుంది. అలాగే 'ది ఐ' చిత్రం లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పదర్శితం కానుంది. బెస్ట్ ఫిల్మ్ విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఇదే జోష్‌లో 'చెన్నై స్టోరీ' అనే మరో ఇంగ్లిష్ ఫిల్మ్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు శ్రుతీహాసన్. 'ది అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా 'బాఫ్తా' అవార్డు విజేత ఫిలిప్ జాన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో శ్రుతీహాసన్‌కు లీడ్ పెయిర్‌గా అమెరికన్ నటుడు వివేక్ కల్రా నటిస్తారు. ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీ నడిపే అను (శ్రుతి పాత్ర) అనే యువతి నేపథ్యంలో సాగే రొమాంటిక్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. ఇండో-యూకే ప్రొడక్షన్ నిర్మించనున్న ఈ చిత్రానికి యూకేకి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఫండింగ్ చేయనుంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. అయితే ఈ సినిమాలో తొలుత సమంత నటించాల్సింది. కొన్ని కారణాల వల్ల సమంత తప్పుకోవడంతో శ్రుతీహాసన్ చేస్తున్నారు.

● తెలుగు మూలాలు ఉన్న నాయిక శోభితా ధూళిపాళ. ఈ బ్యూటీ అడివి శేష్ హీరోగా రూపొందిన 'గూఢచారి', 'మేజర్' వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. మలయాళం, హిందీ భాషల్లోనూ సినిమాలు చేశారు. అయితే శోభితకు హాలీవుడ్ నుంచి కబురొచ్చింది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ దేవ్ పటేల్ నటించి, దర్శకత్వం వహించిన ఇంగ్లిష్ మూవీ 'మంకీ మ్యాన్'లో ఓ లీడ్ రోల్ చేశారు శోభిత. ఇటీవల ఈ సినిమా ట్రైలర్ కూడా విడుదలైంది. సినిమాను ఏప్రిల్ 5న థియేటర్స్‌లో విడుదల చేయనున్నారు. ''నా తొలి హాలీవుడ్ మూవీకి మీ (అభిమానులు, ప్రేక్షకులను ఉద్దేశించి) ప్రేమ, అభిమానం కావాలి'' అంటూ ఈ సినిమాను ఉద్దేశించి పేర్కొన్నారు శోభిత.

● దాదాపు నాలుగు దశాబ్దాలు వెండితెరపై వెలిగిన అలనాటి తార నూతన్ వారసురాలు ప్రనూతన్ బహల్. వెండితెరపై హిందీ చిత్రం 'నోట్‌బుక్' (2019)తో నటిగా ప్రయాణాన్ని మొదలు పెట్టారు ప్రనూతన్. ఆ తర్వాత 'హెల్మెట్' (2021)లోనూ మెరిశారామె. ఇప్పుడు ఈ యంగ్ బ్యూటీకి హాలీవుడ్ ఆఫర్ వచ్చింది. అమెరికన్ యాక్టర్ రహ్సాన్ నూర్ నటిస్తూ, దర్శకత్వం వహించనున్న ఓ రొమాంటిక్ డ్రామాలో ప్రనూతన్ హీరోయిన్‌గా నటించనున్నారు. 'కోకో అండ్ నట్' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా చిత్రీకరణ జూన్‌లో చికాగోలో ప్రారంభం కానుంది. ఇంగ్లిష్, ఇండియన్ నటులు ఈ సినిమాలో నటిస్తారు.

ఈ ముగ్గురితో పాటు మరికొంతమంది హీరోయిన్ల హాలీవుడ్ ఎంట్రీ జరిగే అవకాశం ఉంది.



● శ్రుతీహాసన్
● శోభితా ధూళిపాళ
● ప్రనూతన్

సాక్షి బిజినెస్

గురువారం
1-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
612	204
71,752	21,726

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,310	▽	200
డోజోన్స్	38,500	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,631	▽	36
డాక్స్	16,904	▽	69
షాంఘై	2,789	▽	42
నికాయ్	36,287	▲	221

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,685	▲	272
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,434	▲	273
వెండి (కేజీ)		
71,668	▲	717

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.54	107.09
€	యూరో	ఎస్‌బీఐ	89.00	91.36
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.84	57.11
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.07	56.00
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.45	12.52

జనవరిలో జీఎస్‌టీ @ రూ.1.72 లక్షల కోట్లు

వ్యవస్థ ప్రారంభం తర్వాత రెండో భారీ వసూళ్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జనవరిలో 10.4 శాతం పెరిగి రూ.1,72,129 కోట్లకు చేరుకున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. 2017 జూలైలో కొత్త పరోక్ష పన్నుల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి రెండవ అతిపెద్ద భారీ వసూళ్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.70 లక్షల కోట్లుపైబడిన వసూళ్లు ఇది మూడవసారి కావడం మరో విశేషం. జనవరి 31వ తేదీ 5 గంటల సమయం వరకూ చూస్తే, ఆర్థిక సంవత్సరం 2023 ఏప్రిల్ నుంచి జనవరి 2024 వరకూ జీఎస్‌టీ వసూళ్లు 11.6 శాతం పెరిగి 16.69 లక్షల కోట్లకు ఎగసింది. 2023 ఏప్రిల్‌లో ఇప్పటివరకూ అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్ల జీఎస్‌టీ పన్ను వసూళ్లు చోటుచేసుకున్నాయి.



బిగ్ 'సి' స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్ ఫోన్లు

హైదరాబాద్: మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్ 'సి' తమ స్టోర్లలో శాంసంగ్ ఎస్24 సిరీస్ స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెచ్చింది. 'శాంసంగ్ తమ కొత్త సిరీస్ గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24 ప్లస్, గెలాక్సీ ఎస్24 స్మార్ట్ ఫోన్లను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేసేందుకు బిగ్ 'సి' సంస్థను ఎంచుకున్నందుకు సంతోషంగా ఉంది' అని ఎండీ బాలు చౌదరి తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సినీనటి మృణాల్ ఠాకూర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జోయాలుక్కాస్ 'గ్రాండ్ ఆఫర్'

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'గ్రాండ్ ఆఫర్'ను ప్రకటించింది. వజ్రాభరణాలు, ప్రెషస్ స్టోన్స్, సిల్వర్‌తో విస్తృత శ్రేణి జ్యువెలరీ మజూరీ ఛార్జీలపై 50% ఆకర్షణీయమైన తగ్గింపు ఇస్తుంది. దేశవ్యాప్తంగా అన్ని జోయాలుక్కాస్ షోరూంలో ఫిబ్రవరి 18 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ జోయ్ అలుక్కాస్ కోరారు.

'పేటీఎమ్'కు ఆర్‌బీఐ షాక్!

- అన్ని సేవలు ఆపేయాలని ఆదేశం
- ఫిబ్రవరి 29 తర్వాత అమల్లోకి



న్యూఢిల్లీ: పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)కి రిజర్వ్ బ్యాంక్ షాక్ ఇచ్చింది. ఫిబ్రవరి 29 నుంచి డిపాజిట్ల స్వీకరణ, కస్టమర్ల ఖాతాలు.. వాలెట్లు, ఫాస్టాగ్‌ల టాపప్‌లు సహా దాదాపు అన్ని సర్వీసులు నిలిపివేయాలని ఆదేశించింది. అయితే, ఆయా కస్టమర్లకు చెల్లించాల్సిన వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు లేదా రీఫండ్‌లను ఎప్పుడైనా క్రెడిట్ చేయొచ్చని సూచించింది. పదే పదే నిబంధనలను ఉల్లంఘించడం, కార్యకలాపాలపై పర్యవేక్షణ ఆందోళనకరమైన విధంగా కొనసాగుతుండటం తదితర అంశాల కారణంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. 'కస్టమర్ల ఖాతాలు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, వాలెట్లు, ఫాస్టాగ్‌లు, ఎన్‌సీఎంసీ కార్డులు మొదలైన వాటిల్లో ఫిబ్రవరి 29 తర్వాత నుంచి ఎటువంటి డిపాజిట్లు లేదా క్రెడిట్ లావాదేవీలు లేదా టాప్‌అప్‌లకు అనుమతి ఉండదు. ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, యూపీఐ సదుపాయం వంటివి మినహా ఇతరత్రా ఎటువంటి బ్యాంకింగ్ సర్వీసులు అందించకూడదు. వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు లేదా రీఫండ్లను మాత్రం ఎప్పుడైనా జమ చేయొచ్చు' అని ఆర్‌బీఐ తెలిపింది. అలాగే కస్టమర్లు తమ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లు, కరెంటు అకౌంట్లు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులలో ఉన్న మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు లేదా వినియోగించుకునేందుకు ఎటువంటి అడ్డంకులు పెట్టకుండా అనుమతించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 29 నాటికి అమలు దశలో ఉన్న లావాదేవీలన్నింటినీ మార్చి 15 నాటికల్లా పూర్తి చేసేయాలని, ఆ తర్వాత ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొంది. కొత్త కస్టమర్లను చేర్చుకోనివ్వకుండా 2022 మార్చి 11 నుంచే పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ నిషేధం విధించింది. సర్వీస్ స్థాయి ఒప్పందంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించడం లేదని తేలడంతో కొత్తగా ఫాస్టాగ్‌లను జారీ చేయొద్దంటూ ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ కూడా పీపీబీఎల్‌ను గతంలోనే ఆదేశించింది.

పేటీఎమ్ షేరు బుధవారం ఫ్లాట్‌గా రూ. 761 వద్ద ముగిసింది.

ఫోన్ల విడిభాగాలపై సుంకం కట్




న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల తయారీలో ఉపయోగించే విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 15 నుంచి 10 శాతానికి తగ్గించింది. వీటిలో బ్యాటరీ కవర్, లెన్స్, సిమ్ సాకెట్, ఫోన్‌కు ముందు, మధ్యలో, వెనుక వాడే కవర్స్, స్క్రూ, ఇతర యాంత్రిక విడిభాగాలు ఉన్నాయి. దేశీయంగా ఉత్పత్తి, ఎగుమతులను పెంచడంతోపాటు స్థానిక మార్కెట్లలో మొబైల్ ఫోన్ల ధరలను తగ్గించడం లక్ష్యంగా ఆర్థిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. పన్ను హేతుబద్ధీకరణ మొబైల్ ఫోన్ తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. భారత్‌లో తయారైన మొబైల్ ఫోన్ల ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరచడంపై సుంకం తగ్గింపు ప్రభావం చూపదని జీటీఆర్‌ఐ కో-ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. ఎగుమతుల కోసం మొబైల్ ఫోన్ల తయారీలో ఉపయోగించే అన్ని విడిభాగాలను ఇప్పటికే సెజ్, అడ్వాన్స్ ఆథరైజేషన్ వంటి వివిధ ప్రభుత్వ పథకాల కింద జీరో డ్యూటీతో దిగుమతి చేసుకోవచ్చన్నారు. యాపిల్ వంటి సంస్థలు ఈ పథకాలను ఉపయోగిస్తున్నాయని చెప్పారు.

కీలక విధానపర నిర్ణయం..

మొబైల్‌ఫోన్ల తయారీని పోటీగా మార్చడానికి ప్రభుత్వం చేసిన కీలక విధానపర నిర్ణయం అని ఇండియన్ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మొహింద్రూ అభిప్రాయపడ్డారు. 'కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి ఎగుమతుల పరంగా ఎలక్ట్రానిక్స్ 9వ స్థానంలో ఉండేది. 2024లో ఏకంగా 5వ స్థానానికి చేరింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కారణంగా ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో మొబైల్స్ వాటా 52 శాతానికి పైగా ఉంది. దేశీయంగా తయారీతో దిగుమతులపై ఆధారపడడం తగ్గడమేగాక గడిచిన 8 ఏళ్లలో ఎగుమతులతో దూసుకుపోయిన మొదటి పరిశ్రమ ఇదే' అని వివరించారు.

బడ్జెట్‌కు ముందు లాభాలు

- ఫెడ్ రిజర్వ్ పాలసీపై ఆశలు
- రాణించిన హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ షేర్లు
- సెన్సెక్స్ 612 పాయింట్లు ప్లస్
- 21,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఫెడరల్ రిజర్వ్ పాలసీ, మధ్యంతర బడ్జెట్ సమావేశాల నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడొచ్చనే ఆశావహ అంచనాలతో స్టాక్ సూచీలు బుధవారం ఒక శాతం లాభపడ్డాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం కలిసొచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు ఒక శాతం రాణించి సూచీల ర్యాలీకి అండగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 612 పాయింట్లు పెరిగి 71,752 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 204 పాయింట్లు బలపడి 21,726 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలతో స్టాక్ సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. అయితే కొద్దిసేపటికే సూచీలు తిరిగి లాభాల్లోకి మళ్లాయి. నెలరోజులుగా అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 711 పాయింట్లు బలపడి 71,851 వద్ద, నిఫ్టీ 219 పాయింట్లు దూసుకెళ్లి 21,741 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ఫలితంగా బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు 1.83%, 1.57% చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.4.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.379 లక్షల కోట్లకు చేరింది.

మారుతీ లాభం స్పీడ్

క్యూ3లో రూ. 3,207 కోట్లు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికం(క్యూ3)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం వృద్ధితో రూ. 3,207 కోట్లను తాకింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 2,406 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం పుంజుకుని రూ. 33,513 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 29,251 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఈ కాలంలో 8 శాతం అధికంగా 5,01,207 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీ అమ్మకాలు 4,29,422 యూనిట్లుకాగా.. 71,785 వాహనాలను ఎగుమతి చేసింది. ఇవి ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. గత క్యూ3లో దేశీయంగా 4,03,929, విదేశాలలో 61,982 యూనిట్ల చొప్పున విక్రయించింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్-డిసెంబర్) మారుతీ సుజుకీ 7 శాతం వృద్ధితో మొత్తం 15,51,292 వాహనాలను విక్రయించింది. ఇది సరికొత్త రికార్డుకాగా.. ఆదాయం, నికర లాభాల్లోనూ రికార్డులు నమోదయ్యాయి. మొత్తం ఆదాయం రూ. 1,03,387 కోట్లను తాకగా.. నికర లాభం 9,536 కోట్లు ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు 2.3 శాతం బలపడి రూ. 10,183 వద్ద ముగిసింది.

కోరమాండల్ కాకినాడ ప్లాంట్ విస్తరణ

- రూ.1,029 కోట్ల పెట్టుబడి
- 24 నెలల్లో నిర్మాణం పూర్తి




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్‌లో ఫాస్ఫరిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంట్ల ఏర్పాటుకు బోర్డు ఆమోదం పొందింది. రోజుకు ఫాస్ఫరిక్ యాసిడ్ 750 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ 1,800 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నూతన కేంద్రాలను జోడించనున్నారు. ఇందుకోసం రూ.1,029 కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 24 నెలల్లో ఈ విస్తరణ పూర్తి కానున్నట్టు వెల్లడించింది. కాకినాడ యూనిట్ సామర్థ్యం రోజుకు ఫాస్ఫరిక్ యాసిడ్ 1,550 టన్నులు, సల్ఫ్యూరిక్ యాసిడ్ 4,200 టన్నులు ఉంది. ప్రస్తుతం పూర్తి సామర్థ్యాన్ని కంపెనీ వినియోగించుకుంటోంది. ఎరువుల తయారీలో ఈ యాసిడ్స్‌ను ఉపయోగిస్తారు. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, తయారీ సామర్థ్యం పెంపొందించుకునేందుకు విస్తరణ చేపడుతున్నట్టు కంపెనీ వెల్లడించింది.

పూర్తి స్థాయి ప్లాంటుగా..

ఫాస్ఫేటిక్ ఎరువుల తయారీ, విక్రయంలో భారత్‌లో కోరమాండల్ రెండవ స్థానంలో నిలిచింది. ముడిసరుకు, ఎరువుల తయారీలో పూర్తి స్థాయి ప్లాంటుగా కాకినాడ కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలిపింది. ప్రతిపాదిత విస్తరణతో కంపెనీ వ్యయ సామర్థ్యాలను, ముడిసరుకు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ వివరించారు. డ్రోన్స్ తయారీలో ఉన్న తమ అనుబంధ కంపెనీ ధక్ష బలమైన ఆర్డర్ బుక్ నమోదు చేసిందని చెప్పారు. రక్షణ రంగం, వ్యవసాయంతోపాటు వివిధ కంపెనీల నుంచి ఆర్డర్లు పొందామన్నారు. గ్రోమోర్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగాన్ని కంపెనీ ప్రోత్సహిస్తోంది.

మౌలిక పరిశ్రమల గ్రూప్ నిరాశ



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ డిసెంబర్‌లో తీవ్ర నిరాశను మిగిల్చింది. అధికారిక గణాంకాల ప్రకారం వృద్ధి రేటు 3.8%గా నమోదయ్యింది. అంతక్రితం గడచిన 14 నెలల్లో గ్రూప్ ఇంత తక్కువ స్థాయి వృద్ధి రేటు నమోదుచేసుకోవడం ఇదే తొలిసారి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో 40% వెయిటేజ్ ఉన్న గ్రూప్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ రంగాలు ఉన్నాయి. వీటిలో ఒక్క సహజ వాయువు రంగం (6.6%) పురోగమించింది. క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి 1% క్షీణించింది. ఇక ఆరు రంగాల వృద్ధి రేట్లూ 2022 డిసెంబర్‌తో పోల్చితే 2023 డిసెంబర్‌లో తగ్గాయి. కాగా, ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య ఈ రంగాల వృద్ధి రేటు దాదాపు స్థిరంగా 8.1% వద్ద నిలిచింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 63వ, 34వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్నికల్) కోర్సు

ఇండియన్ ఆర్మీ 63వ, 34వ షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» 63వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) పురుషులు: 350 పోస్టులు; ఇంజనీరింగ్ స్ట్రీమ్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
» 34వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) మహిళలు: 29 పోస్టులు; ఇంజనీరింగ్ స్ట్రీమ్: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్. -ఎస్ఎస్‌సీ డబ్ల్యూ టెక్-01. -ఎస్ఎస్‌సీ డబ్ల్యూ నాన్-టెక్-01.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.10.2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: రూ.56,100 నుంచి రూ.1,77,500.
» ఎంపిక విధానం: దరఖాస్తును షార్ట్‌లిస్ట్, స్టేజ్-1, స్టేజ్-2 ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.02.2024
» కోర్సు ప్రారంభం: అక్టోబర్ 2024.
» వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 198 గ్రూప్ సి పోస్టులు

పుణె ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా గ్రూప్-సి(బ్యాక్‌లాగ్ సహా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 198
» పోస్టుల వివరాలు: లోయర్ డివిజన్ క్లర్క్-16, స్టెనోగ్రాఫర్ గ్రేడ్2-01, డ్రాఫ్ట్స్‌మ్యాన్-02, సినిమా ప్రొజెక్షనిస్ట్2-01, కుక్-14, కంపోజిటర్ కమ్ ప్రింటర్-01, సివిలియన్ మోటార్ డ్రైవర్(ఓజీ)-03, కార్పెంటర్-02, ఫైర్‌మ్యాన్-02, టీఏ-బేకర్ అండ్ కాన్ఫెక్షనర్-01, టీఏ-సైకిల్ రిపేరర్-02, టీఏ-ప్రింటింగ్ మెషిన్ ఆపరేటర్-01, టీఏ-బూట్ రిపేరర్-01, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఆఫీస్ అండ్ ట్రైనింగ్-151.
» వయసు: ఎల్‌డీసీ/స్టెనోగ్రాఫర్/డ్రాఫ్ట్స్‌మ్యాన్/డ్రైవర్/ఫైర్‌మెన్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు. ఇతర పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాతపరీక్ష, స్కిల్/ప్రాక్టికల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ఉద్యోగ ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» వెబ్‌సైట్: https://ndacivrect.gov.in

జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ(జేఎన్‌టీయూ) హైదరాబాద్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» ఎక్స్‌టర్నల్(పార్ట్‌టైమ్) పీహెచ్‌డీ ప్రోగ్రామ్; ఫుల్ టైం పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రామ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్); పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్(ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్).
» ఫ్యాకల్టీ: ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ సైన్స్.
» విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, బయో-టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఇన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథమేటిక్స్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్, వాటర్ రీసోర్సెస్ అండ్ అట్మాస్పియరిక్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్.
» అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ,ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.యూజీసీ-నెట్/యూజీసీ-సీఎస్ఐఆర్ నెట్/స్లెట్/గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోరు ఉండాలి.
» ఎంపిక విధానం: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అనుసరించి విద్యార్హతలు, ప్రవేశ పరీక్ష,ఇంటర్వ్యూ, రీసెర్చ్ పబ్లికేషన్స్, రీసెర్చ్ వర్క్ పీపీటీ ప్రెజెంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 24.02.2024.
» ఆలస్య రుసుము రూ.1000తో దరఖాస్తుకు చివరితేది: 07.03.2024.
» వెబ్‌సైట్: https://jntuh.ac.in

పాలిటెక్నిక్ లెక్చరర్ కొలువుల స్వాగతం

ఏపీపీఎస్సీ..గత కొంతకాలంగా వరుస నోటిఫికేషన్లతో.. ప్రభుత్వ ఉద్యోగార్థులకు స్వాగతం పలుకుతోంది. ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్ 2 మొదలు పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. తాజాగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ పరిధిలోని.. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 99 లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల వివరాలు, అర్హతలు,ఎంపిక విధానం, పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ఏపీలో 99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రకటన
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100 -రూ.98,400
» ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లలో ఖాళీలు



21 సబ్జెక్ట్‌లు-99 పోస్టులు

ఏపీపీఎస్సీ తాజా నోటిఫికేషన్ ద్వారా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో 21 సబ్జెక్ట్‌లలో మొత్తం 99 పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్-1 పోస్ట్; ఆటోమొబైల్ ఇంజనీరింగ్-8 పోస్టులు; బయోమెడికల్ ఇంజనీరింగ్-2 పోస్టులు;కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్-12 పోస్టులు; సెరామిక్ టెక్నాలజీ-1 పోస్ట్; కెమిస్ట్రీ-8 పోస్టులు; సివిల్ ఇంజనీరింగ్-15 పోస్టులు; కంప్యూటర్ ఇంజనీరింగ్ 8 పోస్టులు; ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-10 పోస్టులు; ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-2 పోస్టులు; ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్-1 పోస్ట్; ఇంగ్లిష్-4 పోస్టులు; గార్మెంట్ టెక్నాలజీ-1 పోస్ట్; జియాలజీ-1 పోస్ట్; మ్యాథమెటిక్స్-4 పోస్టులు; మెకానికల్ ఇంజనీరింగ్-6 పోస్టులు;మెటలర్జికల్ ఇంజనీరింగ్-1 పోస్ట్, మైనింగ్ ఇంజనీరింగ్-4 పోస్టులు; ఫార్మసీ-3 పోస్టులు; ఫిజిక్స్-4 పోస్టులు;టెక్స్‌టైల్ టెక్నాలజీ-3 పోస్టులు.

అర్హతలు

- ఆయా సబ్జెక్ట్‌ను అనుసరించి బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు అర్హత కోర్సులో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి.
- వయసు: జూలై 1, 2023 నాటికి 18-42 ఏళ్లు ఉండాలి(బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాలకు పదేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది).

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకాలను చేపట్టనున్నారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా 450 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్-1: జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ-150 ప్రశ్నల(150 మార్కులు)కు ఉంటుంది. పేపర్-2: సంబంధిత సబ్జెక్ట్ పేపర్-150 ప్రశ్నల(300 మార్కులు)కు జరుగుతుంది. రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పేపర్-1లో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు; పేపర్-2లో ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున కేటాయిస్తారు. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం ఉంటుంది. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కు తగ్గిస్తారు.

కనీస మార్కుల నిబంధన

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే పోస్టుల భర్తీ చేపట్టనున్న నేపథ్యంలో.. కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 30 శాతం మార్కులు సాధించాలి.

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ

పేపర్-1గా పేర్కొన్న జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు.. అభ్యర్థులు ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. దీంతోపాటు జనరల్ సైన్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి, తాజా పరిస్థితులు, రక్షణ రంగంలో ప్రయోగాలు, ఇస్రో ప్రయోగాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. పర్యావరణ అంశాలకు సంబంధించి విపత్తు నిర్వహణ వ్యూహాలపై అవగాహన పెంచుకోవాలి. భారత్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. చరిత్రకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, భారత చరిత్రలను చదవాలి. వీటితోపాటు భారత రాజ్యాంగం, ప్రభుత్వ పాలన విధానం, భారత భౌగోళిక శాస్త్రంలోని ముఖ్యమైన అంశాలను చదవాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి.

పేపర్-2కు ఇలా

అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పేపర్-2లో రాణించడానికి దృష్టి పెట్టాల్సిన అంశాలు..

- **ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్:** బేసిక్ డిజైన్, బిల్డింగ్ మెటీరియల్స్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, ఇంజనీరింగ్ మెకానిక్స్, ఆర్కిటెక్చరల్ డ్రాయింగ్ అండ్ గ్రాఫిక్స్, ఇంట్రడక్షన్ ఆఫ్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్, హిస్టరీ ఆఫ్ ఆర్కిటెక్చర్, తదితర అంశాలు.
- **ఆటోమొబైల్ ఇంజనీరింగ్:** ఆటోమొబైల్ పవర్ ప్లాంట్స్, ఆటోమొబైల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆటోమొబైల్ ఛాసిస్ అండ్ బాడీ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ట్రాన్స్‌మిషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఆటోమొబైల్ ఎలక్ట్రికల్ సిస్టమ్స్, మెటీరియల్ సైన్స్, కైనమాటిక్స్ అండ్ డైనమిక్స్ ఆఫ్ మెషీన్స్ తదితర అంశాలు.
- **బయోమెడికల్ ఇంజనీరింగ్:** రెస్పిరేటరీ మెజర్‌మెంట్స్ అండ్ ఎయిడ్, వెంటిలేటర్స్, ఆడియోమెట్రీ, ఎలక్ట్రో సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, మెథడ్స్ ఆఫ్ కెమికల్ అనాలిసిస్ వంటి అంశాలు.
- **సెరామిక్ టెక్నాలజీ:** సిమెంట్ ఇండస్ట్రీ, పోర్ట్ ల్యాండ్ సిమెంట్, స్పెషల్ సిమెంట్స్, స్పెషల్ సెరామిక్ మెటీరియల్స్, హై టెంపరేచర్ సెరామిక్ మెటీరియల్స్, సెరామిక్ కంపోజిట్స్, న్యూక్లియర్ సెరామిక్స్ తదితర అంశాలు.
- **కంప్యూటర్ ఇంజనీరింగ్:** హార్డ్‌వేర్, డిస్క్రీట్ మ్యాథమెటిక్స్, థియరీ ఆఫ్ కంప్యుటేషన్, కంపైలర్స్, ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిథమ్స్, డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, కంప్యూటర్ గ్రాఫిక్స్, ఏఐ టెక్నిక్స్, తదితర అంశాలు.
- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ డిజైన్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్, సర్వేయింగ్, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్,హైడ్రాలిక్స్,క్వాంటిటీ సర్వేయింగ్,డిజైన్ ఆఫ్ స్ట్రక్చర్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాలు.
- **ఈసీఈ:** ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, నెట్‌వర్క్స్, డిజిటల్ సర్క్యూట్స్, కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన అంశాలు.
- **ఈఈఈ:** ఎలక్ట్రిక్ సర్క్యూట్స్ అండ్ ఫీల్డ్స్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, తదితర అంశాలు.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్:** అనలాగ్ ఎలక్ట్రానిక్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్స్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంట్రోల్ సిస్టమ్ అండ్ ప్రాసెస్ కంట్రోల్ తదితర టాపిక్స్.
- **మెకానికల్ ఇంజనీరింగ్:** అప్లైడ్ మెకానిక్స్ అండ్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్ అండ్ హైడ్రాలిక్స్ మెషినరీ వంటి అంశాలు.
- **మెటలర్జికల్ ఇంజనీరింగ్:** మినరల్ ప్రాసెసింగ్ అండ్ ప్రిన్స్‌పుల్స్, ఫిజికల్ మెటలర్జీ అండ్ హీట్ ట్రీట్‌మెంట్, మెటలర్జికల్ థర్మోడైనమిక్స్, మెకానికల్ మెటలర్జీ, ఐరన్ అండ్ స్టీల్ మేకింగ్, పౌడర్ మెటలర్జీ ఆఫ్ మెటల్స్, మెటీరియల్ ప్రాసెసింగ్, ఫర్నేస్ టెక్నాలజీ, తదితరాలు.
- **మైనింగ్ ఇంజనీరింగ్:** మైన్ డెవలప్‌మెంట్, మైన్ సర్వేయింగ్, జియో మెకానిక్స్ అండ్ గ్రౌండ్ కంట్రోల్, సర్ఫేస్ ఎన్విరాన్‌మెంట్, మైన్ వెరిఫికేషన్, అండర్‌గ్రౌండ్ హజార్డ్స్, మైన్ ఎకనామిక్స్, మైన్ ప్లానింగ్ వంటి అంశాలు.
- **టెక్స్‌టైల్ టెక్నాలజీ:** టెక్స్‌టైల్ ఫైబర్స్, స్పిన్నింగ్, వీవింగ్, ఒవెన్ ఫ్యాబ్రిక్ డిజైన్, కెమికల్ ప్రాసెసింగ్ ఆఫ్ టెక్స్‌టైల్స్, అపారెల్ ప్రొడక్షన్, టెక్స్‌టైల్ టెస్టింగ్, స్టాటిస్టికల్ టూల్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, టెక్స్‌టైల్ మ్యాథమెటిక్స్, నిట్టింగ్ అండ్ నాన్-ఒవెన్ టెక్నాలజీకు సంబంధించిన అంశాలు.
- **జియాలజీ:** జియో మార్ఫాలజీ అండ్ ఫీల్డ్ జియాలజీ, మినరాలజీ అండ్ ఆప్టికల్ మినరాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, అండ్ జియోటెక్టానిక్స్, జియో కెమిస్ట్రీ, మెటామార్ఫిక్ పెట్రోలజీ అండ్ థర్మోడైనమిక్స్, సెడిమెంటాలజీ అండ్ పెట్రోలియం జియాలజీ, తదితర అంశాలు.
- **ఫార్మసీ:** మెథడ్స్ ఆఫ్ స్టెరిలైజేషన్, మెథడ్స్ ఆఫ్ క్లాసిఫికేషన్ ఆఫ్ క్రూడ్ డ్రగ్స్, సెకండరీ మెటబాలిక్స్, డ్రగ్ డిస్కవరీ అండ్ క్లినికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ న్యూ డ్రగ్స్, ఫార్మకాలజీ సంబంధిత అంశాలు.
- **కెమిస్ట్రీ:** ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీలకు సంబంధించిన అంశాలు.
- **ఫిజిక్స్:** మ్యాథమెటికల్ మెథడ్స్ ఆఫ్ ఫిజిక్స్, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ థియరీ, క్వాంటమ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, అటామిక్ అండ్ మాలిక్యులర్ ఫిజిక్స్, న్యూక్లియర్ అండ్ ప్రాక్టీస్ ఫిజిక్స్ తదితర అంశాలు.
- **మ్యాథమెటిక్స్:** రియల్ అనాలిసిస్, కాంప్లెక్స్ అనాలిసిస్, లీనియర్ ఆల్జీబ్రా, ఆల్జీబ్రా, డిఫరెన్షియల్ ఈక్వేషన్‌కు సంబంధించిన అంశాలు.
- **ఇంగ్లిష్:** రైటర్స్ అండ్ టెక్ట్స్, లిటరేచర్, మోడ్రనిజం, ఈఎల్‌టీ ఇన్ ఇండియా, టీచింగ్ లాంగ్వేజ్ స్కిల్స్, టెస్టింగ్ అండ్ ఎవాల్యుయేషన్, ఫొనెటిక్స్ అండ్ ఫొనాలజీ, సింటాక్స్ అండ్ స్ట్రక్చర్ తదితరాలు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 29 - ఫిబ్రవరి 18, 2024
- పరీక్ష తేదీ: ఏప్రిల్/మేలో నిర్వహించే అవకాశం.
- వెబ్‌సైట్: https://psc.ap.gov.in

క్లుప్తంగా...

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

- నేటి నుంచి ప్రక్రియ మొదలు
- 6వ తేదీన మరో 169 పోస్టుల భర్తీకి వాక్–ఇన్–ఇంటర్వ్యూ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో భాగంగా నేటి (గురువారం) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. 20 స్పెషాలిటీల్లో 255 పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, అర్హులైన వైద్యులు గురువారం నుంచి ఈ నెల 15వ తేదీలోగా https://dme.ap.nic.in/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించవచ్చు. ఓసీ అభ్యర్థులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.500 చొప్పున అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ విధానంలో వైద్య శాఖ పోస్టుల భర్తీ చేపడుతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటి వరకూ 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అసోసియేట్‌లుగా ప్రమోషన్‌లు ఇవ్వడంతో ఏర్పడిన ఖాళీలతో పాటు, కొత్త కళాశాలలు, విభాగాల ఏర్పాటు కోసం కొత్తగా సృష్టించిన పోస్టుల భర్తీ చేపట్టడానికి తాజా నోటిఫికేషన్ జారీ చేశారు. మరోవైపు ఈనెల 6వ తేదీన సూపర్ స్పెషాలిటీల్లో 169 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించనున్నారు.

డీఎస్సీ ప్రకటన శుభపరిణామం

నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరుస్తూ మెగా డీఎస్సీ ప్రకటించడం శుభపరిణామమని నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకే సారి 6,100 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుండటంతో ఎంతో మంది అభ్యర్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగానే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రూప్–2 మరో నెల రోజులు వాయిదా వేయాలని కోరారు.

ప్రాంతీయ జాబ్‌మేళాలో 5,000 పోస్టులు భర్తీ



విజయనగరం అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయనగరంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంతీయ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 6 జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత పెద్దఎత్తున హాజరయ్యారు. జాబ్‌మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువతకు నాణ్యమైన ఉపాధిచూపే విద్యను అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. జాబ్ మేళాలో ఫార్మా కంపెనీలతో పాటు 87 సంస్థలు పాల్గొని 5 వేల పోస్టులు భర్తీ చేశారు.

'సౌదీ'లో భారత కాన్సుల్ జనరల్‌గా ఫహాద్ అహ్మద్



కడప కార్పొరేషన్: సౌదీ అరేబియాలోని జెద్దాలో భారత కాన్సుల్ జనరల్‌గా కర్నూలుకు చెందిన ఫహాద్ అహ్మద్ సూరి నియమితులయ్యారు. 2014 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన ఫహాద్ ప్రస్తుతం కేంద్ర వాణిజ్య శాఖలో విధులు నిర్వర్తిస్తూ మధ్యప్రాచ్యంలోని దేశాలతో భారత ఎగుమతులు, దిగుమతుల వ్యవహారాలను పరిశీలిస్తున్నారు. అంతకుముందు ఆయన కువైట్‌లోని భారత ఎంబసీలో పనిచేశారు. కరోనా సంక్షోభం సమయంలో చేపట్టిన మిషన్ వందే భారత్‌లో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. కర్నూలులోని ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన ఫహాద్ స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చదివారు. ఆ తర్వాత బెంగళూరులో ఎంబీఏ చేసి.. లండన్‌లో బ్యాంకర్‌గా పని చేసిన అనంతరం సివిల్స్ ద్వారా ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు.

ఉదయం క్లిష్టంగా.. సాయంత్రం సులభంగా..

నాలుగో రోజు ముగిసిన జేఈఈ మెయిన్ ఇంజనీరింగ్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ ఇంజనీరింగ్ ఆన్‌లైన్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. మొదటి షిఫ్టులో ప్రశ్నపత్రం మోస్తరు క్లిష్టంగా, రెండో షిఫ్టులో ప్రశ్నలు కొంతమేర సులభంగా ఉన్నట్లు విద్యార్థులు, సబ్జెక్టు నిపుణులు తెలిపారు. మొదటి షిఫ్టులో మ్యాథమెటిక్స్ ప్రశ్నలు క్లిష్టంగా ఉండి, సుదీర్ఘంగా ఉన్నాయని పేర్కొన్నారు. రెండో షిఫ్టులో.. మ్యాథమెటిక్స్ నుంచి సుదీర్ఘమైన ప్రశ్నలు అడిగినప్పటికీ సులభంగానే ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. గురువారంతో జేఈఈ మెయిన్ సెషన్–1 పరీక్షలు ముగియనున్నాయి.

పత్తికి 'పచ్చ' తెగులు

పత్తి పంటపై అసత్యాలతో ఈనాడు కథనం

- పత్తి రైతులకు అడుగడుగునా అండగా నిలిచిన ప్రభుత్వం
- ధర పతనమైన ప్రతిసారీ ఎమ్మెస్పీకి ప్రభుత్వమే కొనుగోలు
- 1.28 లక్షల రైతులకు రూ.123.56 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- త్వరలో 2.25 లక్షల మందికి రూ.339.49 కోట్ల కరువు, మిచాంగ్ పరిహారం
- 4.5 ఏళ్ళలో 8.34 లక్షల మందికి రూ.1,045 కోట్ల బీమా పరిహారం
- అయినా పనిగట్టుకొని ఈనాడు విష ప్రచారం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పత్తి పంటకు 'పచ్చ' తెగులు పట్టింది. వాస్తవాలను మరుగున పరిచి ఈనాడు రామోజీరావు విషం కక్కారు. వైఎస్ జగన్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన 56 నెలల్లో రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుంటే, పత్తి రైతులకు అన్యాయం జరిగిపోయిందంటూ 'వి'పత్తి'పై.. నిర్లక్ష్యపు కత్తి' అంటూ ఓ అబద్ధాల కథనాన్ని అచ్చేశారు. ఈ కథనంలో వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం..

ఆరోపణ: సగానికి తగ్గిన సాగు, దిగుబడులు

వాస్తవం: పత్తి సాధారణ విస్తీర్ణం 15.26 లక్షల ఎకరాలు కాగా, ఖరీఫ్ – 2023లో 10.35 లక్షల ఎకరాల్లో సాగయింది. 12 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అంతర్జాతీయంగా పత్తి ధరలు తగ్గడం వల్ల పత్తి రైతులు మిరప, మొక్కజొన్న, ఆముదం, సోయాబీన్, జామ, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్ వంటి పంటలకు మళ్లారు. దీంతో పాటు దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు, కోత దశలో మిచాంగ్ తుపాను ప్రభావం ఖరీఫ్–2023 సీజన్‌పై పడింది. పత్తి రైతులు ఇతర పంటలవైపు మళ్లడంతో మిరప 3.90 లక్షల ఎకరాల నుంచి 6.54 లక్షల ఎకరాలకు, మొక్కజొన్న 6.57 లక్షల ఎకరాల నుంచి 8.05 లక్షల ఎకరాలకు, ఆముదం 90 వేల ఎకరాల నుంచి 1.63 లక్షల ఎకరాలకు, సోయాబీన్ 2 వేల ఎకరాల నుంచి 22 వేల ఎకరాలకు పెరిగింది. పోనీ చంద్రబాబు హయాంలో ఏమైనా పెరిగిందా అంటే అదీ లేదు. 2014–15 లో 20.37 లక్షల ఎకరాల్లో సాగవగా, 27.51 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. అదే 2018–19కి వచ్చేసరికి సాగు విస్తీర్ణం 15లక్షల ఎకరాలకు పడిపోయింది. దిగుబడులు 14.91 లక్షల టన్నులకు దిగజారిపోయాయి.

ఆరోపణ: క్వింటాకు రూ.1,000 కంటే తక్కువకే అమ్మకాలు

వాస్తవం: చంద్రబాబు హయాంలో ఏనాడూ పత్తి క్వింటాకు రూ.6,400 మించి పలకలేదు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని సీజన్లలో ఎమ్మెస్పీకి మించి ధర పలికింది. గతేడాది రికార్డు స్థాయిలో రూ.13 వేలు పలికింది. అంతర్జాతీయంగా పత్తికి డిమాండ్ లేకపోయినప్పటికీ, రాష్ట్రంలో క్వింటా పొడుగు పత్తి గింజ ఎమ్మెస్పీ రూ.7020 కాగా, ఆదోని మార్కెట్‌లో బుధవారం రూ.7029 పలికింది. మధ్యస్థ గింజ ఎమ్మెస్పీ రూ.6,800 కాగా, రూ.6,620 పలికింది. మరొక వైపు ధరలు పతనమైన ప్రతిసారీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి ద్వారా పత్తిని కొంటోంది. ఇలా 4.5 ఏళ్లలో 83,413 మంది రైతుల నుంచి రూ.1,789 కోట్ల విలువైన 3.21 లక్షల టన్నుల పత్తి కొనుగోలు చేసింది.

ఆరోపణ: నకిలీ విత్తనాలతో దోపిడీ

వాస్తవం: నాసిరకం విత్తన తయారీ, విక్రయదారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 351 నాసిరకం విత్తనాల ఉత్పత్తిదారులపై చర్యలు తీసుకుంది. మరో 168 నాసిరకం విత్తన ఉత్పత్తిదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. 2,702 డీలర్ షాపులను తనిఖీ చేసి రూ.40.97లక్షల విలువైన 34.20 లక్షల క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకొంది. రూ.12.84 లక్షల విలువైన 2,255 క్వింటాళ్ల విత్తనాల విక్రయాలను నిలిపివేసింది. బాధ్యులైన 16 మంది డీలర్లపై 6ఏ కేసులు, నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో పరీక్షించి, సర్టిఫై చేసిన విత్తనాలను ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తోంది. ఇలా 2022–23లో 108.44 క్వింటాళ్లు, 2023–24లో 18 క్వింటాళ్ల సర్టిఫైడ్ పత్తి విత్తనాన్ని ఆర్బీకేల ద్వారా సరఫరా చేసింది.

ఆరోపణ: తెగుళ్లు, చీడపీడల నియంత్రణ చర్యలేవీ?

వాస్తవం: గులాబీ రంగు పురుగు ఉధృతికి అడ్డుకట్ట వేసేందుకు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించింది. 6,820 హెక్టార్లలో 682 క్షేత్ర స్థాయి ప్రదర్శనలు నిర్వహించి, గులాబీ పురుగు నివారణకు అవసరమైన వనరులను 50 శాతం సబ్సిడీపై ఇచ్చింది. ఫలితంగా 2023–24 సీజన్‌లో ఈ పురుగు ఉధృతి గణనీయంగా తగ్గింది. నాణ్యమైన దిగుబడులు లక్ష్యంగా 3,895 పొలంబడుల ద్వారా 1.17లక్షల మంది రైతులకు శిక్షణనిచ్చింది. ఇలా అడుగడుగునా పత్తి రైతుకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తుంటే వాస్తవాలకు ముసుగేసి విష ప్రచారం చేయడం ఈనాడుకు తగదని రైతులు హితవు పలుకుతున్నారు.

ఆరోపణ: ప్రభుత్వ ప్రోత్సాహమేది?

వాస్తవం: ప్రభుత్వ ప్రోత్సాహం లేదనడమే అసంబద్ధం. వైఎస్ జగన్ ప్రభుత్వం అడగడుగునా రైతులకు అండగా ఉంది. అన్ని రకాలుగా ప్రోత్సాహాన్నిస్తోంది. రైతులపై పైసా భారం పడకుండా పత్తి పంటకు పంటల బీమా వర్తింపజేసింది. గత 4.5 ఏళ్లలో 8,33,989 మందికి రూ.1,045.40 కోట్ల బీమా పరిహారం చెల్లించింది. వాతావరణ ఆధారిత పథకం కింద అన్ని జిల్లాల్లో ఒకే రీతిలో బీమా వర్తింపజేస్తోంది. ఈ 4.5 ఏళ్లలో వైపరీత్యాల వల్ల నష్టపోయిన 1.28 లక్షల మందికి రూ.123.56 కోట్లు పంట నష్ట పరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) అందించింది. ఖరీఫ్–2023లో వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన 2.23 లక్షల మందికి రూ.337.17 కోట్లు, మిచాంగ్ తుపాన్ వల్ల దెబ్బతిన్న 2,513 మంది రైతులకు రూ.2.32కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని త్వరలో జమ చేయనుంది. చంద్రబాబు హయాంలో ఒక్క రైతుకు కూడా బీమా పరిహారం ఇవ్వలేదు.

17న జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగం

ఇన్‌శాట్ 3–డీఎస్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు


జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఈనెల 17వ తేదీన జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రయోగించనుంది. ప్రస్తుతం షార్‌లో ఉపగ్రహానికి పరీక్షలు నిర్వహిస్తుండగా.. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధాన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తొలుత ఈ ప్రయోగాన్ని జనవరి 26వ తేదీన నిర్వహించాలని ఇస్రో నిర్ణయించింది. కానీ ఉపగ్రహం రావడం ఆలస్యమవడంతో పాటు పలు సాంకేతిక కారణాల వల్ల ఫిబ్రవరి 17వ తేదీకి ప్రయోగాన్ని వాయిదా వేసింది. ఇండియన్ నేషనల్ శాటిలైట్ సిస్టం(ఇన్‌శాట్) వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగిస్తోంది. ఇన్‌శాట్ సిరీస్‌లో ఇప్పటివరకు 23 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపగా.. గతంలో ప్రయోగించిన ఇన్‌శాట్–3డీ, ఇన్‌శాట్–3డీఆర్‌కు కొనసాగింపుగా ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. 2,275 కిలోల బరువు కలిగిన ఉపగ్రహంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆరు చానల్ ఇమేజర్స్, 19 చానల్ సౌండర్స్‌తో పాటు మెట్రోలాజికల్ పేలోడ్స్, కమ్యూనికేషన్ పేలోడ్స్ అమర్చి పంపిస్తున్నారు. వాతావరణం అంచనా, విపత్తు హెచ్చరికలకు అవసరమైన మెరుగైన వాతావరణ పరిశీలన, భూమి, సముద్ర ఉపరితలాల పర్యవేక్షణ కోసం ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఇందుకోసం ఉపగ్రహంలో డేటా రిలే ట్రాన్స్‌పాండర్, శాటిలైట్ ఎయిడెడ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ట్రాన్స్‌పాండర్ అమర్చారు.

మహిళా రక్షణకు ఉక్కు కవచం 'దిశ' యాప్

- ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్ వ్యవస్థాపక వేడుకలు
- కార్యక్రమంలో ప్రసంగించిన ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీరెడ్డి



ఢిల్లీలో జరిగిన జాతీయ మహిళా కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో వివిధ రాష్ట్రాల మహిళా కమిషన్ చైర్మన్లు, సభ్యులతో ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీ రెడ్డి

సాక్షి, అమరావతి: ఆపదలో ఉన్న మహిళల రక్షణకు ఉక్కు కవచంలా ఆంధ్రప్రదేశ్‌లో 'దిశ' యాప్ పనిచేస్తోందని ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీరెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో జాతీయ మహిళా కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు వివిధ రాష్ట్రాల మహిళా కమిషన్ చైర్మన్‌లు, సభ్యులు హాజరయ్యారు. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో జయశ్రీరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళలకు పటిష్టమైన రక్షణ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ బిల్లును ప్రతిపాదించారన్నారు. దిశ వల్ల మహిళల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెరిగాయన్నారు. యాప్‌తో కేసుల నమోదు శాతం పెరగడమే కాకుండా తక్షణమే బాధిత మహిళకు ప్రభుత్వం న్యాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇటు వంటి పరిస్థితులు గతంలో లేవన్నారు. గతంలో మహిళలపై జరిగే అత్యాచార కేసుల విచారణకు సుమారు మూడు నుంచి నాలుగు నెలలు పట్టేదని, నేడు 42 రోజుల్లోనే విచారణ పూర్తిచేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లు, 3 ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడంతో పాటు డీఎస్పీ స్థాయి అధికారులు పనిచేస్తున్నట్లు చెప్పారు. మహిళలపై దాడి చేసిన కేసుల్లో కేవలం 15 రోజుల్లో చార్జిషీట్‌లు వేసి నేరస్తులకు పలు రకాల శిక్షలు విధించారన్నారు. దిశ యాప్‌ను రాష్ట్రంలో సుమారు కోటీ 50 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారని చెప్పారు. ఈ యాప్ మహిళల రక్షణకు, భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్యం, ఆహారం, ఇతర సహాయాల నిమిత్తం బాధిత మహిళలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఈ బిల్లును ఆదర్శంగా తీసుకుని తమ రాష్ట్రాల్లో కూడా అమలుకు సిద్ధమయ్యాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల మహిళా కమిషన్‌ల చైర్మన్‌లు, సభ్యులు ఏపీ ప్రభుత్వాన్ని కొనియాడారు.

'ఐబీ' అందరికీ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ విద్యారంగంలో ఐబీని భాగస్వామ్యం చేయడం గొప్ప సంతృప్తినిస్తోందన్నారు. ఐబీతో భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైందని, ఒకటి నుంచి 12వ **తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లను ఐబీతో ఏకీకృతం చేయడం గొప్ప సంతృప్తినిచ్చే కార్యక్రమంగా అభివర్ణించారు. ఐబీ డైరెక్టర్ జనరల్ ఓలీ పెక్కా, ఐబీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.**

ఆ పరిస్థితి ఇక మారుతుంది: సీఎం జగన్

భారత్ లాంటి దేశాల్లో నాణ్యమైన విద్య అత్యవసరమని, ఇప్పుడున్న విధానాలను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం జగన్ చెప్పారు. సాంకేతికత, పాఠ్య ప్రణాళిక తదితర అంశాలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సమస్యా పూరణ సామర్థ్యం, ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ మోడల్‌లో ఎడ్యుకేషన్ నాలెడ్జ్ వినియోగం లాంటివి చాలా కీలకమని, ఐబీ ద్వారా ఇది సాధ్యమన్నారు. ఐబీతో భాగస్వామ్యం ద్వారా ఒక ప్రయాణం ప్రారంభమైందని, రానున్న విద్యా సంవత్సరంలో టీచర్లకు, సిబ్బందికి ఐబీ విధానాలపై శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. ఐబీ విద్య సంపన్నులకు మాత్రమే అనే పరిస్థితి ఇప్పుడు మారుతుందని వ్యాఖ్యానించారు. పేదలకు, అణగారిన వర్గాలకూ ఇకపై ఐబీ బోధన అందుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో తరగతిలో ఐబీ బోధన మొదలై 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి పన్నెండో తరగతుల్లో ఐబీ బోధన ప్రారంభమవుతుందని తెలిపారు. ఎస్సీఈఆర్టీ, ఐబీ భాగస్వామ్యంతో విద్యా బోధన కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందన్నారు.

ఇతర దేశాలకు స్ఫూర్తి: ఓలి పెక్కా

తమది లాభాపేక్ష లేని సంస్థ అని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంపై చాలా నిబద్ధతతో ఉన్నామని ఐబీ డైరెక్టర్ జనరల్ ఓలి పెక్కా హీనోనెన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని పేర్కొంటూ సీఎం వైఎస్ జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. భారత్‌తో విద్యారంగంలో తమ సంబంధాలు మరింత మెరుగుపడతాయని, నాణ్యమైన విద్యకోసం టీచర్లు, సిబ్బంది సామర్థ్యాలను పెంచుతామన్నారు. పిల్లలు, స్కూళ్లు, తల్లిదండ్రులు, యూనివర్సిటీలతోనూ తమ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఏపీలో కొత్త తరహా విద్యా విధానంలో తొలుత ప్లే బేస్డ్ లెర్నింగ్ విధానంతో పిల్లల్లో ఆసక్తిని కలిగించేందుకు ఆర్ట్స్, సైన్స్, మ్యాథ్స్‌తో పాటు మాతృభాషల్లోనే కాకుండా పిల్లలు విదేశీ భాషలను నేర్చుకోవడంపైనా దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, జర్మనీ, సింగపూర్, ఎస్తోనియా, ఫిన్లాండ్, కెనడా దేశాల్లోని విద్యామంత్రులతో ఇటీవల నాణ్యమైన బోధన, అభ్యాసాలపై చర్చించినట్టు చెప్పారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరవ్ గౌర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (ఇన్‌ఫ్రా) కాటమనేని భాస్కర్, సర్వశిక్ష అభియాన్ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ(మిడ్ డే మీల్స్) డైరెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐబీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐబీ భాగస్వామ్యంపై జీవో

పాఠశాల విద్యలో ఇంటర్నేషనల్ బాకలారియెట్ సిలబస్ అమలుకు అనుగుణంగా ఎస్సీఈఆర్టీలో ఐబీ భాగస్వామ్యంపై పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుధవారం జీవో నంబర్ 5 జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో భవిష్యత్ సాంకేతికత, సిలబస్, బోధన, సదుపాయాలు తదితర అంశాలపై ఐబీ ప్రతినిధులు అధ్యయనం చేయనున్నారు. 21 మంది ఐబీ ప్రతినిధుల బృందం వచ్చే నెల రోజుల్లో 40 పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాలను పరిశీలించి అధ్యయనం నిర్వహిస్తుంది. ఎగ్జామినేషన్ విధానాలను సైతం పరిశీలించి మార్పుచేర్పులపై సూచనలు చేస్తారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు శిక్షణ, సిలబస్‌పై సూచనలు ఇచ్చేందుకు ఎస్సీఈఆర్టీలోని 19 మంది నిపుణులతో పాటు ఐబీకి చెందిన 26 మంది నిపుణులు చర్చించనున్నారు. మొత్తం ప్రక్రియను 2025 మే నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది జూన్ నుంచి ఒకటో తరగతిలో ఐబీ సిలబస్ బోధనను ప్రవేశపెట్టనున్నారు.

ప్రవాసాంధ్రులకు అండగా ఏపీఎన్ఆర్‌టీఎస్

ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) ప్రవాసాంధ్రులకు అనేక సేవలందిస్తోందని, విదేశాలకు వెళ్లాలనుకుంటున్న వారు, విదేశాల్లో ఉన్న వారు ఏపీఎన్ఆర్‌టీఎస్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి విజ్ఞప్తి చేశారు. ప్రవాసాంధ్ర బీమా, ఉచిత అంబులెన్స్ సర్వీస్, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా, అడ్వాన్స్‌డ్ ఐటీ కోర్సుల్లో శిక్షణ, అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ వంటి 28కిపైగా సేవలను ఏపీఎన్ఆర్‌టీఎస్ అందిస్తోందన్నారు. బుధవారం తాడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీఎన్ఆర్‌టీఎస్‌లో నమోదు చేసుకోవడానికి హెల్ప్ లైన్ నంబర్ 0863 2340678, వాట్సాప్: 85000 27678 నంబర్‌లో సంప్రదించాలిందిగా కోరారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 2.5 లక్షల మంది ప్రయోజనం పొందారన్నారు. తమ సంస్థకు వివిధ దేశాల్లో 200 మందికి పైగా కో ఆర్డినేటర్లు ఉన్నారని వివరించారు. అలాగే 30కి పైగా దేశాల ఎంబసీ, సీజీఐలతో సమన్వయం చేసుకుంటూ ఇబ్బందుల్లో ఉన్నప్రవాసాంధ్రులకు తక్షణ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రవాసాంధ్రుల నుంచి ఇప్పటి వరకు హెల్ప్ లైన్ ద్వారా 2.02 లక్షలకు పైగా కాల్స్ రిసీవ్ చేసుకున్నామని తెలిపారు. విదేశాల్లో మరణించిన ప్రవాసాంధ్రుడిపై ఆధారపడిన కుటుంబానికి ఆర్థిక ఆసరాగా ఇస్తున్న ఎక్స్ గ్రేషియా కింద ఇప్పటి వరకు 489 మందికి రూ. 2.44 కోట్లు అందించామని చెప్పారు. విదేశాల్లో మరణించిన వారి భౌతికకాయాల్ని విమానాశ్రయాల నుంచి వారి స్వగ్రామాలకు తరలించడానికి రూ. 1.93 కోట్లు ఖర్చు చేసి 1,077 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. విదేశాల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తిన సమయంలో 3,610 మంది విద్యార్థులు, ఉద్యోగులు, వలసకార్మికులు, పర్యాటకుల్ని స్వదేశానికి తీసుకువచ్చామని వెంకట్ ఎస్. మేడపాటి తెలిపారు. ఏపీ పోలీస్ ఎన్నారై సెల్ మరియు మైగ్రెంట్ రిసోర్స్ సెంటర్ (ఎంఆర్సీ సెల్) ద్వారా ఇప్పటి వరకు 1,739 గ్రీవెన్స్‌లు పరిష్కరించినట్లు తెలిపారు. వివిధ కారణాలతో ఇప్పటి వరకు విదేశాల్లో చిక్కుకుపోయిన 900 మందిని స్వదేశానికి తీసుకువచ్చామన్నారు. విదేశాల్లో టీటీడీ సహకారంతో 46 శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణమహోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సంస్థ సీఈవో పి.హేమలత రాణి, డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్‌కు గౌరవ డాక్టరేట్


టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్నకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షిప్రతినిధి, కాకినాడ: నైతిక, రాజ్యాంగ విలువలు, సామాజిక శాస్త్రాలు, కళలు, మానవీయ శాస్త్రాలు, సృజనాత్మకత, సేవాస్ఫూర్తి, సాంకేతిక అధ్యయనం చేసేలా ఉన్నత చదువుల్లో యువతను విశ్వవిద్యాలయాలు ప్రోత్సహించాలని చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. బుధవారం గవర్నర్ అధ్యక్షతన కాకినాడ జేఎన్‌టీయూ పదో స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా నేవీ మాజీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి హాజరయ్యారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్, 64 మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21 మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించడంలో దేశంలోని యువతకు మార్గనిర్దేశనం చేసే బాధ్యతను యూనివర్సిటీలు తీసుకోవాలన్నారు. ఒక ఆలోచనను స్వీకరించి, దానికి తగ్గట్టుగా కలలు కంటూ లక్ష్యాన్ని సాధించాలనే స్వామి వివేకానంద మాటలను ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేశారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..

ప్రపంచంలో భారత్ ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందిందని, సమీప భవిష్యత్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు శక్తివంచన లేకుండా కృషి జరుగుతోందని గవర్నర్ తెలిపారు. దక్షిణ చైనా సముద్రంలోని పరిస్థితులు, రష్యా–ఉక్రెయిన్‌ల వివాదం, ఇజ్రాయిల్–హమాస్‌ల వివాదం కొనసాగే అవకాశం ఉండడంతో మన దేశ తయారీ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఇదే సరైన తరుణమన్నారు. వైస్ చాన్సలర్ జీవీ ప్రసాదరాజు మాట్లాడుతూ వర్సిటీ 3.45 స్కోర్‌తో న్యాక్–ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందని వివరించారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

ప్రతిభ సమాజాభివృద్ధికి దోహదపడాలి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్




గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న ఇన్ఫోసిస్ వైస్ చైర్మన్ సుధా నారాయణమూర్తి, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్. డి.లిట్ పట్టా అందుకుంటున్న లక్ష్మీపార్వతి

సాక్షి, రాజమహేంద్రవరం: విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పొందిన జ్ఞానం, ప్రతిభ తమ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసేలా సుస్థిరమైన నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. అదే సమయంలో ప్రాథమిక విద్యలో మాతృభాషను మరువకూడదన్నారు. బుధవారం రాజానగరం మండల పరిధిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్ఫోసిస్ వైస్ చైర్మన్ సుధానారాయణమూర్తి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సాహిత్య రంగంలో చేసిన పరిశోధనలకు తెలుగు అకాడమీ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి డి.లిట్ (డాక్టర్ ఆఫ్ లెటర్స్) పట్టా అందుకున్నారు. సామాజిక రంగంలో పీహెచ్‌డీ చేసిన జక్కంపూడి విజయలక్ష్మి పట్టా పొందారు. మూడేళ్ల స్నాతకోత్సవాలకు సంబంధించి వివిధ కోర్సుల్లో 500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 12 మందికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. మిగిలిన పీజీ కోర్సులు, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులకు సంబంధించిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, నన్నయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రోత్సాహంతోనే పరిశోధన: లక్ష్మీపార్వతి

'రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. అందుకు నేనే నిదర్శనం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సాహంతోనే ఈ వయసులో సైతం పరిశోధన చేసే అవకాశం దక్కింది.' అని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజానేతల జీవిత చరిత్రలు– సమగ్ర పరిశీలన.' అనే అంశంపై లక్ష్మీపార్వతి చేసిన పరిశోధనలకు గానూ వర్సిటీ డి.లిట్ పట్టాను అందుకున్నారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో రోడ్ల విషయంలో కూడా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వైద్య సాయం నిమిత్తం డోలీల్లో తరలిస్తున్నారంటూ న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రణతి వాదనలు వినిపించారు. వైద్య ఆరోగ్య శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది అప్పాధర రెడ్డి వాదనలు వినిపిస్తూ గిరిజనులు కొండ దిగొచ్చిన తరువాత అంబులెన్స్ సదుపా యం ఉందని తెలిపారు.ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రోడ్డు వేయవచ్చు కదా అంటూ..నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.